ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 08.07.2026 | సంపుటి : 12 సంచిక : 349 | పేజీలు : 12 వెల : రూ. 4/-




హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు

182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం

రూ.75 వేల కోట్ల ఆదాయం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి): తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో

మిగతా 9లో..

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ ఒకటినే జీతాలు

ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు
- పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్
- సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరేందుకు ఉపయుక్తం
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్,జూలై7(జనంసాక్షి): పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీ ఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు

మిగతా 2లో..




కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. చిత్రంలో డిప్యూటీసీఎం భట్టి మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, తదితరులు

## కేసీఆర్ సరేనంటే కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

- ఎప్పుడైనా.. ఎంత సమయమైనా ఆయన కోసం కేటాయిస్తాం
- ఆయన వాదన సరైనదైతే ప్రాజెక్ట్ నిర్వహణ ఆయనకే అప్పగిస్తాం
- ముమ్మాటికీ కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారు
- నిపుణుల సలహాలు పక్కన పెట్టడంతోనే సమస్యలు తలెత్తాయి
- కేటీఆర్, హరీశ్‌లు ఆర్థిక ఉగ్రవాదులు
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శలు

## తెలంగాణ అభివృద్ధిలో మహిళలు, పిల్లలదే కీలక పాత్ర

- మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు
- గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారం
- నాచారంలో బాలామృతం ప్లాంట్ ప్రారంభంలో సీఎం రేవంత్

2లో..

## ధరణి పోర్టల్‌తో భూ అక్రమాలపై సిట్

సమగ్ర దర్యాప్తు దిశగా ప్రభుత్వం కీలక చర్యలు



హైదరాబాద్,జూలై7(జనంసాక్షి): ధరణి పోర్టల్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం విజిలెన్స్ విభాగం ద్వారా లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ జరిపించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వెలుగులోకి వస్తున్న అక్రమాలపై ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. భూమి యజమాని వేలిముద్ర, ఓటీపీ ధ్రువీకరణ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. భద్రతా వ్యవస్థలను బైపాస్ చేస్తూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను వినియోగించి లావాదేవీలు నిర్వహించినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. అంతేకాకుండా విదేశాల్లో ఉన్న భూ యజమానులకు తెలియకుండానే వారి పేర్లలో మార్పులు చేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించనున్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో జరిగిన సుమారు రూ.8 లక్షల లావాదేవీలకు సంబంధించిన ఆడిట్ ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ పరిశీలనలో దాదాపు 22 వేల రిజిస్ట్రేషన్లలో తేడాలు ఉన్నట్లు సమాచారం. అలాగే 'ఘోస్ట్ ఐడీలు' ఉపయోగించి లక్షల ఎకరాల భూ రికార్డులను మార్చినట్లు ఆరోపణలు రావడం మరింత సంచలనంగా మారింది. కొందరు సిస్టమ్‌లోని టైమ్ క్లాక్‌ను మార్చి పాత తేదీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలుస్తోంది. కేరళకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సంస్థ నిర్వహించిన పరిశీలనలో ఈ అంశాలు బయటపడినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవడం, భూ రికార్డుల భద్రతను మరింత బలోపేతం

మిగతా 2లో..

## 38మందికి ఉరి




- మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష
- గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన ధర్మాసనం

అహ్మదాబాద్(జనంసాక్షి): దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం

మిగతా 2లో..



## 10న రైతు ఆశీర్వాద సభ

రద్దయిన చోటనే తిరిగి నిర్వహణ

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

2లో..

## డీఎస్పీ భీమ్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్

కోర్టు ఆదేశాల అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలింపు

## అబ్బే నాకు తెలియదే..

- ఇథనాల్ కలపడం వల్ల కార్లలో సమస్యలొస్తున్నాయా?
- అయితే అలాంటి ఒక్క కారును చూపించండి
- అమాయకంగా ప్రశ్నించిన కేంద్రమంత్రి గడ్కరీ



న్యూఢిల్లీ(జనంసాక్షి): 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం వల్ల వాహనాల ఇంధన సామర్థ్యం తగ్గుతుందంటూ వస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తోసిపుచ్చారు. ఇ-20 పెట్రోల్ వల్ల సమస్య వచ్చిన ఒక్క కారు పేరు అయినా చెప్పాలన్నారు. ఇథనాల్ బ్లెండింగ్‌పై కావాలనే విమర్శకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇ -20 పెట్రోల్ వాడకం వల్ల ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఇ20 పెట్రోల్ కారణంగా సమస్య ఎదుర్కొంటున్న ఒక్క కారునైనా చూపించండి. ఇథనాల్ బ్లెండింగ్‌పై జరుగుతోన్న ప్రచారం కేవలం పెయిడ్ క్యాంపెయిన్. అందులో వాస్తవం లేదు" అని ఆయన కొట్టిపారేశారు. దేశం ఏటా ఇంధన

మిగతా 2లో..

## ఇ20 పెట్రోల్‌తో కొన్ని సమస్యలు వాస్తవమే

ఏఆర్‌ఏఐ నివేదిక వెల్లడి

2లో..

వాడుకలోకి ఇ-25 పెట్రోల్..

ఇంకా ఆ ప్రతిపాదనలు లేవు : కేంద్రం

## విచారణ పూర్తయ్యే వరకు మౌనంగా ఉంటా

- ఎట్టకేలకు నోరువిప్పిన శ్రీరామ జన్మభూమి ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్
- 'సిట్' తుది నివేదిక సమర్పించిన తర్వాతే ఒక్కో అంశంపై స్పందిస్తానని వెల్లడి





లక్నో(జనంసాక్షి): అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ కేసులో ముమ్మర దర్యాప్తు కొనసాగుతున్న వేళ.. శ్రీరామ జన్మభూమి ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ నోరువిప్పారు. తనపై వస్తోన్న ఆరోపణలు నిరాధారమన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన తర్వాతే ఈ వ్యవహారంపై స్పందిస్తానని అన్నారు. ఈ మేరకు ఓ లేఖను విడుదల చేశారు. "రామ మందిరంలో విరాళాల లెక్కింపు సమయంలో చోరీ జరిగిందని జూన్ 6వ తేదీ నుంచి ఎన్నో వదంతులు, చర్చలు

మిగతా 2లో..

### దొంగిలించిన నోట్లకట్టలను జేబులు, బూట్లలో దాచి..

- 39 రోజుల్లో 70 సార్లు చోరీ!
- ఈ వ్యవహారాన్నంతా సీసీ కెమెరాల్లో గమనించినా పట్టించుకోని అధికారులు
- అయోధ్య విరాళల కేసులో కీలక ఆధారాలు 'సిట్' చేతికి..

2లో..

## కాక్రోచ్ పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించండి




ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి): కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన ఎక్స్ ఖాతా ను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నీట్ పేపర్ లీక్, రీ-టెస్ట్ సమయాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులలో గందరగోళం సృష్టించే అవకాశం ఉందనే కారణంతో ఆ పార్టీ ఎక్స్ ఖాతాపై నిషేధం విధించినట్లు కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానానికి తెలిపారు. నీట్ పరీక్ష ఇప్పటికే ముగిసినందున.. నిషేధం తొలగించాలని కోర్టు ఆదేశించింది. తమ పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. అనధికారిక పొలిటికల్ క్యాంపెయిన్‌ను ప్రారంభించిన వారం రోజుల్లోనే తమ

మిగతా 2లో..

## వయనాడ్‌లో వర్షబీభత్సం

భారీ వానలకు ఒక్కసారిగా విరిగిపడిన కొండచరియలు • ఘటనలో ఇద్దరు మృతి.. శిథిలాల కింద చిక్కుకున్న మరో 30 మంది • కొనసాగుతున్న సహాయక చర్యలు




కేరళం(జనంసాక్షి): కేరళలోని వయనాడ్‌లో మరోసారి కొండచరియలు బీభత్సం సృష్టించాయి. నిన్న రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అనక్కంపొ యిల్- కల్లాడి సొరంగం నిర్మాణ స్థలం వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. కల్లాడిలోని మీనాక్షి వంతెనకు సమీపంలో మంగళవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా.. శిథిలాల కింద మరో 30 మంది వరకు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కొండచరియల కింద చిక్కుకున్న కొంతమంది

మిగతా 2లో..

## భారీ వర్షాలకు కాశ్మీర్ కకావికలం

- ఆకస్మిక వరదలు.. విరిగిపడ్డ కొండచరియలు
- ముంబైలో కుంభవృష్టి.. మహారాష్ట్రలో పలు ప్రాంతాల్లో 600 మిమీ వర్షపాతం
- వీధులన్నీ జలమయం..బయటకు రావద్దని హెచ్చరిక
- గుజరాత్‌లోనూ భారీ వర్షాలు

2లో..



## ఇండోనేసియా చేతికి మన 'బ్రహ్మోస్త్రం'



బ్రహ్మోస్‌తో పాటు 'అస్త్ర' క్షిపణుల సరఫరా కోసం డీల్

ప్రధాని మోదీ పర్యటనలో ఇరుదేశాల మధ్య కుదిరిన ఒప్పందం

జకార్తా(జనంసాక్షి): 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసిన మన సూపర్ సోనిక్ క్షిపణి 'బ్రహ్మోస్'పై ప్రపంచ దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి. తాజాగా ఈ క్షిపణుల కోసం భారత్‌తో ఇండోనేసియా ఒప్పందం చేసుకుంది. ప్రధాని మోదీ జకార్తా పర్యటనలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రహ్మోస్‌తో పాటు 'అస్త్ర' క్షిపణుల సరఫరా కోసం ఇరుదేశాల మధ్య డీల్ కుదిరింది. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇండోనేసియాలో ఉన్న ప్రధాని మోదీ మంగళవారం ఆ దేశాధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య పలు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. క్రిటికల్ మినరల్స్, టెక్నాలజీ, ఆహార భద్రత, సముద్ర జలాల భద్రత, ఔషధాలు, మిలిటరీ వంటి రంగాల్లో పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందాలు కుదిరాయి. ఇండోనేసియా సైన్యానికి బ్రహ్మోస్ క్షిపణులను అందించేందుకు భారత్ అంగీకరించింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో జకార్తా భద్రతా సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ఈ క్షిపణులు దోహదం చేయనున్నాయి. భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎయిర్ టు ఎయిర్ 'అస్త్ర' క్షిపణులను ఇండోనేసియా దిగుమతి చేసుకోనుంది. 'సిందూర్'లో ఈ క్షిపణుల

మిగతా 9లో..

## హార్మూజ్‌లో పూర్తిస్థాయిలో తగ్గని ఉద్రిక్తత

ఖమేనీ అంత్యక్రియల వేళ జలసంధిలో హార్మూజ్‌లో నౌకలపై ఇరాన్ దాడులు

ట్రంప్ ఆగ్రహం.. అయినా ఒప్పందానికే మొగ్గు..

టెహ్రాన్(జనంసాక్షి): అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం ముగింపు కోసం అవగాహన ఒప్పందం కుదిరినా.. హార్మూజ్‌లో ఉద్రిక్తతలు పూర్తిస్థాయిలో తగ్గిపోలేదు. తాజాగా ఆ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలపై క్షిపణి దాడి జరిగింది. ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ ఆ దాడికి పాల్పడినట్లు అమెరికా అధికారి ఒకరు వెల్లడించారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి.మరోవైపు, హార్మూజ్‌లో

మిగతా 2లో..



## 'టీఆర్ఎస్'పేరును మా పార్టీకే కేటాయించండి

ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత

న్యూఢిల్లీ(జనంసాక్షి): పార్టీ పేరు ఖరారుపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన

మిగతా 2లో..

## కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

- నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు?
- మంత్రిగా నా శాఖలో ఆయన జోక్యం చేసుకోవడమేంటీ?
- సీఎం రేవంత్‌కు మంత్రి కొండా సురేఖ లేఖ

హైదరాబాద్,జూలై7(జనంసాక్షి): స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను , నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు,

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
బుధవారం 08.07.2026

## అబ్బే నాకు తెలిదే..

దిగుమతుల కోసం రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.ఇథనాల్ తయారు చేయాలనే నిర్ణయంతో రైతులకు దాదాపు రూ.45వేల కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు.

## ఇ20 పెట్రోల్‌తో కొన్ని సమస్యలు వాస్తవమే

న్యూఢిల్లీ(జనంసాక్షి):20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ కొన్ని కథనాలు వెలుగులోకి వస్తున్నాయి. పాత వాహనాల సామర్థ్యాన్ని ఇది దెబ్బతీస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇ20 పెట్రోల్ వల్ల పాత వాహనాల పనితీరులో మార్పులు రావొచ్చని ఆటోమో టివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నివేదికలు వెల్లడించాయి.ఈ అధ్యయనం ప్రకారం.. తక్కువ ఇథనాల్ కలిగిన ఇ10 బ్లెండ్ కోసం రూపొందించిన వాహనాలలో ఇ20 పెట్రోల్‌ను వాడటం వల్ల ఫ్యూయల్ సిస్టమ్‌లోని హోజ్‌లు, గాస్కెట్‌లు, సీల్స్ సహా రబ్బరు భాగాలు క్రమంగా క్షీణించే అవకాశం ఉంది. ఈ ఇంధనాన్ని ఎక్కువ కాలం వాడిన తర్వాత ఆయా భాగాలను మార్చాల్సి రావొచ్చని నివేదికలు హెచ్చరించాయి. అయితే.. దీనివల్ల వాహనాల్లోని ఇతర భాగాలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండదని.. ఇ20 ఇంధనాన్ని ఉపయోగించే ఇ10-అనుకూల వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు చట్టబద్ధంగా నిర్దేశించిన పరిమితుల్లోనే ఉన్నాయని తెలిపాయి.

## ఇంకా ఆ ప్రతిపాదనలు లేవు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియలో భాగంగా ఇ-25పెట్రోల్‌ను కూడా తీసుకొస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ప్రస్తుతం అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేసింది. పలు వాహన మోడళ్లపై ఇ-25 పెట్రోల్ ఇంకా పరీక్షల దశలోనే ఉందని పేర్కొంది. ఆ నివేదికలు రాకముందే ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని వెల్లడించింది. ఇ-25 పెట్రోల్ రోల్‌అవుట్ చేశారంటూ కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని కేంద్రం పేర్కొంది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికి ఇలాంటివి వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని కోరింది. నిబంధనలకు అనుగుణంగా అన్ని దశల పరీక్షల్లో సత్ఫలితాలు వచ్చాకనే ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియ తీసుకొచ్చామని కేంద్రం స్పష్టం చేసింది. ఇ-20 పెట్రోల్ పూర్తిగా సురక్షితమైనదని మరోసారి స్పష్టం చేసింది. కాగా, ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా సుమారు 20 కోట్ల ద్విచక్ర వాహనాలు, 20 లక్షల ఫోర్ వీలర్ వాహనాలు నడుస్తున్నాయని, వాటిలో ఎలాంటి సమస్యలూ రాలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

### విచారణ పూర్తయ్యే వరకు మౌనంగా ఉంటా

జరుగు తున్నాయి. వ్యక్తిగతంగా నా పైనా ఎంతోమంది నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వాటిపై దర్యాప్తు జరుగుతున్నందున ప్రస్తుతానికి మౌనంగా ఉండాలని నిశ్చయించుకున్నా" అని పేర్కొన్నారు.'సిట్' తుది నివేదిక సమర్పించిన తర్వాతే ఒక్కో అంశంపై స్పందిస్తానని చంపత్ రాయ్ స్పష్టం చేశారు. అప్పుడు వాస్తవాలన్నీ బయటపడతాయని లేఖలో పేర్కొన్నారు. 1991 నుంచి అక్కడే పని చేస్తున్నానని, నాలుగున్నర దశాబ్దాలుగా ప్రచారక్‌గా సేవలందిస్తున్నానని చెప్పారు.

### దొంగిలించిన నోట్ల కట్టలను జేబులు, బూట్లలో దాచి..

లక్నో(జనంసాక్షి):అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో కీలక ఆధారాలను సేకరించినట్లు సిట్ వెల్లడించింది. ఈ విషయంపై యూపీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 వరకు విరాళాల లెక్కింపు చేపట్టిన వ్యక్తుల్లో కొందరు డబ్బులు అపహరించినట్లు సీసీటీవీ దృశ్యాల్లో తేలిందని పేర్కొంది. ఈ 39 రోజుల్లో లెక్కించే సమయంలో కొంతమంది సిబ్బంది కరెన్సీ నోట్ల కట్టలను, చిల్లరను తమ దుస్తులు, జేబులు, బూట్లలో దాచిపెట్టినట్లు సీసీటీవీ రికార్డుల్లో కనిపించిందని తెలిపింది.డబ్బును సిబ్బంది దొంగిలిస్తున్నట్లు చూసిన కొందరు అధికారులు కూడా వారిని ఆపడానికి ప్రయత్నించలేదని సిట్ పేర్కొంది. నిందితులు దాదాపు 70 సార్లు దొంగతనాలకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా ట్రస్ట్ సభ్యులు, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, లెక్కింపు సిబ్బందిని విచారించామన్నారు. వారి వాంగ్మూలాల ప్రకారం ఏప్రిల్ 27కి ముందు కూడా విరాళాల చోరీ జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పాత సీసీటీవీ ఫుటేజ్ అందుబాటులో లేకపోవడంతో ఈ విషయంలో ఆధారాలు సేకరించడం సవాలుగా మారిందన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు ఐదేళ్ల ఖాతాలను రీఆడిట్ చేస్తున్నామని.. బ్యాంకు రికార్డులు, విరాళాల పత్రాలు, ఆలయ నిర్మాణ వ్యయాలు, బంగారం, వెండి వస్తువులతో సహా అన్ని ఆర్థిక లావాదేవీల రికార్డులు పరిశీలిస్తున్నామని తెలిపారు.

అయోధ్య ట్రస్టు తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్

దర్యాప్తులో భాగంగా ఆలయంలో భద్రతా తనిఖీలు, బయోమెట్రిక్ హాజరు, డిజిటల్ పరికరాలపై పరిమితులు, సీసీటీవీ పర్యవేక్షణ వంటి చర్యల్లో అనేక లోపాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లోపాలను వినియోగించుకుని నిందితులు చోరీకి పాల్పడ్డారని తెలిపారు. విలువైన కానుకల నిర్వహణ, డాక్యుమెంటేషన్, తూకం వేయడం వంటి వాటిల్లోనూ పలు విధానపరమైన లోపాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రాలకు ప్రమేయం ఉన్నట్లు నిర్ధరించారు. సీసీటీవీ దృశ్యాల్లో అవినాష్ శుక్లా, మనీష్ కుమార్ యాదవ్‌లు పలుమార్లు నగదు, నగలను అపహరిస్తున్నట్లు రికార్డ్ అయ్యిందని పేర్కొన్నారు.

### కాక్రోచ్ పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించండి

'ఎక్స్' ఖాతాను నిలిపివేశారని దీప్కే పిటిషన్‌లో తెలిపారు. నిలిపివేసే సమయానికి ఆ ఖాతాకు దాదాపు రెండు లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. సీజేపీ పేరిట వెబ్‌సైట్ కూడా ప్రారంభించారు. ఇదీ చదవండి: అహ్మదాబాద్ వరుస పేలుళ్ల కేసు.. 38 మందికి మరణశిక్ష

### హర్మూజ్‌లో ఆగని ఉద్రిక్తలు

ఒమన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తున్న ట్యాంకర్ ఒకటి మంటల్లో చిక్కుకుందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సెంటర్ వెల్లడించింది. ఈ దాడికి కూడా ఇరానే కారణమని అనుమానిస్తోంది. ఈ ఘటన వల్ల పర్యావరణంపై ఎలాంటి ప్రభావం లేదని పేర్కొంది. ఈ రెండు ఘటనల్లో ప్రాణనష్టం వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఇరాన్ దివంగత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ అంతిమయాత్ర జరుగుతోంది. ఈ సమయంలో ఈ వరుస దాడులు జరగడం గమనార్హం.

మరోసారి ట్రంప్ హెచ్చరికలు..

అవగాహన ఒప్పందం నేపథ్యంలో హర్మూజ్‌లో ఎలాంటి అంతరాయాలు కలిగించమని ఇరాన్ అంగీకరించింది. అయితే.. ఇటీవల ఘర్షణల సమయంలో తమకు మద్దతు ఇచ్చిన దేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామంటూ ఇరాన్ చెప్తోంది. ఆ దేశ వైఖరి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను అసహనానికి గురిచేస్తోంది. దాంతో మరోసారి హెచ్చరికలు చేసింది. "అమెరికా ఒప్పందం కుదుర్చుకోవడమో లేకపోతే.. పనిపూర్తి చేయడమో చేస్తుంది. 'పని ముగించడం' అంతకష్టమేమీ కాదు. గంటల్లో వారి వంతెలను కూల్చివేయగలం. వారి విద్యుత్తు సరఫరాను నిలిపివేయగలం. వారి దగ్గర డబ్బులేదు. పరిస్థితులు ఇలా ఉన్నా.. నేను ఒప్పందానికే మొగ్గుచూపుతాను. ఎందుకంటే యుద్ధ ప్రభావం ఎవరిపైనా పడటం నాకు ఇష్టంలేదు" అని ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యలు చేశారు.

## 10న రైతు ఆశీర్వాద సభ

ఖమ్మం(జనంసాక్షి): గత నెలలో రద్దయిన రైతు ఆశీర్వాద సభను తిరిగి ఈ నెల 10న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరో భారీ బహిరంగ సభకు సిద్ధమైంది. 10వ తేదీన ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ' నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భారీ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభాస్థలాన్ని స్వయంగా పరిశీలించారు..

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటినే జీతాలు

మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానిటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్ఆర్డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కేసీఆర్ సరేనంటే కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

హైదరాబాద్,జూలై7(జనంసాక్షి):కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే.. అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడదామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత సమయం ఇస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ కేసీఆర్ వాదనలో బలముందని రుజువైతే.. రాబోయే మూడేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను, మేజర్ కాంట్రాక్ట్‌ను కేసీఆర్‌కే అప్పగిస్తామని.. ఆయన ఇష్టం వచ్చిన వాళ్లకు ఆ కాంట్రాక్ట్ ఇచ్చుకోవచ్చంటూ సంచలన సవాల్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లను 'ఆర్థిక ఉగ్రవాదులుగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ కట్టిన ఇతర ప్రాజెక్టులను, ప్రజాభవన్, సెక్రటేరియట్లను తాము వాడుతున్నామని.. కానీ, కాళేశ్వరం విషయంలో గత ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరుపయోగంగా మారిందని మండిపడ్డారు. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని ఏ ఎక్స్‌పర్ట్స్ కమిటీ కూడా చెప్పలేదని రేవంత్ గుర్తుచేశారు. ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని, భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాకవేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని, కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదని ఆయన అన్నారు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని ఆయన తెలిపారు. కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని పేర్కొన్నారు. తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు నామకరణం చేశారని,ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్దాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. అబద్దాలు చెప్పడంలో వారికి వారే సాటి అని మండిపడ్డారు. ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు. అబద్దాల రావుల మాటలను నాటి గవర్నర్ నమ్మారని రేవంత్ చెప్పుకొచ్చారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతో ప్రాజెక్టును ప్రారంభించారని ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి యజ్ఞాలు చేశారని విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, 2022లో వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందన్నారు. 2023 అక్టోబర్‌లో ఆరు పిల్లర్లు కూలిపోయాయని, బ్యారేజీలు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొప్పున నింపుతారని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, మేడిగడ్డను చూపించి బంగాళాఖాతాన్ని తెచ్చినట్టు చేశారన్నారు. నీళ్లు నింపడం వల్ల బ్యారేజీలపై ఒత్తిడి ఎక్కువైందని, ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్ల ప్రాజెక్టు కుంగిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## తెలంగాణ అభివృద్ధిలో మహిళలు, పిల్లలదే కీలక పాత్ర

హైదరాబాద్,జూలై7(జనంసాక్షి):తెలంగాణ సమాజ అభివృద్ధిలో మహిళలు, పిల్లల పాత్రే అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. నాచారంలో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన బాలామృతం ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులందరికీ బ్రేక్‌ఫాస్ట్, లంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వ స్కూళ్లలోనే టీచర్లు కూడా బ్రేక్‌ఫాస్ట్, లంచ్ చేయాలని సీఎం నిర్ణయించారు. ఇక్కడ తయారు చేసే బాలమృతం ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసే విధంగా ప్లాంట్ రూపొందిందని అన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఆరేళ్లపాటు బాలామృతం పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా ఈ ఎ÷-లాంట్ అభివృద్ధి చెందుతుందన్నారు. పిల్లలకు ఓట్లు లేకపోయినా.. వారి భవిష్యత్ పట్ల తమ ప్రభుత్వానికి శ్రద్ధ ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళల సంక్షేమంపై మాట్లాడుతూ.. ప్రజా పాలన వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, దీనివల్ల పనిచేసే మహిళలకు నెలకు 10 వేల వరకు ఆదా అవుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరు మీదే ఇస్తున్నామని.. త్వరలోనే హైదరాబాద్ సిటీలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు పంచుతామని సీఎం భరోసా ఇచ్చారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇకపోతే రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాచారంలో రూ.40 కోట్లతో నిర్మించిన బాలామృతం తయారీ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. తయారీ వివరాలను అక్కడి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ ద్వారా గంటకు 18 టన్నుల బాలామృతం తయారు చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. మరోవైపు త్వరలోనే లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తామని సీఎం చెప్పారు. 'ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 4.5లక్షల ఇళ్లు కట్టాం. పట్టణాల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2034లోగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. విద్యార్థుల కోసం ఏటా రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాజకీయాలకతీతంగా ఉప్పల్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటా అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

### ధరణి పోర్టల్‌తో భూ అక్రమాలపై 'సిట్'

చేయడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వం చేపట్టబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## 'టీఆర్ఎస్'పేరును మా పార్టీకే కేటాయించండి

రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

## కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె లేఖలో మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తన్ను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల దేవాదాయ శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియం శ్రీహరిపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొండా సురేఖ తన లేఖలో కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా కడియం దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. దేవాలయాలకు సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ, సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని సీఎం రేవంత్‌రెడ్డికి సురేఖ విజ్ఞప్తి చేశారు.

### డీఎస్పీ భీమ్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్

హైదరాబాద్,జూలై7(జనంసాక్షి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన డీఎస్పీ భీమ్‌రెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. భారీ ఎత్తున అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో ఏసీబీ అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ తనిఖీల్లో ఏకంగా రూ. 300 కోట్లకు పైగా విలువైన అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, కోర్టు ముందు హాజరుపరిచారు. కేసు తీవ్రతను పరిశీలించిన న్యాయస్థానం భీమ్‌రెడ్డికి 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాల అనంతరం పోలీసులు ఆయన్ను గట్టి భద్రత నడుమ చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# వయనాడ్‌లో వర్షబీభత్సం

కార్మికులను సహాయక సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా వీటికి ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో దాదాపు 100 మంది నివసిస్తున్నారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొండచరియల కారణంగా మలప్పురం - వయనాడ్ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు, మీనాక్షి వంతెన వద్ద నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ప్రమాదం గురించి తెలియగానే రాష్ట్ర ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. వీలైనంత త్వరగా కార్మికులను రక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రులు అనిల్ కుమార్, సిద్దిఖీ వయనాడ్‌కు బయల్దేరారు.వయనాడ్‌లో 2024లోనూ కొండచరియలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. నాడు ముండక్కై, చూరల్‌మాలా ప్రాంతాల్లో బండరాళ్లు విరిగిపడి 298 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.వయనాడ్ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారీగా మట్టి, బండరాళ్లు ఒక్కసారిగా కొండపై నుంచి కూలిపడి నిర్మాణ ప్రాంతాన్ని పూర్తిగా కప్పివేశాయి. ప్రమాదం సంభవించగానే అక్కడ ఉన్న కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో కనీసం ఐదుగురు గాయపడగా, మరికొందరు మట్టిలో చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు కలిసి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు ఈ ప్రమాదంపై కేరళం ముఖ్యమంత్రి వి.డి.సతీషన్ వెంటనే జిల్లా మంత్రులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక, పునరావాస చర్యలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఆదేశించారు. వయనాడ్‌కు వెళ్లి సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు అనిల్ కుమార్, సిద్ధిక్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉన్నతాధికారులు అగ్నిమాపక, పోలీసు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్డీఆర్ఎఫ్) బృందాలను రంగంలోకి దింపి సహాయక చర్యలు చేపట్టారు. యనాడ్‌లో సోమవారం నుంచి భారీ వర్షాలు పడుతుండగా సొరంగం పనులను అదే రోజు నుంచి ప్రాజెక్టు అధికారులు నిలిపివేశారు. ఆ ప్రాంతంలో 24 గంటల వ్యవధిలోనే సుమారు 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. సొరంగ మార్గం ప్రాజెక్టు కోసం పని చేసే కార్మికులు నివసించే వసతి గృహంపై కొండచరియలు పడ్డాయి. అలాగే, కొన్ని నివాస గృహాలు, హోమ్‌స్టేలపైనా భారీగా మట్టి, రాళ్లు వచ్చిపడ్డాయి. దీంతో ముగ్గురు కార్మికులు మృతిచెందారు.

### భారీ వర్షాలకు కాశ్మీర్ కకావికలం

**శ్రీనగర్,జూలై7(జనంసాక్షి):**భారీ వర్షాలు జమ్మూకశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. దోడా జిల్లాలో మంగళవారం ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరద, బండరాళ్లు కొట్టుకురావడంతో తాత్రి పట్టణంలో పలువురి ఇళ్లు, దుకాణాలు, వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాణనష్టం ఏమీ జరగలేదని అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా దోడా, కిష్త్వార్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు రావడం ఇది మూడోసారి. మంగళవారం సంభవించిన వరదలకు తాత్రి పట్టణంలో రోడ్డుపక్కన నిలిపిన అనేక వాహనాలు మట్టిలో కూరుకుపోగా, కొన్ని చీనాబ్ నదిలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదల కారణంగా దోడా-కిష్త్వార్ జాతీయ రహదారి తాత్రి వద్ద మూసుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. రహదారిని పునరుద్ధరించే పనులను అధికారులు చేపట్టారు. వదంతులు నమ్మవద్దని, ప్రజలు అధికారిక సమాచారం కోసం కంట్రోల్ రూం లేదా జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని డిప్యూటీ కమిషనర్ కృష్ణన్ లాల్ సూచించారు.

**గుజరాత్‌లో భారీ వర్షాలు**

అహ్మదాబాద్:భారీ వర్షాలకు గుజరాత్‌లోని నీటి పారుదల ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. జోరువానలు గుజరాత్ అంతటా విస్తారంగా కురుస్తున్నాయి. దీంతె వాగులు వంకలు పొంగుతున్నాయి. భావ్‌నగర్ జిల్లా పాలితానాలోని శెత్రుంజీ డ్యామ్‌కు వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో జలాశయం 59 గేట్లను ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తున్న దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి.

ముంబైని ముంచెత్తిన కుంభవృష్టి

దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముంబైలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైలు సేవలు చాలా వరకు నిలిచిపోయాయి. కొన్ని విమాన సర్వీసులు రద్దు కాగా, వందలాది విమానాలు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత 24 గంటల వ్యవధిలో మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో 600 మిలీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో ముంబై-పుణె మార్గంలోని కర్జత్-లోనావాలా ఘాట్ రోడ్డులో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ రూట్‌లో రెండ్రోజులుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక, పుణె జిల్లాలోని ప్రముఖ హిల్ స్టేషన్ అయిన లోనవాలాలో గత 24 గంటల వ్యవధిలో 670 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ముంబై, థానే, పుణె, పాల్ఘర్ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఐఎండీ తాజా అంచనాల ప్రకారం, మహారాష్ట్రలోని కోంకణ్ ప్రాంతంతో పాటు పశ్చిమ కనుమల పరిసరాల్లో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు. ఇక, ముంబైలో మంగళవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ విభాగం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

### 2008 వరుస బాంబు పేలుళ్ల కేసు..

## 38మందికి ఉరి

ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం.2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలి

- మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు డిమాండ్
- జీజీహెచ్ గద్వాల మెడికల్ హాస్పిటల్ ముందు ధర్నా




గద్వాల (జనంసాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో, కాలేజీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, అలాగే ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జీజీహెచ్ మెడికల్ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ కరోన సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడటంలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్వైజర్స్ సిబ్బంది అత్యంత కీలకమైన పాత్ర పోషించారని,అయినప్పటికీ అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూనే ఆసుపత్రిని శుభ్రంగా ఉంచుతూ, శ్రమదోపిడీ గురౌవుతున్నారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీవించేందుకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు పోరాటం చేస్తున్నాయని పేర్కొన్నారు. జూలై 9న హైదరాబాద్ కోఠిలోని కమీషనర్ కార్యాలయం ముందు మహాధర్నా ఉంటుందని ఆయన ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ప్రభుత్వం చొరవ తీసుకుని మా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి జి రంగన్న మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి,కార్యదర్శి పరశు రామ్, సూపర్వైజర్స్ భాష నాగరాజు సెక్యూరిటీ లక్ష్మణ్ మతీన్, సుధాకర్,స్వీపర్ అంజనమ్మ, చిట్టెమ్మ, వెంకటేశ్వరి, నాగేంద్రమ్మ , మహేశ్వరి, కిష్టమ్మ,పేషంట్ కేర్ వెంకటేష్, మునరీష బేగం, హేమంత్ తోపాటు జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

# 106 కేసుల సీరియల్ దొంగ అరెస్ట్

- రూ. కోట్ల విలువైన చోరీల వెనుక నేరచరిత్ర
- 22.5 తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.25 వేల నగదు స్వాధీనం
- 26 తాజా ఇంటి దొంగతనాలు ఛేదించిన సీసీఎస్ పోలీసులు
- పోలీసు బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్





సంగారెడ్డి జులై 07( జనం సాక్షి) : 16 కేసులు నిందితుడిని సీసీఎస్ పోలీసులు, బృందం దొంగను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 22.5 తులాల బంగారు ఆభరణాలు, 60 తులాల వెండి ఆభరణాలు, రూ.25 వేల నగదును స్వాధీనం, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి. 2007 నుంచి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతూ బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను దొంగిలించి విక్రయించడం లేదా తాకట్టు పెట్టడం ద్వారా అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడిపై హైదరాబాద్, సంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 106 కేసులు నమోదయ్యాయని, అందులో 80 పాత కేసులు, 26 కొత్త కేసులు ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు 19 సార్లు జ్యూడీషియల్ రిమాండ్‌కు వెళ్లిన అతడు, 25కుపైగా కేసుల్లో శిక్షలు అనుభవించినప్పటికీ తన నేరప్రవర్తన మార్చుకోలేదని పేర్కొన్నారు. 2024లో మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి చర్లపల్లి సెంట్రల్ జైలుకు పంపగా, 14 నెలల జైలు శిక్ష అనంతరం 2025 అక్టోబర్ 17న బెయిల్‌పై విడుదలైన మూడు రోజులకే తిరిగి దొంగతనాలు ప్రారంభించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. గత ఎనిమిది నెలల్లో మియాపూర్, దుండిగల్, గుమ్మడిదల, హత్నూర, పోచారం ఐటీ కారిడార్, మేడిపల్లి, పటాన్‌చెరు, అబ్దుల్లాపూర్‌మెట్, ఐడీఏ బొల్లారం, వనస్థలిపురం, జీనోమ్ వ్యాలీ, శామీర్‌పేట్, కీసర పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 26 ఇంటి దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఇళ్లలో ఎవరూ లేని సమయాన్ని గమనించి, వెనుక వైపు నుంచి ప్రవేశించి చోరీలకు పాల్పడటం, అనంతరం తెల్లవారుజాము వరకు పొదల్లో దాక్కొని తప్పించుకోవడం అతని నేరపద్ధతిగా పోలీసులు గుర్తించారు. దొంగిలించిన ఆభరణాల్లో కొంత విక్రయించగా, మరికొంత తాకట్టు పెట్టి వచ్చిన డబ్బును విలాసవంతమైన జీవనశైలికి ఖర్చు చేసినట్లు వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం మేరకు బొంతపల్లి గ్రామ కమాన్ సమీపంలో సీసీఎస్, గుమ్మడిదల పోలీసులు సంయుక్తంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 22.5 తులాల బంగారు ఆభరణాలు, 60 తులాల వెండి ఆభరణాలు, రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకుని జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు వి. శివకుమార్, చి. ప్రసాద్‌రావు, జిన్నారం సీఐ పి. రమణరెడ్డి, సీసీఎస్ ఎస్ఐ కె. శ్రీకాంత్, గుమ్మడిదల ఎస్ఐ కె. అరుణ్‌కుమార్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు. పటాన్‌చెరు ఎస్‌డీపీఓ ప్రభాకర్ పర్యవేక్షణలో సీసీఎస్, గుమ్మడిదల పోలీసుల సమన్వయంతో ఈ కేసు విజయవంతంగా ఛేదించగలిగినట్లు ఎస్పీ తెలిపారు.

# పెన్షనర్లు గౌరవప్రదమైన జీవనం గడిపేలా చర్యలు తీసుకోవాలి

- ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సురేంద్ర చౌదరి
- ఐక్య ఉద్యమాల తోనే సమస్యలు పరిష్కారం అవుతాయి
- ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వజీర్ సింగ్




హైదరాబాద్ (జనంసాక్షి) : పెన్షనర్లు గౌరవప్రదమైన జీవనం గడిపేలా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సురేంద్ర చౌదరి అన్నారు. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు సుదరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ లో సురేంద్ర చౌదరి అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాలకు టాప్రా ఆతిథ్యం ఇచ్చింది. దేశంలోని 15 రాష్ట్రాల నుండి 72 మంది ప్రతినిధులు హాజరై దేశంలోని వివిధ రాష్ట్రాలలో రాష్ట్ర ప్రభుత్వ. పెన్షనర్ల సమస్యలపై చర్చించడం జరిగింది. సమావేశ తీర్మానాలను సురేంద్ర చౌదరి గారు వివరిస్తూ 30-35 సంవత్సరాల సర్వీసు చేసి రిటైర్ అయిన పెన్షనర్లకు గౌరవ ప్రదమైన జీవితాన్ని గడిపే పరిస్థితి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది అన్నారు. అందుకోసం వాలిడేషన్ ఆక్ట్ లాంటి చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి వజీర్ సింగ్ మాట్లాడుతూ కమ్యుటేషన్ ఆ ఫ్ పెన్షన్ రికవరీ ని 15 సం నుండి 11 సంవత్సరాలకు తగ్గించాలని, వైద్య సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఎక్జి క్యూటివ్ సమావేశం తరువాత ఓపెన్ సేషన్ లో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీకుమార్ ముఖ్య అతిథిగా హాజరై పెన్షనర్లకు ఇస్తున్న సౌకర్యాలు ఏవో ప్రభుత్వం ఔదార్యంతో ఇస్తున్నవి కావని, అవి వారి హక్కు అన్నారు. కోవిడ్ కాలంలో రద్దు చేసిన రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని కోరారు. ఉపాధ్యక్షులు క్రిష్ణమూర్తి గారు మాట్లాడుతూ సిపియస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ సదస్సులో టాప్ర గౌ అ. ఎంఎన్ రెడ్డి, అధ్యక్షులు నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి క్రిష్ణమూర్తి, కోశాధికారి అశోక్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు డా అరుణ, స్వరాజ్ కుమార్, కొండల రావు, యు అంజనేయులు, నరహరి, జనార్ధన్ రెడ్డి, రామ చంద్రుడు, వైకుంఠరావు, క్రిష్ణమోహన్, లక్ష్మినారాయణ కమల కుమారి క్రిష్ణారావు, నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## తొలిమలి దశలో ఉద్యమకారుడు నరసింహారెడ్డికి నివాళి

హైదరాబాద్ (జనంసాక్షి) : స్వరాష్ట్రం కోసం జరిగిన తొలి మలిదశ ఉద్యమాలలో పాల్గొన్న ఉద్యమ కారుడు కొమ్మిడి నరసింహారెడ్డి మృతికి తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన ఈ తరంయువకులతో కలిసి ఉత్సాహంగా పనిచేశారని గుర్తు చేశారు. ఆయన నిరాడంబర జీవితాన్ని కొనసాగించారనీ తెలియ చేశారు. ఆయన బస్సుల్లో ప్రయాణించారని, వేద కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ రిసోర్స్ సెంటర్ నిర్వహించిన వంద 100 సభలకు హాజరై చర్చల్లో పాలుపంచుకున్నారనీ గుర్తు చేశారు.

## పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



కాళేశ్వరం , జూలై 7 (జనం సాక్షి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుంది. ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాణహిత నదికి వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో గోదావరి నీటిమట్టం పెరిగి పుష్కర ఘాట్ మెట్ల కింద పవహిస్తుంది. ప్రస్తుతం నీటిమట్టం 6.5 మీటర్లుగా నమోదయింది. 1,22,440 క్యూసెక్కుల నీరు మేడిగడ్డ బ్యారేజ్ 88 గేట్ల ద్వారా కిందికి ప్రవహిస్తున్నట్లుగా అధికారులు తెలిపారు.

# మైనార్టీ స్టడీ సర్కిల్‌లో పోలీస్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి యాకూబ్ పాషా



హైదరాబాద్ (జనంసాక్షి) : పోలీస్ శాఖ చేబడుతున్న ఉద్యోగ నియామకాల్లో సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే మైనార్టీ అభ్యర్థులకు రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ వారు అందిస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యాకూబ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు 50 మంది, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు 100 మందిని మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేసి జనరల్ స్టడీస్, అర్థిమెటిక్ ఎబిలిటీ మరియు రీజనింగ్ తో పాటు ఫిజికల్ ఫిట్నెస్ యాక్టివిటీ కూడా నేర్పిస్తారని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు జతచేసి ఈ నెల 15వ తేదీ లోపు తమ తమ జిల్లాల్లోని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాల యాలలో లేదా హైదరాబాద్‌లోని మైనార్టీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సీలు, బౌద్ధులు చెందిన అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని యాకూబ్ పాషా కోరారు. మరిన్ని వివరాల కోసం 8520860785, 040-23236112, 9059050062 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# స్టీరింగ్‌పై సమయస్ఫూర్తి

- 47 ప్రాణాలకు ఆర్టీసీ డ్రైవర్ రక్షకుడు
- ప్రయాణికుల ప్రాణాలు సేఫ్



తాండూరు, జులై 7(జనంసాక్షి) అతివేగంగా ఎదురుగా వచ్చిన కారును ఢీకొనకుండా చాకచక్యంగా బస్సును పక్కకు మళ్లించి 47 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఘటన తాండూరు సమీపంలో చోటుచేసుకుంది. తాండూరు డిపోకు చెందిన టిఎస్ 34 జడ్ 0031 ఎక్స్‌ప్రెస్ బస్సు మంగళవారం ఉదయం 06:30 గంటలకు 47 మంది ప్రయాణికులతో తాండూరు నుండి హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సును డ్రైవర్ ఎం.ఎస్. బైగ్ ఈ.274185, కండక్టర్ గోరెప్ప ఈ.290336 నడుపుతున్నారు .చెన్‌గోముల్ పోలీస్ స్టేషన్ దాటిన కాసేపటికి సుమారు 1 కి.మీ దూరంలో ఎదురుగా ఎపి25 ఎఎల్ 3888 నంబర్ గల స్విఫ్ట్ కారు అతివేగంగా దూసుకురావడం గమనించిన డ్రైవర్ బైగ్ వెంటనే అప్రమత్తమయ్యారు. పెద్ద ప్రమాదాన్ని తప్పించేందుకు బస్సును రోడ్డు ఎడమవైపుకు తిప్పారు. అయినప్పటికీ కారు బస్సు ముందు కుడి బంపర్‌ను బలంగా ఢీకొట్టి సుమారు 35 అడుగుల దూరంలో ఆగిపోయింది.ఈ ప్రమాదంలో డ్రైవర్ సమయస్ఫూర్తి వల్ల బస్సులోని ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. కారు డ్రైవర్‌కు కూడా పెద్దగా గాయాలు కాలేదు. బస్సులోని కొందరు మహిళా ప్రయాణికులు డ్రైవర్ బైగ్ ధైర్యాన్ని మెచ్చుకుంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.సమాచారం అందిన వెంటనే తాండూరు డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్, స్టేషన్ మేనేజర్ నరసింహులు, సేఫ్టీ వార్డెన్ జర్నప్ప సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డ్రైవర్‌కు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం చెన్‌గోముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అజాగ్రత్తగా వాహనం నడిపినందుకు కారు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తన బాధ్యతతో ప్రయాణికులను కాపాడిన డ్రైవర్ ఎం.ఎస్. బైగ్ ని డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ అభినందించారు.

# అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అట్లూరి ప్రసన్న

విజయవాడ, జూలై7 (జనంసాక్షి) : ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థిని అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అట్లూరి ప్రసన్న.. న్యూయార్క్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఆమె తన స్నేహితులతో కలిసి కారులో సమీపంలోని గుడికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సిగ్నల్ వద్ద ఆగి ఉన్న వీరి కారును మరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసన్నతో పాటు మరో అమ్మాయి ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలవ్వగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రసన్న స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామం. ఇటీవలే పేస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా.. ఇలా రోడ్డు ప్రమాదంలో కన్నుమూయడంతో ఆమె కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

# 'తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ - యూజింగ్ టెక్నాలజీ' దిశగా తెలంగాణ పోలీస్

- బేసిక్ పోలిసింగ్ పై దృష్టి పెట్టాలి
- సమీక్ష సమావేశంలో డీజీపీ సివి. ఆనంద్




ఖమ్మం, (జనంసాక్షి) : 'తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ - యూజింగ్ టెక్నాలజీ' అనే లక్ష్యంతో పోలీస్ అధికారులు ముందుకు సాగాలని రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్ అన్నారు. ఖమ్మం జిల్లా పర్యటన లో భాగంగా మంగళవారం జిల్లాలో శాంతిభద్రతలు, నేర నియంత్రణపై ఎస్పి కాన్ఫిరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణలో పకడ్బందీ చర్యలు, బేసిక్ పోలిసింగ్ పై దృష్టి, కీలక సంస్కరణలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ...పోలీస్ యూనిఫామ్ ధరించటం అదృష్టంగా భావించి..ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యంగా పోలీస్ సిబ్బంది పని చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కోట్ల మంది జనాభాలో కేవలం 0.16 శాతం మందికే ఈ అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆ గౌరవాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి ప్రజల సేవకు అంకితం కావాలన్నారు. బేసిక్ పోలిసింగ్ పై దృష్టి పెట్టాలని, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేసి ఆస్తి నేరాలను అరికట్టాలన్నారు చట్టం అనేది సామాన్యులకు రక్షణ కవచంలా అండగా ఉండాలని, కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. అదేవిదంగా సివిల్, భూ వివాదాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని,లిస్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇసుక, మట్టి మాఫియా, రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇకపై ఎఫెక్టివ్ పోలీసింగ్, స్మార్ట్ పోలిసింగ్ సమాజ శ్రేయస్సు, ప్రజలకు భరోసా ఇచ్చే దిశగా తెలంగాణ పోలీస్ ముందుకు సాగుతోందని, ఇందుకు గాను ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), సీసీ కెమెరాలు, డేటా అనలిటిక్స్, సాక్ వ్యవస్థలతో, నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రదానంగా తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టుల కంటే గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఇప్పటికే ఈగల్ పోలీసు బృందాలు గంజాయి సరఫరా, రవాణా మూలలను కట్టడికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. "మాదకద్రవ్యాలపై యుద్ధం చేయాలి.. భావితరాలను కాపాడాలి" అని స్పష్టం చేశారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ఛాలెంజ్ గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారిందని, నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారని, ఇది పోలీసులకు సవాలుగా మారిందన్నారు. ఇందులో విద్యావం తులు ఎక్కువ నష్టపోతున్నారని అన్నారు. తెలంగాణలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పోలీసు యంత్రాంగం, ప్రత్యేక విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. వాహనదారులు వేగ పరిమితులు పాటించాలని, ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం తప్పనిసరి అని డీజీపీ స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు."అరైవ్ అలైవ్, డిఫెన్సివ్ డ్రైవింగ్ అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గయని అన్నారు. పోలీస్ కమిషనర్ జిల్లా పోలీసింగ్, నేరాల ధోరణులు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 2026లో 1,700 కిలోల గంజాయి, 2025లో సుమారు 4,000 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ వివరించారు. సమావేశంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, విజయబాబు,ఏసీపీలు వసుంధర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సత్యనారాయణ, సుశీల్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు పనిచేయాలి

- దిశ కమిటి సమావేశంలో ఎంపీ పోరిక బలరాం నాయక్..
- ప్రభుత్వ వీఫ్ రాంచంద్రు నాయక్..



మహబూబాబాద్ ప్రతినిధి, జూలై 7 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం దిశ కమిటీ సమావేశం ఎంపీ, దిశ కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్లు, దిశ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయం, వైద్యం, గృహ నిర్మాణం, విద్య, రహదారులు, సాగునీరు, ఉపాధి, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర 90 అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు పంట మార్పిడి, సాయిల్ హెల్త్ కార్డులపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించాలని ఆదేశించారు. రైల్వే అండర్‌పాస్‌లు, ఆర్‌వోబీల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ, సాగునీటి పెండింగ్ పనులు, విద్యుత్ లైన్ల మరమ్మతులు, రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలని చెప్పారు. నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి పథకాల ద్వారా అవకాశాలు కల్పించేందుకు కార్యాచరణ రూపొందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు సమర్థంగా కొనసాగుతోందన్నారు. యూరియా కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, స్వయం సహాయక సంఘాల ద్వారా డ్రోన్ల సహాయంతో నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. క్లస్టర్ల వారీగా ఆయిల్ పామ్, ఉద్యాన, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తూ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత శాఖలు సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, దిశ కమిటీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆదాయం మనదైతే... పర్యావరణ విషం కాదా?

సంపాదకీయం

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇ-20 పెట్రోల్ వల్ల ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, సమస్య వచ్చిన ఒక్క కారునైనా చూపించాలని ఆయన సవాలు విసిరారు. ఇథనాల్ బ్లెండింగ్‌పై జరుగుతున్న ప్రచారం కేవలం పెయిడ్ క్యాంపెయిన్ మాత్రమేనని, అందులో వాస్తవం లేదని కొట్టిపారేశారు. అయితే ఈ ప్రకటన వెనుక ఉన్న వాస్తవాలను, సామాన్య ప్రజల అనుభవాలను పరిశీలిస్తే, మంత్రి వాదనలో ఎన్నో లొసుగులు కనిపిస్తాయి.

మొదటగా చెప్పుకోవాల్సింది నీటి వినియోగం గురించి. ఒక లీటర్ ఎథనాల్ ఉత్పత్తికి పంట సాగుతో సహా సుమారు 1,500 నుంచి 3,000 లీటర్ల వరకు నీరు ఖర్చవుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. దేశంలో ఇప్పటికే భూగర్భజలాలు ప్రమాదకర స్థాయిలో పడిపోతున్న తరుణంలో, చెరకు వంటి నీటిని ఎక్కువగా తినే పంటలను ఇథనాల్ కోసం భారీ స్థాయిలో సాగు చేయడం రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు దీర్ఘకాలంలో శాపంగా మారే ప్రమాదం ఉంది. ఎరువులు, పురుగుమందుల విచ్చలవిడి వాడకం వల్ల నేల, నీటి కాలుష్యం పెరిగే అవకాశాన్ని కూడా విస్మరించలేం.

వాహనాల విషయానికొస్తే, ఇ-20కు అనుకూలంగా తయారు కాని పాత కార్లు, బైకుల్లో రబ్బరు పైపులు, గ్యాస్కెట్లు, ఫ్యూయల్ పంపుల వంటి కీలక భాగాలపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఎథనాల్‌లో శక్తి సాంద్రత పెట్రోల్ కంటే తక్కువ కావడంతో మైలేజ్ తగ్గుతుంది. ఇది వినియోగదారుడి జేబుపై ప్రత్యక్ష భారంగా మారుతుంది. కోట్లాది పాత వాహనాలు రోడ్లపై తిరుగుతున్న దేశంలో, "ఏ కారు దెబ్బతింది చూపించండి" అని సవాలు విసరడం సమస్యను తేలిగ్గా తీసుకోవడమే తప్ప పరిష్కారం కాదు. ఎందుకంటే ఇంజిన్ భాగాలు క్రమేపీ అరిగిపోయే సమస్య, ఒక్క రోజులో బయటపడేది కాదు, కాలక్రమేణా వెల్లడయ్యేది.

ఇక ఇన్సూరెన్స్, వారంటీ విషయంలో స్పష్టత లేకపోవడం మరో ఆందోళనకర అంశం. ఎథనాల్ కలిపిన ఇంధనం వాడినందుకు క్లెయిమ్‌లు నేరుగా తిరస్కరించబడకపోయినా, తయారీదారు అనుమతించని ఇంధనం వాడటం వల్ల నష్టం జరిగిందని రుజువైతే వారంటీ వివాదాలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులే చెబుతున్నారు. ఇలాంటి అనిశ్చితిని ప్రజలకు స్పష్టంగా వివరించకుండా, ఫిర్యాదులే లేవని చెప్పడం సరైన విధానం కాదు. కాలుష్య కోణంలో చూసినా, కార్బన్ మోనాక్సైడ్ వంటి కొన్ని ఉద్గారాలు తగ్గినా, ఆల్డీహైడ్ల వంటి ఇతర హానికర ఉద్గారాలు పెరిగే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అంటే ఒక సమస్యను తగ్గించే ప్రయత్నంలో మరో కొత్త సమస్యను ఆహ్వానిస్తున్నామా అన్న ప్రశ్న తలెత్తుతుంది.

దేశం ఇంధన దిగుమతుల కోసం ఏటా రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న మాట వాస్తవమే, ఇథనాల్ ద్వారా రైతులకు రూ.45 వేల కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్న అంశం కూడా ఆహ్వానించదగినదే. కానీ ఆదాయం వస్తుంటే డబ్బు ఎవరికి చేదు అన్న భావనతో, పథకం వెనుక ఉన్న నీటి కొరత, వాహనాల నిర్వహణ ఖర్చు, కాలుష్య మార్పులు వంటి వాస్తవ సమస్యలను పక్కన పెట్టేయడం సరైంది కాదు. ప్రభుత్వ లక్ష్యం మంచిదే అయినా, దానికి తగిన శాస్త్రీయ అధ్యయనాలు, పారదర్శకమైన సమాచారం, ప్రజల భయాలను నివృత్తి చేసే విధానం అవసరం. కేవలం "ఫిర్యాదులు లేవు కదా" అని కొట్టిపారేయడం కంటే, ఈ సందేహాలకు శాస్త్రీయంగా సమాధానం చెప్పడమే బాధ్యతాయుతమైన పాలన లక్షణం.

# బడ్జెట్‌కు ఊతం... బతుకులకు ఘాతం!

ఇటీవల నిజామాబాద్ జిల్లాలోని ఒక గ్రామంలో 29 ఏళ్ల యువకుడి కథ ఒక వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు, నేటి తెలంగాణ గ్రామీణ సమాజానికి పట్టిన అద్దం. కొన్నాళ్లుగా అనారోగ్యం, ఫిట్స్ వ్యాధి తెచ్చిపెట్టిన తీవ్ర మానసిక వేదనను తట్టుకోలేక అతను మద్యానికి దాసుడయ్యాడు. నెలల తరబడి శ్రమకు దూరమై, రోజంతా మత్తులో మునిగితేలడంతో ఉన్న ఆరోగ్యం కాస్తా పూర్తిగా క్షీణించింది. పచ్చని సంసారం కాస్తా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైంది. చివరకు జీవితంపై పూర్తిగా విరక్తి చెంది, ఆ నరకయాతన భరించలేక అతను ఉరితాడుకు బలయ్యాడు. అతడి భార్య సంధ్య శ్రమించి ఇంటికొచ్చేసరికి ఎదురైన ఆ ఘోర దృశ్యం, ఆ కుటుంబ పునాదులను శాశ్వతంగా పెకలించివేసింది. నేడు తెలంగాణలోని వందలాది పల్లెటూళ్లలో మద్యం అనే సామాజిక మహమ్మారి బారిన పడి, కళ్ల ముందే కూలిపోతున్న ఎన్నో అభాగ్య కుటుంబాల దైన్య స్థితికి అశోక్ ఉదంతం ఒక సజీవ సాక్ష్యం.



**ఖజానాకు కాసుల వర్షం - రికార్డులకెక్కిన మద్యం రాబడి :**

ఒకవైపు మద్యం మహమ్మారి పల్లెల్లో చిచ్చు పెడుతుంటే, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు మాత్రం ఈ అమ్మకాలు కల్పవృక్షంలా మారి కాసుల వర్షం కురిపిస్తున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఎక్సైజ్ శాఖ సాధించిన రాబడి అక్షరాలా రూ.44,557 కోట్లు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఒకే ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఇంతటి భారీ మొత్తంలో ఆదాయం రావడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. ఈ నిధుల ప్రవాహాన్ని పరిశీలిస్తే, కేవలం మద్యం విక్రయాల ద్వారానే రూ.39,368 కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజుల ద్వారా రూ.1,771 కోట్లు, 1,214 బార్లు మరియు క్లబ్బుల ద్వారా రూ.549 కోట్లు లభించాయి. ఇక కొత్త మద్యం దుకాణాల కేటాయింపు కోసం వ్యాపారుల నుంచి వచ్చిన 95,628 దరఖాస్తుల ఫీజుల రూపంలోనే అదనంగా రూ.2,869 కోట్లు ఖజానాకు చేరడం విశేషం. ఈ గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే ఆందోళనకరమైన నిజాలు బయటపడతాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.20,859 కోట్లుగా నమోదైన ఎక్సైజ్ రాబడి, సరిగ్గా ఏడేళ్ల కాలంలోనే రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి రూ.44 వేల కోట్ల మార్కును దాటింది. దీన్ని బట్టి రాష్ట్ర ప్రజల మద్యం వినియోగం, దాని కోసం వారు చేస్తున్న ఖర్చు ఏటికేడు ఎంతలా పెరిగిపోతుందో స్పష్టంగా అర్థమవుతోంది. మద్యం ధరలను పెంచడం, సరికొత్త బ్రాండ్లకు అనుమతులు మంజూరు చేయడం, గ్రామీణ ప్రాంతాల వరకు మద్యం లభ్యత సులభతరం కావడం వంటి చర్యలే ఈ రికార్డు రాబడికి ప్రధాన కారణాలని సామాజిక ఆర్థిక విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

**పల్లెల్లో గుండెకోత - విలపిస్తున్న కుటుంబాలు :**

అయితే, ఈ అంకెల గారడీ కాగితాలపై ప్రభుత్వ ప్రగతికి సంకేతంగా, అత్యంత ఆకర్షణీయంగా కనిపించవచ్చు కానీ, క్షేత్రస్థాయిలో సామాన్యుల ఇళ్లలో మాత్రం నిత్యం కన్నీటి గాథలే నడుస్తున్నాయి. జాతీయ నేర గణాంకాల బ్యూరో విడుదల చేసిన తాజా నివేదికలు భయంకరమైన వాస్తవాలను కళ్లకు కడుతున్నాయి. తెలంగాణలో చోటుచేసుకుంటున్న ఆత్మహత్యల్లో అత్యధిక శాతం కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల వల్లే సంభవిస్తున్నాయి. ఈ తీవ్రమైన ఆత్మహత్యల జాబితాలో కేవలం మద్యం, మాదకద్రవ్యాల వ్యసనం కారణంగానే ప్రాణాలు తీసుకుంటున్న వారి శాతం దాదాపు 7 శాతంగా నమోదవడం అత్యంత శోచనీయం. దురదృష్టవశాత్తూ, ఆత్మహత్యల రేటులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానాల్లో కొనసాగుతుండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోతున్న వారిలో అత్యధికంగా రోజువారీ కూలీలు, శ్రమజీవులు ఉండటం గమనార్హం. అంటే, మద్యం మహమ్మారి సృష్టిస్తున్న ఆర్థిక భారం నేరుగా సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలపైనే పడుతోంది. ఒక సామాన్య కుటుంబం తమ నెలవారీ సంపాదనలో సింహభాగాన్ని మద్యానికి తగలేయడం వల్ల, వారి పిల్లల విద్య, అత్యవసర ఆరోగ్య ఖర్చులు, కనీస అవసరాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. గ్రామగ్రామాన పుట్టగొడుగుల్లా వెలిసిన అనధికారిక విక్రయ కేంద్రాల (బెల్ట్ షాపుల) వల్ల మద్యం లభ్యత మరింత సులభతరమైంది. దీని ఫలితంగా నిత్యం గృహహింస, అప్పుల ఊబి, దంపతుల మధ్య ఘర్షణలు, మానసిక క్షోభ పెరిగిపోతున్నాయని క్షేత్రస్థాయి పరిశీలనలు స్పష్టం చేస్తున్నాయి.

**సంక్షేమమా, సమాజ ఆరోగ్యమా?**

ప్రస్తుత తరుణంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌కు ఒక వెన్నెముకగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉచిత పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు , మౌలిక సదుపాయాల కల్పనకు ఈ మద్యం నిధులే ప్రధాన వనరుగా ఉపయోగపడుతున్నాయని ప్రభుత్వ వర్గాలు భావించవచ్చు. కానీ, మద్యం అమ్మకాలను ప్రోత్సహించే విధానాలు, కొత్త దుకాణాల మంజూరు ప్రజారోగ్యాన్ని ఏ స్థాయిలో బలితీసుకుంటున్నాయో పాలకులు పునరాలోచించుకోవాలి. ఒకవైపు ప్రభుత్వ ఖజానా కాసులతో నిండుతుంటే, మరోవైపు ప్రజల వైద్య ఖర్చులు, మానసిక వేదనలు, బాల్యాలు ఛిద్రమవడం వంటి రూపాల్లో సమాజం ఊహించని భారీ మూల్యాన్ని చెల్లిస్తోంది. అందువల్ల కేవలం ఆదాయ వృద్ధిని మాత్రమే కాకుండా, ప్రజారోగ్యాన్ని రక్షించడాన్ని కూడా ఒకేలా చూడాల్సిన గురుతర బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.

**ప్రత్యామ్నాయ మార్గాలు - సమగ్ర కార్యాచరణ :**

ఈ సామాజిక విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కేవలం చట్టాలు మాత్రమే సరిపోవు. యుద్ధప్రాతిపదికన ఒక బహుముఖ వ్యూహాన్ని అమలు చేయాల్సి ఉంది. డి-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చేయాలి ప్రతి మండల కేంద్రంలో ఉచిత మానసిక కౌన్సెలింగ్, వ్యసన విముక్తి వైద్య చికిత్సా సదుపాయాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామాల్లో చట్టవిరుద్ధంగా నడిచే అనధికార బెల్ట్ షాపులను ఇనుప హస్తంతో అణచివేసి, మద్యం లభ్యతను క్రమంగా తగ్గించాలి. గ్రామీణ మహిళలు, పురుషులకు కుటుంబ బడ్జెట్ నిర్వహణపై అవగాహన కల్పించి, వ్యసనాల వల్ల అయ్యే వృథా ఖర్చులను అరికట్టేలా చైతన్యపరచాలి. యువత, కూలీలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తే, మానసిక ఒత్తిడి తగ్గి వారు మద్యం వైపు మళ్లే అవకాశం తగ్గుతుంది. ఎక్సైజ్ శాఖకు వచ్చే ఆదాయంలో కనీసం కొంత శాతాన్ని వ్యసన విముక్తి కార్యక్రమాలకు, బాధిత కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేకంగా కేటాయించాలి. ఐకేపీ, స్వయం సహాయక మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తూ గ్రామాల్లో మద్యం నియంత్రణపై గట్టి నిఘా ఉంచాలి. రాష్ట్ర ఖజానా నిండటం ఒక నాణేనికి ఉన్న ఒక వైపు అయితే, అశోక్ లాంటి ఎందరో యువకుల జీవితాలు, వారి పచ్చని సంసారాలు బుగ్గిపాలు కావడం మరో చీకటి వైపు. ఈ రెండు వాస్తవాలను ఏకకాలంలో బేరీజు వేసుకున్నప్పుడే నిజమైన సామాజిక వికాసం సాధ్యమవుతుంది. కేవలం ఆదాయపు లెక్కలను గర్వంగా ప్రకటించుకునే ముందు, ఆ మద్యం ఎన్ని ఇళ్లల్లో దీపాలు ఆర్పేసిందో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169

**సృష్టిలో!**

సృష్టి అంతా
పరోపకారం!
మనిషిమాత్రం
స్వలాభం !
సృష్టి విశాలం!
మనిషి సంకుచితం!
సృష్టిలో
కల్తీ లేదు!
మనిషి మాత్రమే
కల్తీ బ్రతుకు!
సృష్టిలో
అంతా ప్రేమ!
మనిషిమాత్రం
ద్వేషపూరితం!
సృష్టిలో
రాజకీయం లేదు!
వీడు లేస్తే
రాజకీయం!
సృష్టిలో
కులాలు లేవు!
వీడిదంతా
కులాలకంపు!
సృష్టిలో
మతం లేదు!
వీడిది మాత్రం
మతం మత్తు!
సృష్టిలో
మోసంలేదు!
వీడిది నిత్యం
మోసం బ్రతుకు!
సృష్టిలో
అంతా ఆహ్లాదం!
వీడిది మాత్రం
నిత్య వేదన!
సృష్టిలో
గొప్పలు లేవు!
వీడు గొప్పలు

-తమ్మనేని అక్కిరాజు , హైదరాబాద్

# గ్రామీణ ఉపాధి హామీ కొత్త పథకం: రాష్ట్రాలపై భారీ ఆర్థిక భారం

గ్రామీణ భారతానికి రెండు దశాబ్దాలుగా జీవనాధారంగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని భర్తీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి కొత్త 'వికసిత భారత్ ఉపాధి-జీవనోపాధి హామీ గ్రామీణ పథకం' అమలు చేస్తోంది. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి హామీ కొనసాగుతుందని కేంద్రం చెబుతున్నా, నిధుల వాటా మార్పు వల్ల రాష్ట్రాలపై భారీ ఆర్థిక భారం పడుతోందని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో కేంద్ర-రాష్ట్రాల మధ్య వ్యయ భాగస్వామ్యం 90:10 నిష్పత్తిలో ఉండేది. కొత్త పథకంలో ఇది 60:40కి మారడంతో రాష్ట్రాలు గతంతో పోలిస్తే భారీగా అదనపు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో వ్యయం 600 నుంచి 800 శాతం వరకు పెరగవచ్చని 'ది హిందూ' విశ్లేషణలో తేలింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు వంటి జనాభా ఎక్కువగా ఉన్న, ఆదాయ వనరులు పరిమితంగా ఉన్న రాష్ట్రాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.

కొత్త విధానం ప్రకారం ప్రతి రాష్ట్రానికి కేంద్రం ముందుగానే ఖర్చు పరిమితిని నిర్ణయిస్తుంది. ఆ పరిమితిని మించి అయ్యే వ్యయాన్ని పూర్తిగా రాష్ట్రాలే భరించాలి. 125 రోజుల ఉపాధి హామీ నెరవేరకపోతే చెల్లించాల్సిన నిరుద్యోగ భృతి, వేతనాల ఆలస్యంపై పరిహారం కూడా రాష్ట్రాల బాధ్యతగా మారాయి. ప్రకృతి వైపరీత్యాలు, కరువు వంటి సమయాల్లో ఉపాధి డిమాండ్ పెరిగినా అదనపు నిధులు రాష్ట్రాలే కల్పించాల్సి ఉంటుంది. 2024-25లో రాష్ట్రాలు సుమారు ₹27,700 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. 2026-27 నాటికి ఇది ₹2,51,000 కోట్లకు చేరవచ్చని అంచనా వేయబడింది. గ్రామీణాభివృద్ధి శాఖ 2026-27కి ₹2,95,692 కోట్లు కేటాయించినట్లు ప్రకటించినా, రాష్ట్రాల వాటా, బకాయిలు వంటి వివరాలు స్పష్టంగా తెలియజేయలేదు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం కేవలం కూలి పనులు కల్పించడం మాత్రమే కాదు. గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భద్రత, వలసల తగ్గింపు, గ్రామాల అభివృద్ధి, చెరువులు, రహదారులు, నీటి సంరక్షణ వంటి ఆస్తుల సృష్టి వంటి బహుముఖ ప్రయోజనాలు కల్పిస్తోంది. కొత్త పథకంలో నిధుల కొరత వల్ల పనుల సంఖ్య తగ్గితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మహిళలు, భూమిలేని కార్మికులు, ఆదివాసీలు వంటి వర్గాలు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పనుల మంజూరు, వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం జరిగితే రోజువారీ జీవనం దెబ్బతినే ప్రమాదం ఉంది.

కేంద్రం-రాష్ట్రాల మధ్య సమన్వయం, స్పష్టమైన ఆర్థిక బాధ్యతల విభజన, అవసరం మేరకు అదనపు సహాయం, పారదర్శక అమలు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ద్వారా మాత్రమే కొత్త పథకం విజయవంతం కాగలదని ఆర్థిక నిపుణులు, పరిశోధకులు సూచిస్తున్నారు. గ్రామీణ పేదల జీవన భద్రత, సామాజిక న్యాయం కోసం ఈ పథకం సమర్థవంతంగా కొనసాగాలని అందరూ ఆశిస్తున్నారు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ప్రజలతో నడిచే రాజకీయాలే విప్లవ మార్గం

నిన్నటి సంచిక తరువాయి



సమాజం మారిన తర్వాత మహిళలకు సమాన హక్కులు వస్తాయని ఎదురు చూడలేమని ఆయన అభిప్రాయం. పితృస్వామ్యానికి వ్యతిరేక పోరాటం ఇప్పుడే జరగాలి. మహిళలు ఉద్యమంలో పాల్గొనడమే కాదు, నాయకత్వ స్థానాలకు కూడా రావాలి. ప్రజా ఉద్యమం మహిళల శక్తిని గుర్తించకుండా పూర్తి కాలేదని ఆయన భావించారు.

ఈ మొత్తం పరిణామాన్ని చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. లిబరేషన్ పార్టీ తన లక్ష్యాన్ని మార్చుకోలేదు. కానీ ప్రజల మధ్యకు చేరుకునే పద్ధతిని విస్తరించింది. ప్రజల నుంచి నేర్చుకోవడం, ప్రజలతో కలిసి పోరాడడం, ప్రజల రోజువారీ సమస్యలను విప్లవ రాజకీయాలతో అనుసంధానించడం పార్టీ కొత్త రాజకీయ దిశకు పునాదిగా మారాయి. ఇదే వినోద్ మిశ్రా రాజకీయ ఆలోచనలో అత్యంత ముఖ్యమైన మలుపు.

ఈ రాజకీయ పరిణామాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భారతదేశాన్ని మాత్రమే కాదు, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన మార్పులను కూడా చూడాలి. ఇరవయ్యవ శతాబ్దం చివరి దశలో ప్రపంచం వేగంగా మారింది. తూర్పు ఐరోపాలో సోషలిస్టు ప్రభుత్వాలు కూలిపోయాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైంది. పెట్టుబడిదారీ వ్యవస్థ గెలిచిందని, మార్క్సిజం కాలం చెల్లిపోయిందని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం జరిగింది. చాలామంది వామపక్ష ఉద్యమాలు తీవ్ర నిరాశలోకి వెళ్లాయి. మరికొన్ని తమ పాత రాజకీయాలను పూర్తిగా వదిలేశాయి.

అలాంటి సమయంలో వినోద్ మిశ్రా తొందరపడి నిర్ణయాలకు రాలేదు. ప్రపంచంలో జరిగిన మార్పులను భావోద్వేగంతో కాకుండా, రాజకీయంగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒక దేశంలో సోషలిజం ఎదుర్కొన్న వైఫల్యం వల్ల దోపిడీ అంతరించిపోదు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలు కూడా అంతమవవు. కాబట్టి మార్క్సిజాన్ని విస్మరించడం కాదు, కొత్త పరిస్థితుల్లో దానిని మరింత లోతుగా అధ్యయనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆయన దృష్టిలో మార్క్సిజం అంటే కొన్ని సిద్ధంగా ఉన్న జవాబుల పుస్తకం కాదు. ప్రతి కొత్త పరిస్థితిని విశ్లేషించే శాస్త్రీయ పద్ధతి. అందుకే గతంలో చెప్పిన ప్రతి మాటను యథాతథంగా పునరావృతం చేయడం మార్క్సిజం కాదని ఆయన పదేపదే వివరించారు. సమాజం మారితే రాజకీయ ఎత్తుగడలు కూడా మారాలి. కానీ ప్రజల విముక్తి, సమానత్వం, దోపిడీ నిర్మూలన అనే ప్రాథమిక లక్ష్యం మాత్రం మారదు.

ఈ ఆలోచనలోనే ఆత్మవిమర్శకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం కనిపిస్తుంది. ఆత్మవిమర్శ అంటే గతాన్ని తిడటం కాదు. అలాగే జరిగిన ప్రతిదాన్నీ సమర్థించడం కూడా కాదు. ఏది సరిగ్గా చేశాం? ఎక్కడ పొరపాటు జరిగింది? ఏ అనుభవం నుంచి ఏమి నేర్చుకున్నాం? అనే ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం వెతకడమే ఆత్మవిమర్శ. ఒక ఉద్యమం తనను తాను సరిదిద్దుకోలేకపోతే, అది చరిత్రతో పాటు ముందుకు నడవలేదని ఆయన భావించారు.


ఇంకో ముఖ్యమైన విషయం ఆయన తరచూ గుర్తు చేశారు. ఏ నాయకుడూ విమర్శలకు అతీతుడు కాదు. అదే సమయంలో ఏ నాయకుడి పాత్రనైనా ఒక్క తప్పుతో కొట్టిపారేయడం కూడా చారిత్రక దృష్టి కాదు. వ్యక్తులకంటే ఉద్యమం పెద్దది. ఉద్యమానికంటే ప్రజలు పెద్దవారు. ప్రజలే చరిత్రను ముందుకు నడిపే అసలు శక్తి. పార్టీ ఆ శక్తిని సంఘటితం చేసే సాధనం మాత్రమే. ఈ అవగాహనే లిబరేషన్ పార్టీ రాజకీయ పరిణామానికి పునాది అయింది.

అందుకే పార్టీ తన కార్యకలాపాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయలేదు. ఎన్నికల్లో పాల్గొన్నంత ఉత్సాహంతోనే రైతు పోరాటాల్లో, కార్మిక సమ్మెల్లో, భూహక్కుల ఉద్యమాల్లో, దళితులపై దాడులకు వ్యతిరేకంగా, మహిళలపై హింసకు వ్యతిరేకంగా, విద్య హక్కు, ఉపాధి హక్కు, ప్రజాస్వామ్య హక్కుల కోసం జరిగే ఉద్యమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని భావించింది. ప్రజల జీవితం నుంచి దూరమైన రాజకీయాలు చివరికి ప్రజల విశ్వాసాన్ని కోల్పోతాయని వినోద్ మిశ్రా హెచ్చరించారు.

నేటి భారతదేశాన్ని చూస్తే ఆయన లేవనెత్తిన అనేక ప్రశ్నలు ఇంకా మన ముందే ఉన్నాయి. రైతాంగ సంక్షోభం పూర్తిగా తొలగిపోలేదు. కార్మికుల హక్కులపై ఒత్తిడి పెరుగుతోంది. కుల వివక్ష ఇంకా కొనసాగుతోంది. మహిళలపై హింస, మత విద్వేష రాజకీయాలు, ఆర్థిక అసమానతలు, ప్రజాస్వామ్య హక్కులపై ఆంక్షల గురించి చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలతో నిరంతర సంబంధం కలిగిన, వారి పోరాటాల నుంచే తన రాజకీయాలను నిర్మించుకునే పార్టీ అవసరమనే వినోద్ మిశ్రా ఆలోచన ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉంది.

అయితే ఆయన ప్రతిపాదించిన అన్ని రాజకీయ నిర్ధారణలతో ప్రతి ఒక్కరూ ఏకీభవించాల్సిన అవసరం లేదు. భారత వామపక్ష ఉద్యమంలోనే ఎన్నికల రాజకీయాలు, విప్లవ వ్యూహం, ప్రజా సంఘాల పాత్ర, ఐక్య కార్యాచరణ వంటి అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆ చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ ఆ భిన్నాభిప్రాయాల మధ్య కూడా వినోద్ మిశ్రా ఒక విషయాన్ని స్పష్టంగా నిలబెట్టారు. సిద్ధాంతం ప్రజల జీవితాలకు దూరంగా ఉండకూడదు. ఉద్యమం తన అనుభవాల నుంచి నేర్చుకుంటూ ముందుకు సాగాలి. అందుకే "లిబరేషన్ పార్టీ పరిణామ క్రమం"ను కేవలం ఒక పార్టీ చరిత్రగా చదవడం సరిపోదు. ఒక ఉద్యమం తనను తాను ఎలా ప్రశ్నించుకుంది, ఎలా సరిదిద్దుకుంది, ఎలా కొత్త రాజకీయ మార్గాలను అన్వేషించింది అనే అధ్యయనంగా చూడాలి. గతాన్ని గౌరవిస్తూ, వర్తమానాన్ని అర్థం చేసుకుంటూ, భవిష్యత్తు కోసం కొత్త దిశను వెతికే ప్రయత్నమే ఈ రాజకీయ ఆలోచనల అసలు సారం.


చివరికి వినోద్ మిశ్రా అందించే సందేశం ఒక్కటే. ప్రజలపై నమ్మకం కోల్పోయిన ఏ విప్లవ ఉద్యమమూ నిలబడదు. ప్రజల మధ్య బలమైన వేర్లు లేని ఏ రాజకీయ సిద్ధాంతమూ జీవించి ఉండదు. ప్రజలతో కలిసి నడవడం, ప్రజల నుంచి నేర్చుకోవడం, తప్పులను సరిదిద్దుకోవడం, కొత్త పరిస్థితులకు అనుగుణంగా రాజకీయాలను అభివృద్ధి చేయాలి. ఇదే ఒక సజీవ మార్క్సిస్టు ఉద్యమ లక్షణం. లిబరేషన్ పార్టీ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ సూత్రాన్ని అర్థం చేసుకోవడం అత్యంత అవసరం.



- మామిండ్ల రమేష్ రాజా
7893230218
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ

# మరణం తీసుకెళ్ళింది స్వరాన్ని... మనిషిని కాదు

కొన్ని మరణాలు మనకు తెలిసిన మనుషులను దూరం చేస్తాయి. కొన్ని మరణాలు మాత్రం మనకు పూర్తిగా తెలియని మనుషుల గురించి తెలుసుకోవాలని బలవంతం చేస్తాయి. అరుణోదయ నాగన్న మరణం నాకు రెండో రకంగా అనిపించింది. ఆయనతో నాకు వ్యక్తిగత పరిచయం లేదు. కానీ ఆయన మరణ వార్త చదివిన తర్వాత ఎందుకో నా మనసు ఆ వార్త దగ్గరే ఆగిపోయింది. మొదట నేను వెతికింది ఒక గాయకుడని. కానీ చదువుతున్న కొద్దీ ఒక నిజం నిమ్మదిగా తెరుచుకుంది. పాటలో వినిపించిన మనిషి తడిసిన కళ్ళల్లో అర్థమవుతూ వచ్చాడు. ఒక అపరిచితుడి కోసం మనసు ఎందుకు నిలబడుతుందో అర్థం కాలేదు. బహుశా కొందరు మనుషులు మన జీవితాల్లోకి పరిచయాల ద్వారా కాదు. విలువల ద్వారా ప్రవేశిస్తారేమో.



ఆ వార్త తర్వాత నేను వెతికింది ఆయన పాటలను కాదు. ఆయన గురించి రాసిన మాటలను. పసునూరి రవీందర్, జిలకర శ్రీనివాస్, దామెర రాజేందర్, రమేష్ రాజా జ్ఞాపకాలలో, చెరుపల్లి ఆనంద్ మాటల్లో వెతుకుతుంటే ఒక్కో జ్ఞాపకం ఒక కిటికీలా తెరుచుకుంది. ఆ కిటికీ గుండా కనిపించింది ఒక గాయకుడి స్వరం కాదు.ఒక మనిషి నడక. వాళ్లు రాసింది ఒక గాయకుడి గురించి అనిపించినా, లోతుగా చూస్తే వాళ్లు వెతుకుతున్నది ఒక మనిషిని. ఒక్కో జ్ఞాపకం ఒక్కో కోణాన్ని చూపించినా, ఒక్కో వ్యక్తిగత తడిని నింపుకున్నా,వాటి మధ్య నుంచి ఆవిష్కృతమైంది ఒక మనిషి మనస్తత్వం. అప్పుడు అర్థమైంది కొన్ని జీవితాలు తమ గురించి తామే చెప్పుకోవు. వాటిని అర్థం చేసుకోవాలంటే వాటి స్వరాన్ని కాదు ప్రతి ధ్వని వినాలి. ఆ ప్రతిధ్వని మోసుకొచ్చే జ్ఞాపకాల స్పర్శ వాటి అసలు మనిషితనాన్ని మనకు పరిచయం చేస్తాయి.

ప్రతి మనిషి రెండు జీవితాలు బతుకుతాడని అంటారు. ఒకటి తన శరీరంతో. ఇంకొకటి తన వల్ల తాకబడిన మనుషులలో. మొదటి జీవితం ఎప్పుడో ఒకరోజు ముగుస్తుంది. రెండో జీవితం మాత్రం జ్ఞాపకాలలో, విలువలలో,మనుషుల మాటలలో కొనసాగుతూనే ఉంటుంది. నాగన్నను గుర్తుచేసుకున్న వారి మాటల్లో నాకు దుఃఖం మాత్రమే వినిపించలేదు. ఆత్మీయ వెచ్చదనం కూడా కనిపించింది. అది ఒక మనిషి వెళ్ళిపోయిన బాధ మాత్రమే కాదు. ఒక విలువకు దూరమైన ఖాళీ.

నాగన్న గురించి చదువుతున్న కొద్దీ ఆయనకు పాట అనేది కేవలం కళ కాదని అర్థమైంది. అది జీవితం గురించి మాట్లాడే పద్ధతి. పాటకు ఒక నిశ్శబ్దశక్తి ఉంటుంది. అది మనసును ఒప్పించదు. తాకుతుంది. సిద్ధాంతాన్ని వినిపించదు. అనుభూతిగా మారుస్తుంది. ఒక రైతు నిట్టూర్పుకు భాష దొరికితే అది పాట అవుతుంది. ఒక కూలి చెమటకు స్వరం దొరికితే అది పాట అవుతుంది. ఒక ప్రాంతం తన గౌరవం కోసం నిలబడితే అది కూడా చివరికి పాటగానే ప్రజల మధ్య నడుస్తుంది. నాగన్న స్వరం మోసుకు వచ్చిన ఎన్నో పాటల్లో నాకు కనిపించింది ఇదే. అక్కడ ఒక ఉద్యమం ఉంది. ఒక ప్రాంతం ఉంది. ఒక వర్గం బాధ ఉంది. కానీ వాటన్నింటికంటే ఎక్కువగా ఒక మనిషి మీద ప్రేమ ఉంది.

తెలంగాణ ఉద్యమంలోనూ, వాపక్ష ఉద్యమాల మధ్యనూ నాగన్న పాటలు కేవలం వినిపించలేదు. మనుషుల మధ్య తిరిగాయి. యోచన (సంచారి) రచించిన "చికాగో నగరాన"... వంటి గీతాలు ప్రజల జ్ఞాపకాలుగా మారిన ప్రయాణంలో నాగన్న స్వరం ఒక వాహకంగా నిలిచింది. అందుకే కొన్ని పాటలు రాసిన వారిని మాత్రమే కాదు,వాటిని ప్రజల మధ్యన జీవింపజేసిన స్వరాలను కూడా గుర్తు చేస్తుంటాయి.

ఆయన గురించి చెప్పబడిన చిన్న చిన్న సంఘటనలు, మధ్య మధ్యలో మెరిసే జ్ఞాపకాలు, చెప్పలేక ఆగిపోయే మౌనాలు, ఒక్కోటి చేరుతుండగా ఒక ఉద్యమ గాయకుడు కంటే ఒక నిరాడంబరమైన రూపమే ఎక్కువగా నిలిచింది. అందుకే ఆయనను కొందరు ఒక యోగిలా గుర్తు చేసుకుంటే మరికొందరు బైరాగి మనసున్న మనిషిగా చెబుతారు. అది లోకాన్ని వదిలేసిన వైరాగ్యం కాదు. తనకంటే పెద్దదైన ఒక ఆశయానికి అంకితమైన జీవితం. తన పేరు కంటే తన నమ్మకాలని పెద్దవిగా చూసిన స్వభావం. తన జ్ఞాపకాల మధ్య నడుస్తుంటే నన్ను ఎక్కువగా నిలిపేసిన ఆలోచన ఆయన చివరి నిర్ణయం.మనిషి జీవితంలో ఏమి చెప్పాడన్నది ఒక స్థాయి. కానీ తన మరణంలో కూడా అదే మాటను కొనసాగించగలిగితే అది మరో స్థాయి. తన దేహాన్ని మెడికల్ కళాశాలకు దానం చేశాడని తెలిసినప్పుడు అది ఒక వార్తలా వినిపించలేదు. ఒక తత్వంలా అనిపించింది. కొందరు జీవితాన్ని ఒక సందేశంగా మార్చుకుంటారు.కొందరు తమ మరణాన్ని కూడా ఆ సందేశంలో భాగం చేసి వెళతారు. నాగన్న అలాంటి వాళ్లలో ఒకరు. ఇప్పుడు నాగన్న తన స్వరాన్ని తనకోసం కాకుండా తన కాలం కోసం మలచిన ఒక మనిషిలా గుర్తుకు వస్తున్నాడు.కొన్ని పాటలు ముగుస్తాయి. కొన్ని స్వరాలు మౌనమవుతాయి. కానీ కొన్ని హృదయాలు కాలాన్ని దాటి వినిపిస్తూనే ఉంటాయి. ఇక్కడ మిగిలింది పాట కాదు. మనిషి జీవించిన సాక్ష్య. ఇలాంటి మనుషుల విషయంలో కాలం జోడించినదెంత అతనిలో ముందే ఉన్నదెంత అన్నది విడదీయడం కష్టమవుతుంది. అందుకే నేమో ఈ వ్యాసం ముగిసే చోట కూడా ఆయన పూర్తిగా ముగియడు. ఎందుకంటే మరణం తీసుకెళ్లింది స్వరాన్ని మాత్రమేబిమనిషిని కాదు.



ఆయిరబోయిన బిక్షపతి
(అగల్ జోయా)
7993248717

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 7 (జనం సాక్షి) :** నెలవారీ తనిఖీ షెడ్యూల్‌లో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల భద్రత, నిర్వహణ, సీసీటీవీ నిఘా వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ, సీలింగ్ విధానాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గోదాం భద్రతా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎన్నికల సామగ్రి సురక్షితంగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగ అధికారులు, సంబంధిత సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలు పంపిణీ



**ఉర్కొండ, జూలై 7 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అండగా నిలిచేందుకు ఉర్కొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉచిత పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమం మంగళవారం రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి దీప్తి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన పత్తి విత్తనాలను ఉచితంగా అందిస్తోంది. రైతులు సకాలంలో విత్తనాలు వేసి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని అన్నారు. విత్తనాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్యం, చీడ పీడల నివారణ చర్యలపై రైతులకు వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్ పాషా, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట



**కాప్రా, జూలై 7 (జనం సాక్షి) :** మహిళా అభ్యున్నతికి పెద్ద పీఠవేస్తు, పారిశ్రామిక, స్వయం ఉపాధి రంగాలలో మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ అన్నారు. మంగళవారం కాప్రా నాయక్ నగర్ బంజారా కాలనీలో స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై మాజీ కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణితో కలిసి మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి పెద్ద పీఠవేస్తుందని, మహిళలు పారిశ్రామిక, స్వయం ఉపాధి రంగాలలో ప్రభుత్వ ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు శ్రీహరి నాయకులు కొబ్బనూరి నాగశేషు, కొబ్బనూరి నాగరాజు, శ్రీధర్ రెడ్డి, మనోజ్ కుమార్, మానస్, శివ, అభివర్మ మరియు మహిళా నాయకులు సుహిత, పద్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో విద్యాభివృద్ధికి కృషి చేయాలి



**తలకొండపల్లి, జూలై 7 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాంపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమిష్టితో గ్రామ కంటెస్టెడ్ సర్పంచ్ ముక్తాల అనంతా నరసింహ గౌడ్ మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు సురక్షితమైన అధునాతనమైన సురక్షితమైన సైకిల్లను పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వారు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు అందరూ మంచి ఫలితాలు సాధించి గ్రామానికి, ఉపాధ్యాయులకు, కన్న తల్లిదండ్రులకు, పేరు ప్రఖ్యాతలు సంపాదించి పెట్టాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ పీఏ మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మిద్దెల శ్యాంసుందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఆచారి, సింగల్ విండో డైరెక్టర్ ఎండి నయూమ్, మాజీ ఉప సర్పంచ్ సాబేర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి కృష్ణ, శ్రవణ్ కుమార్ రెడ్డి, కాకి లక్ష్మయ్య, జంగారెడ్డి, కటికల జంగయ్య, సుధాకర్, వెంకటేష్, తిక్కల శివ, శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ యువకులు నాయకులు తదితరులున్నారు.

# సర్‌ను నిర్లక్ష్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు

- కాంగ్రెస్ అధిష్టానం దృష్టి సారించింది
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి

**పెబ్బేరు, జూలై 7 (జనం సాక్షి) :** గ్రామాల్లో పండగ వాతావరణంలో సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పెబ్బేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పెబ్బేరు, శ్రీరంగాపురం మండలానికి చెందిన బిఎల్ఏ-2 అవగాహన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఎన్నికల పరంగా అత్యంత కీలకమైనదని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త దీనిని అత్యంత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఈ కార్యక్రమం ఒక పండుగలా జరిగేలా ప్రజలను భాగస్వాములను చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవలం బిఎల్ఏ,లు మాత్రమే కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, సింగిల్ విండో అధ్యక్షులు, వార్డు సభ్యులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ తారతమ్యం లేకుండా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమగ్ర ఓటరు జాబితా సవరణకు ఇంకా కేవలం 20 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని గుర్తు చేసిన వారు, ఈరోజు నుంచే ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త గడపగడపకు వెళ్లి ప్రతి అర్హుడి వద్ద సర్ దరఖాస్తులు నమోదు చేయించాలని సూచించారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. ఒక్క అర్హుడి ఓటు కూడా జాబితాలో చేరకుండా మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. ప్రభుత్వం మనదే కదా అనే ఓవర్ కాన్ఫిడెన్స్ తో నిర్లక్ష్యం చేయకూడదని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, సీరియస్‌గా నిర్వహిస్తోందని, ఇందులో నిర్లక్ష్యం వహించే వారికి పార్టీపరంగా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీలు దొంగ ఓట్లను నమోదు చేయించేందుకు ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయని, అలాంటి ప్రతి ప్రయత్నాన్ని అప్రమత్తంగా అడ్డుకోవాలని సూచించారు. వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మన



ఓటును మనం కాపాడుకుంటూనే మన కుటుంబ సభ్యులు, మన గ్రామ ప్రజలు, కాంగ్రెస్ అనుకూల ఓటర్ల ఓట్లను కూడా పరిరక్షించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి పెబ్బేరు మున్సిపాలిటీ, మరియు పెబ్బేరు, శ్రీ రంగాపురం మండలంలో సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఎల్ఏ,లు డీసీసీ ఉపాధ్యాక్షులు సాయిచరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్,లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీ

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 7 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలలో కనీస వసతుల ఫీజుల నియంత్రణ తదితర అంశాలపై మంగళవారం సిఐటియు ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం మాట్లాడుతూ నారాయణపేట పట్టణ కేంద్రంలోని పదుల సంఖ్యలో ప్రైవేట్ పాఠశాలలకు తగినంతగా ఆట స్థలాలు లేవని లాబరేటరీలు లైబ్రరీలు, కంప్యూటర్ తదితర సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి నర్సరీ నుండి టెన్త్ వరకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యం ప్రైవేట్ పాఠశాలల యజమాన్యం ఆ స్థాయిలో వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. ట్రైనింగ్ టీచర్లను మాత్రమే నియమించుకోవాలని అన్నారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అమ్మకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ యజమాన్యం బేఖాతర్ చేస్తున్నాయని విమర్శించారు. పిల్లల సంఖ్యను బట్టి పాఠశాలలో మంచినీరు మూత్రశాలలు



మరుగుదొడ్లు కల్పించడం లేదని అన్నారు. కనీస వసతులు కల్పించని ప్రవేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సర్వేలో సిఐటియు జిల్లా నాయకులు నరహరి, వికలాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి కే కాశప్ప, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెగారి దస్తప్ప ,డివై ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు గోటూరు మల్లేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, సిపిఎం సోషల్ మీడియా వారియర్ సోఫీ మజార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ముఒసిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**నిజాంపేట్, జూలై 7 (జనం సాక్షి) :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ... సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయం (జీహెచ్ఎంసీ) ఎదుట మున్సిపల్ కార్మికులతో భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ కి వినతిపత్రం సమర్పించారు.

## సర్ ప్రక్రియలోని లోపాలను సరిచేయాలి



**శామీర్‌పేట్, జూలై 7 (జనం సాక్షి) :** మల్కాజ్గిరి కార్పొరేషన్, కీసర సర్కిల్ పరిధిలోని సర్ ప్రక్రియలోని లోపాలను సరిచేయ్యాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు హైమారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. బిఎల్ఓలు సరైన సమయానికి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్స్ ను అందించకపోవడంలేదని, ఓటర్లకు ఉన్నటువంటి సందేహాల నివృత్తిని తీర్చకపోవటము, ఓటర్లకు తగు రీతిలో స్పందించకపోవడం, సర్ ఫాములను ఇంకా డివిజన్లలో ఓటర్లకు అందించకపోవడం, బిఎల్ఓలు గ్రామాలలో ఒక దగ్గర కూర్చుని ఓటర్లను పిలిపించుకొని సర్ ఫామ్స్ అందించటం సరియైన పద్ధతి కాదని ఈ సమస్యలను పరిష్కరించి బిఎల్ఓలను తక్షణమే ఓటర్లకు అందుబాటులో ఉంచే విధంగా తగు చర్యలు తీసుకొని ఓటర్లలో ఉన్నటువంటి అభద్రతా భావాన్ని నివృత్తి చేయవలసిందిగా కోరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.హైమారెడ్డి బిజెపి రాష్ట్ర నాయకురాలు మరియు వ్యవస్థాపక అధ్యక్షురాలు మహిళా శక్తి మై వాయిస్ సంఘం, రమేష్ అంబటి ట్రెజరర్ మహిళా శక్తి మహిళా సంఘం, ఆంజనేయులు ముదిరాజ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.


## ఓయూలో 'ఓజస్-2కె26' ప్రారంభం



**సికింద్రాబాద్, జూలై 7 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న సాహిత్య, సాంస్కృతిక, అకాడమిక్ ఉత్సవం 'ఓజస్--2కె26' మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలానుగుణంగా విద్యార్థులు తమను తాము మార్చుకుంటూ కొత్త నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని వెలికితీసి విజయాన్ని సాధించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఓయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్ మాట్లాడుతూ, వ్యక్తిగత క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, నైపుణ్యాల ద్వారానే విద్యార్థులకు అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికగా 'ఓజస్--2ఖ26' నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ, ఆర్ట్స్ కళాశాల ఉద్యమాలకు మాత్రమే కాకుండా అకాడమిక్ ప్రతిభకు కూడా చిరునామా అని అన్నారు. నగరంలోని సుమారు 30 కళాశాలల విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కరస్పాండెంట్ కె. కృష్ణారావు, ఓయూ పాలక మండలి సభ్యుడు బి. మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, ఎన్టీవీ సీఈవో రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన విగ్రహ ప్రతిష్టలు

**మల్దకల్, జూలై 7 (జనంసాక్షి) :** మండల పరిధిలోని నేతివానిపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయములో శ్రీ ఆంజనేయ, వినాయక, శివ పార్వతిదేవి, నందీశ్వర, నవగ్రహ, నాగదేవతా, వాల్మీకి, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన మహోత్సవములు మంగళవారము ఘనంగా ప్రారంభమయ్యాయి. త్రిదివసదీక్షతో తంత్రసారా ఋక్వేద మంత్రనుసారము బ్రహ్మశ్రీ సహస్రాధిక ప్రతిష్ఠాపన చార్యులు 1052అఖిల భారత శ్రీగురు పురస్కార గ్రహీతలు రమేశాచార్యులు, మణురు ప్రసన్నచార్య, ప్రమోదాచారి, నరేష్, రాఘవేంద్ర దాస్, శశాంకదాస్, ప్రాణేష్, రవి, ప్రద్యుమ్న ఋత్విక్ లచే నూతన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నందు శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ శివపార్వతి, శ్రీవినాయక, నందీశ్వర, నవగ్రహ, నాగదేవతా, వాల్మీకి విగ్రహాము, బొడ్డురాయి గ్రామలక్ష్మి ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు.



మంగళవారము ఉదయం గంగపూజ, విగ్రహ ఉరేగింపు, యాగశాల ప్రవేశము, ఆలయ ప్రవేశం, అఖండ దీపస్థాపన, గణపతిపూజ, స్వస్తివాచనము, నాందీ సమారాధనము రక్షాబంధనము, పంచగవ్య పాశనము, నవగ్రహ మృత్యుంజయ పూజ ప్రధాన కలశపూజ, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. ప్రదోషపూజ, ఆవాహిత సర్వ దేవతాహనము, మహా స్నపనము, జలాధివాసం, మంగళహారతి నిర్వహించారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పారదర్శకంగా సాగాలి



**ఉప్పల్, జూలై 7 (జనం సాక్షి) :** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల జాబితానే మూలాధారమని, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బీజేపీ సీనియర్ నాయకుడు గోనె శ్రీకాంత్ ముదిరాజ్ అన్నారు. చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆయన, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తూ విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)ను కలిసి ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన, ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలిస్తూ ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని గోనె శ్రీకాంత్ ముదిరాజ్ కోరారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**షాబాద్, జులై 7 (జనం సాక్షి) :** మండల పరిధిలోని సీతారాంపూర్ పారిశ్రామిక వాడలో నెలకొల్పిన ప్రీమియర్ సోలార్ కంపెనీ ప్రారంభోత్సవంలో పాల్గొననున్న రాష్ట్ర ముఖ్యమంత్రి భద్రత ఏర్పాట్లను చేవెళ్ల జోన్ డీజీపీ యోగేష్ గౌతమ్, చేవెళ్ల ఏసిపి తో కలిసి మంగళవారం సందర్శించిన కమిషనర్ తరుణ్ జోష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జులై 9న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపట్టవలసిన బందోబస్తు ఏర్పాట్లను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. భద్రత ఏర్పాట్లు, ప్రవేశ మార్గాలు, వాహనాల నిలుపుదల, సిబ్బంది విధుల కేటాయింపు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే చర్యలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి, ఇన్స్పెక్టర్ సతీష్, స్టేషన్ సిబ్బంది, ప్రీమియర్ సోలార్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

# కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కల్వకుర్తి రహదారులు

- షాపింగ్ నిర్వాహకుల చెలగాటం...
- పాదచారులకు ప్రాణ సంకటం!
- మున్సిపాలిటీ మౌనం... సంబంధిత అధికారులనిర్లక్ష్యం?



**కల్వకుర్తి, జూలై 7 (జనంసాక్షి) :** కల్వకుర్తి పట్టణంలోని ప్రధాన రహదారులు నేడు ప్రజల రాకపోకలకు కాకుండా అక్రమ పార్కింగ్,ఆక్రమణలు,వ్యాపార విస్తరణలకు కేంద్రాలుగా మారిపోయాయనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. పట్టణంలోని తిరుపతి హైవే బ్రిడ్జి సమీపం, నాగర్‌కర్నూల్ చౌరస్తా,మహబూబ్‌నగర్ చౌరస్తా,ఎస్బీఐ బ్యాంకు పరిసరాలు,వైన్స్ షాపులు,బార్ అండ్ రెస్టారెంట్ల ప్రాంతాలు, హైదరాబాద్ చౌరస్తా ప్రధాన కూడలి,హైదరాబాద్ చౌరస్తా నుంచి కూరగాయల మార్కెట్ మార్గం వరకు, దామోదర్ రెడ్డి ఆసుపత్రి గల్లి,శివాజీ చౌక్,బస్టాండ్ ప్రాంతం, ప్రభుత్వ కళాశాల పక్క గల్లి,మయూరి మెడికల్ షాప్,గప్‌చుప్ బండి పరిసరాలు,ఏటు జెడ్ మెడికల్ షాప్ నుంచి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు,హైదరాబాద్ చౌరస్తా నుంచి పాలబూత్ వరకు, హైదరాబాద్ రోడ్ సిగ్నల్ నుంచి కన్యకా పరమేశ్వరి కమాన్ వరకు ఫుట్‌పాత్‌లు, రహదారులు భారీగా ఆక్రమణలకు గురయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.పట్టణ అభివృద్ధి పేరుతో వెలసిన అనేక వాణిజ్య సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తమ సొంత పార్కింగ్ సదుపాయాలు కల్పించకుండా ప్రజా రహదారులనే పార్కింగ్ స్థలాలుగా మార్చేశాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఫలితంగా ప్రధాన రహదారులపై వాహనాలు వరుసగా నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.ముఖ్యంగా బస్టాండ్ ప్రాంతం,పోస్టాఫీస్ గల్లి,హైదరాబాద్ చౌరస్తా, నాగర్‌కర్నూల్ చౌరస్తా వంటి రద్దీ ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల నిలుపుదల కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల రహదారిలో సగానికి పైగా భాగం పార్కింగ్‌కేపరిమితమవుతుండటంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.అత్యంత దయనీయ పరిస్థితి పాదచారులదే. ఫుట్‌పాత్‌లను వ్యాపారాలు ఆక్రమించుకోవడం,రహదారులపై వాహనాలు నిలిపివేయడంతో నడిచే స్థలం లేక ప్రజలు వాహనాల మధ్య ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడవాల్సి వస్తోంది.విద్యార్థులు,మహిళలు,వృద్ధులు ప్రతిరోజూ ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ పార్కింగ్,రహదారి ఆక్రమణలపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత శాఖ కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలు సామాన్య ప్రజలకేనా? ప్రభావశీలులకు వర్తించవా?అనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. వాణిజ్య సముదాయాలకు అనుమతులు జారీ చేసే సమయంలో పార్కింగ్ నిబంధనలు పరిశీలించారా లేదా అనే సందేహాలు కూడా తలెత్తుతున్నాయి.అనుమతులు ఒకలా, అమలు మరోలా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.కొందరు వ్యాపార నిర్వాహకులు ప్రజా రహదారులను తమ సొంత ఆస్తుల్లా వినియోగిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి కల్వకుర్తి పట్టణంలోని ప్రధాన రహదారులపై ప్రత్యేక సర్వే నిర్వహించి అక్రమ పార్కింగ్,ఫుట్‌పాత్ ఆక్రమణలు, రహదారి కబ్జాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.లేకపోతే రానున్న రోజుల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమై ప్రజల ఇబ్బందులు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

## బాడీ బిల్డింగ్‌లో నాగర్ కర్నూల్ యువకుడి ప్రతిభ

- ఆల్ఫా మజిల్ క్లబ్ నేషనల్ పోటీలో మొదటి స్థానం




**నాగర్‌కర్నూల్, జూలై 7 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన సయ్యద్ ఫెరోజ్ అనే యువకుడు హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియంలో ఆల్ఫా మజిల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయస్థాయి పోటీలలో ఓవరాల్ నేషనల్ ఛాంపియన్ గా నిలిచాడు. ఆల్ఫా మజిల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి న్యాచురల్ షోలో సయ్యద్ ఫెరోజ్, మెన్స్ ఫిజిక్ ఓవరాల్ టైటిల్ ను సాధించాడు. బాడీ బిల్డింగ్ ప్రో కార్డ్, క్లాసిక్ ఫిజిక్ ప్రో కార్డు, మెన్స్ ఫిజిక్ లో మొదటి స్థానంలో నుంచినిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. అదేవిధంగా బాడీ బిల్డింగ్ లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం క్లాసిక్ ఫిజిక్ లో రెండవ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించాడు. ఓ ప్రైవేట్ జిమ్ లో ట్రైనర్ గా ఉన్న మమ్మద్ ఫిరోజ్ ఓవరాల్ ఛాంపియన్ గా నిలవడం పట్ల పలువురు అతనిని అభినందించారు. బాడీ బిల్డింగ్ లో నాగర్ కర్నూల్ పట్టణానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిన సయ్యద్ ఫిరోజ్ ను పలువురు క్రీడాకారులు, వివిధ సంఘాలు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సభ్యులు అభినందించారు.

# ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట, జూలై 7 (జనం సాక్షి) :** పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో మంగళవారం శ్రీ మహాలక్ష్మి మ్యాక్సీ విజన్ ఈహెచ్ఎస్ ఐ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించి తను కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం నుంచి నిర్వహించిన ఈ శిబిరానికి అచ్చంపేట పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, "కంటి చూపు మనిషికి భగవంతుడు ప్రసాదించిన అమూల్యమైన వరం. చిన్నచిన్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ నిరంతరం కంటి పరీక్షలు చేయించుకోవాలి. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయి. అర్హులైన వారు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అందిస్తున్న ఉచిత శస్త్రచికిత్సల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. శిబిరంలో వైద్య నిపుణులు ప్రతి ఒక్కరికీ సమగ్రంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, వైద్య సలహాలు అందించారు. కంటి శుక్లాలు (క్యాటరాక్ట్) ఉన్నట్లు గుర్తించిన రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులకు శస్త్రచికిత్సలను పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడు అంగరేకుల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి కానోజు మనోహర్ ప్రసాద్ (మన్ను పటేల్) మాట్లాడుతూ, ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. శిబిరం విజయవంతానికి సహకరించిన వైద్య బృందానికి, క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ ఉపాధ్యక్షులు కందికొండ శ్రీధర్, కోశాధికారి పోకల ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన పాల సేకరణపై అవగాహన సదస్సు




**జడ్చర్ల, జూలై 7 (జనంసాక్షి) :** జడ్చర్ల మండల పరిధిలోని పెద్ద ఆదిరాల గ్రామంలో బి.ఎమ్.సి.యు అధ్యక్షులు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ, తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డైరీ) మహబూబ్ నగర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పాడి రైతులకు నాణ్యమైన పాల సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శివానంద స్వామి, విజయ డైరీ డి.డి సత్యనారాయణ, విజయ డైరీ చైర్మన్ రవీందర్ రెడ్డి దూడల సంరక్షణ, నట్టల నివారణ మందుల వినియోగం, క్రమం తప్పకుండా టీకాలు వేయించడంపై రైతులకు అవగాహన కల్పించారు. మేలు జాతి గడ్డి రకాలను పెంచడం ద్వారా దాణా ఖర్చును తగ్గించుకుని, ఆర్థికంగా ఎలా అభివృద్ధి చెందాలో వివరించారు. ఇంట్లోనే సమీకృత దాణాను తయారు చేసుకునే పద్ధతులు, కృత్రిమ గర్భాధారణ ద్వారా అధిక దిగుబడినిచ్చే ఆడదూడలను పొందే మార్గాలు, నాణ్యమైన పాలను ఉత్పత్తి చేసేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు చేశారు. రైతులకు ఎల్లప్పుడూ మెరుగైన పశు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాడి రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాల సేకరణ ధరను పెంచాలని, నిరంతర పశువైద్య సేవలు అందించాలని, సబ్సిడీపై దాణాను సరఫరా చేయాలని, పాడి పశువులకు భీమా సౌకర్యం కల్పించాలని జిల్లా అధికారులను కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి (కోడుగల్) డాక్టర్ శ్రావణి, డాక్టర్ శివరాజ్, డాక్టర్ ఆశరాణి, డాక్టర్ నివేదిత, సర్పంచులు శ్రీనివాస్ గౌడ్, శ్రీశైలం తదితరులతో పాటు విజయ డైరీ గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులు పాడి రైతులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందికి ఎంఎస్ ఆఫీస్‌పై ప్రత్యేక శిక్షణ



**సంగారెడ్డి బ్యూరో, జూలై 7 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎంఎస్ ఆఫీస్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పి మాట్లాడుతూ...పోలీసు సిబ్బందికి ఎంఎస్ ఆఫీస్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, సైబర్ వారియర్స్, టెక్ టీమ్ సిబ్బంది కలిపి మొత్తం 180 మందిని మూడు బ్యాచ్‌లుగా విభజించి, ప్రతి బ్యాచ్‌కు మూడు రోజుల చొప్పున శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. వోక్సెన్ యూనివర్సిటీలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా ప్రాక్టికల్ విధానంలో ఈ శిక్షణ కొనసాగుతోందన్నారు. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది నైపుణ్యాలను మరింత మెరుగుపరచడమే ఈ శిక్షణ లక్ష్యమని తెలిపారు. కార్యాలయ పనితీరులో వేగం, ఖచ్చితత్వం, సమర్థత పెంచడంలో ఇలాంటి శిక్షణలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. రోజువారీ విధుల్లో ఉపయోగించే ఎంఎస్ ఆఫీస్, ఎక్సెల్ వంటి సాఫ్ట్‌వేర్‌లపై పూర్తి అవగాహన పెంపొందించుకుని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వోక్సెన్ యూనివర్సిటీ డీన్ దయ శంకర్, ప్రొఫెసర్ ఉపాధ్యాయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మహిళా సమైక్య భవనానికి భూమి పూజ



**నారాయణపేట, జూలై 8 (జనం సాక్షి) :** నారాయణపేట మండయులం పేరపల్ల కింది తండాలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పెరపల్ల కింది తండా లో సర్పంచ్ సోనా బాయ్ సురేష్ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య భవన్ భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ శరణప, గ్రామ పంచాయతీ సెక్రటరీ రాకేష్ సీసీ వసంత మేడం గ్రామ మహిళా సంఘం అధ్యక్షులారు దేవుల బాయి,గ్రామ మహిళలు కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్ గ్రామ పెద్దలు యూవకులు పాల్గొన్నారు.

## హక రైతు సేవా సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**మల్దకల్, జూలై 7 (జనంసాక్షి) :** మండలం పరిధిలో విఠలాపురం గ్రామంలోనిహక ఫార్మర్ సర్విస్ రైతు సేవా కేంద్రాన్ని గద్వాలఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరంఎమ్మెల్యేకి షాప్ యజమాని శాలువా కప్పి ఘనంగాసత్కరించారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు ఫర్టిలైజర్ అందజేశారు.ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీపీ రాజారెడ్డి,మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి,జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు,మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి,మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, నాయకులు సత్యరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి,మధు నాయకి,సుధాకర్ గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి,బాబురెడ్డి, తిమ్మరాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవాలి



**కృష్ణ, జూలై 7 (జనం సాక్షి) :** క్రిష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో జిల్లా పార్టీ ఆదేశానుసరం జరుగుతున్న సర్ ఓటరు సవరణ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా కార్యదర్శి ఉజ్జెల్లి కనకరాజు, మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప సూచించారు. బిఎల్ఐలతో కలిసి ఇంటింటికి వెళ్లే తిరిగి ఓటర్లకు అవగాహన కల్పించారు, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవాలని ఒక వ్యక్తికీ ఒకే ఓటు మరణించిన,వ్యక్తి ఓటు తొలగింపు, అర్హత లేని ఓట్లను తొలగించడం 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించడం లక్ష్యంగా ఎస్ఐఆర్ ఓటరు సవరణ జరుగుతుందని ఇది దేశ స్వతంత్ర అనంతరం 11 సార్లు జరిగిన ప్రక్రియ అని గత 20 సంవత్సరాల క్రితం 2002లో మన దేశలో జరిగిందని ఆ ఓటర్ లీస్ట్ ఆధారంగానే వారి బంధువుల ఓట్లను అర్హత కిందికి పరిగనిస్తారని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు చురుకుగా పాల్గొని ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువులో గా ప్రతి ఓటరు ఫారం ను నింపి లకు సమర్పించాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దండు కవిత, వెంకటేశ్వరమ్మ, సునీతాలు బూతుపూర్ ఆంజనేయులు, కే. నాగరాజు, కుర్వ బీరప్ప, తిరుమలేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**బెజ్జంకి, జూలై 7 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు వడ్లూరి పరశురాములు ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మార్పీఎస్(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి)32వ ఆవిర్భావ దినోత్సవం,సంస్థ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఎంఆర్పీఎస్,అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జెండా ఆవిష్కరించి,కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం మండల అధ్యక్షులు వడ్లూరి పరశురాములు మాట్లాడుతూ ఎంఆర్పీఎస్ గత 32 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం రాజ్యాంగబద్ధంగా పోరాడుతూ, దళితులు,పేదలు, వికలాంగులు, విద్యార్థులు,అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం ఉద్యమిస్తోందన్నారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సామాజిక న్యాయం కోసం ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే నాయకుడిగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి గ్రామ సర్పంచ్ బొల్లం శ్రీధర్,వార్డు సభ్యులు,లోనే నర్సింగరావు,తిప్పరాపు మహేష్,పొట్లపల్లి శివ,జిల్లా నాయకులు చింతకింది పరశు రాములు,మండల ప్రధాన కార్యదర్శి మోదుంపల్లి రాజు,పట్టణ అధ్యక్షులు బోనగిరి చంద్రయ్య,అంబేద్కర్ సంఘం నాయకులు,వివిధ గ్రామ శాఖల ప్రతినిధులు,ఆటో యూనియన్ సభ్యులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాలానుగుణ అంటువ్యాధులను అరికట్టాలి

- అన్ని శాఖల సమన్వయంతో అంటువ్యాధులను నివారించాలి
- కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ హేమంత్ కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్, జూలై 7 (జనంసాక్షి) :** జిల్లాలోని వివిధ శాఖల సమన్వయంతో వర్షాకాలంలో సంభవించే అంటూ వ్యాధులను నివారించాలి మరియు అరికట్టాలి అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ వివిధ జిల్లా శాఖల అధికారులకు సూచించారు. మంగళవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల సంసిద్ధత పై వివిధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా అన్ని గ్రామ పంచాయతీలలో, పట్టణ వార్డులలో పరిసరాల పరిశుభ్రత మెయింటైన్ చేయాలని, డ్రైనేజ్ కాలువలలో నీరు నిలవకుండా చూడాలని, నీరు నిలిచే ప్రాంతాలలో దోమల పెరుగుదలను అరికట్టడానికి ఆయిల్ బాల్స్ వేయాలని, ప్రతి శుక్రవారం నిర్వహించి డ్రై డే కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బందితోపాటు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడి టీచర్లు, సంబంధిత ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్లు పాల్గొని దోమల పెరుగుదలను అరికట్టాలని జిల్లా పంచాయతీ అధికారికి మరియు మున్సిపల్ కమిషనర్లకు తెలియజేశారు. అదేవిధంగా వాటర్ ట్యాంకులను ప్రతి పది రోజుల కు ఒకసారి శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేసిన తర్వాతనే నీటిని ప్రజల వినియోగం కోసం వదలాలని అధికారులకు తెలియజేశారు. త్రాగునీరు కలుషితం కాకుండా పైపుల లీకేజీల ను అరికట్టాలని తెలియజేశారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర జ్వరాలను పరీక్షించే కిట్లను సిద్ధంగా ఉంచుకోవాలని, జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో, మరియు తాలూకా ఆసుపత్రులలో జ్వర బాధితులను చికిత్స చేయడానికి ప్రత్యేక వార్డులను, పడకలను సిద్ధం చేయాలని జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరిండెంట్, డి సి హెచ్ ఎస్ కు ఆదేశాలు జారీ చేశారు. అంటువ్యాధుల నివారణకు క్షేత్రస్థాయిలో ఆరోగ్యశాఖ సిబ్బంది విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిఎంహెచ్వో కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సీజన్లు అన్ని గ్రామాలలో పట్టణ వార్డులలో ప్రతిరోజు ఫీవర్ సర్వే చేపట్టాలని డి ఎం హెచ్ ఓ కు సూచించారు. అదేవిధంగా జులై 13న నిర్వహించి జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజవంతం చేయడంలో జిల్లా విద్యాధికారి, జిల్లా సంక్షేమ అధికారి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో, జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ, జి జి హెచ్ మెడికల్ సూపర్ఇండెంట్ డాక్టర్ ఉషారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రామకృష్ణ, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కే రవికుమార్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ కృష్ణమోహన్, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, డాక్టర్ భీమానాయక్, డాక్టర్ తారా సింగ్, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలచారి, డిపిఓ రేనయ్య, ఎపీడేమియాలజిస్ట్ ప్రవల్లిక, ఏపీవోలు విజయ్ కుమార్, కళ్యాణ్ కృష్ణారావు, సిపిఎం రమేష్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్ పారిశుధ్య నిర్వహణకు అంతర్జాతీయ ప్రశంసలు

- నగర మలశుద్ధీకరణ విధానాలను పరిశీలించిన ఎడిబిఎ జపాన్ కన్సల్టెంట్



**హనుమకొండ, ప్రతినిధి, జూలై 7 (జనంసాక్షి) :** గ్రేటర్ వరంగల్ నగరంలో అమలు చేస్తున్న మలశుద్ధీకరణ, మలవిసర్జన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ విధానాలను ఆసియా అభివృద్ధి బ్యాంకు సంస్థ జపాన్ కన్సల్టెంట్ డాక్టర్ కజుషి హషిమోటో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రశంసించారు. ముందుగా ప్రతినిధుల బృందం అమ్మవారిపేటలో ఏర్పాటు చేసిన రోజుకు 15 కిలోలీటర్లు, 150 కిలోలీటర్ల సామర్థ్యం గల మలశుద్ధీకరణ కేంద్రాలను సందర్శించి, అక్కడ అమలవుతున్న శుద్ధీకరణ ప్రక్రియ, నిర్వహణ విధానాలను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ లో మలవిసర్జన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థపై ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్, జిడబ్లుఎంసి ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయ్, బల్దియా కమిషనర్ టి. వెంకన్నతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, నగరంలో మలవిసర్జన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సుస్థిర పారిశుద్ధ్య విధానాలను ప్రోత్సహించే క్రమంలో జీడబ్ల్యూఎంసీ, ఆస్కీ సంస్థల సహకారంతో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్‌లో అమలవుతున్న పారిశుద్ధ్య నిర్వహణ విధానాలు, మలశుద్ధీకరణ సాంకేతికత, వనరుల పునర్వినియోగ విధానం ఆదర్శప్రాయంగా ఉన్నాయని డాక్టర్ కజుషి హషిమోటో ప్రశంసించారు. ఈ తరహా సుస్థిర పారిశుద్ధ్య నమూనాలు ఇతర పట్టణాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీఎంహెచ్ ఓ డా. రాజారెడ్డి, ఈఈలు మహేందర్, స్పందన, ఆస్కీ ప్రతినిధులు డా. స్నేహలత, రాజ్‌మోహన్ రెడ్డి, అవినాష్ పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలి

- కాజీపేటలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**కాజీపేట, జూలై 7 (జనంసాక్షి) :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయ్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజున కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా కలెక్టర్, వార్డుల వారీగా ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలు, కుటుంబ సభ్యుల వివరాల నమోదు, నింపిన ఫారాల సేకరణ, డిజిటలీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు చేపట్టాలని, నింపిన ఫారాలను సకాలంలో సేకరించి ఎన్నికల సంఘం నిర్దేశించిన యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల వివరాల నమోదు సమయంలో పూర్తి ఖచ్చితత్వం పాటించాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలన జరిపి ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫారాలు నింపే క్రమంలో నిరక్షరాస్యులు ఉన్నట్లయితే బి ఎల్ ఓ బాధ్యత తీసుకుని సరైన సమాచారాన్ని ఓటర్ల నుండి తీసుకుని ఫారాలను పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసి డిజిటలీకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో కాజీపేట తహసీల్దార్ రాజు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గొండిలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**దుగ్గొండి, జూలై 7 (జనంసాక్షి):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్యశారద మంగళవారం దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం, దుగ్గొండి, గోపాలపురం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించి, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న పనితీరుపై ఆరా తీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి, ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, ఇంటింటి సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఎస్ ఐ ఆర్ పరిశీలనలో వచ్చిన రైతులతో గ్రామ పరిస్థితి పంటల విస్తీర్ణం ఏఏ పంటలు వేస్తున్నారు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటి వినియోగం ద్వారా పండించే పంటల కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ పరిశీలనలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి దుగ్గొండి తాసిల్దార్ సమ్మక్క, నర్సంపేట తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి బి ఎల్ వో లు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయాన్ని అపవిత్రం చేస్తున్నారు

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** దక్షిణ కాశీ కాళేశ్వర ఆలయాన్ని దుద్దిళ్ల దంపతులు అపవిత్రం చేస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాటారం మండలం ధన్వాడ గ్రామంలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు 2025 పుష్కరాల చీరలు పంపిణీ చేశారని, అవి ఆలయ నిధులతో కొన్నవేనని ఆధారాలతో సహా చూపించారు. పుష్కరాలకు 50 వేల చీరలు, ప్రసాదం కిట్లు కొని వాటిని ఎన్నికల కోసం దాచిపెడుతున్నారని ఆరోపించారు. ఆలయ ఖర్చుల వివరాలు అడిగితే సుప్రీంకోర్టు తీర్పు సాకు చూపుతున్నారని, కానీ ఆ తీర్పులో ఖర్చులు చెప్పవద్దని లేదని స్పష్టం చేశారు. ప్రతి పండుగకు కోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. పుష్కరాలకు యూపీ నుంచి పురోహితులను తెచ్చి గంగాహారతి చేయిస్తున్నారని, ఇక్కడి వేద పండితులను పక్కన పెట్టడం కమీషన్ల కోసమేనని అన్నారు. ఆలయానికి మచ్చ వస్తే భావితరాల భవిష్యత్ నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు చైతన్యవంతులై గళం విప్పే వరకు అవినీతి ఆగదని, పవిత్ర క్షేత్రాన్ని రాజకీయాలకు వాడుకోవడం సరికాదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల కోసం ఓటుకు 5 వేలు ఇచ్చేందుకు దోపిడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కటకం జనార్ధన్, లింగంపల్లి శ్రీనివాసరావు, జోడు శ్రీనివాస్, మార్క రాము గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

- రిమ్స్ డి-అడిక్షన్ సెంటర్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్
- గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ



**మావల, జూలై 08(జనం సాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం అని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల పూర్తి స్థాయిలో నిర్మూలించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని పేర్కొన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ లోగల డి అడిక్షన్ సెంటర్ ను పరిశీలించారు. ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ చట్టపరమైన చర్యలతో పాటు వ్యసనగ్రస్తులకు వైద్య చికిత్స అందించి వారిని సాధారణ జీవితంలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వైద్య సదుపాయాలు, చికిత్సా విధానాలు, వ్యసనగ్రస్తులకు అందించనున్న కౌన్సెలింగ్, పునరావాస సేవలపై వైద్య బృందంతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి సరఫరా, విక్రయం, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు గంజాయికి బానిసైన వారిని గుర్తించి వారికి శాస్త్రీయ పద్ధతిలో వైద్య చికిత్స, మానసిక కౌన్సెలింగ్ అందించడం ద్వారా శాశ్వతంగా వ్యసనం నుంచి బయటపడేలా చేయడం అత్యంత అవసరమని అన్నారు. శిక్షతో పాటు సంస్కరణ కూడా సమాజానికి అవసరమని, అందుకే జిల్లా పోలీస్ శాఖ వైద్య శాఖతో సమన్వయం చేసుకొని డి-అడిక్షన్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి సేవించే వ్యక్తులను గుర్తించి, మత్తు పదార్థాలకు బానిస అయిన వారిని గుర్తించి, వారి కుటుంబ సభ్యుల సహకారంతో స్వచ్ఛందంగా డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించి చికిత్స అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చికిత్స అనంతరం మళ్లీ మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా నిరంతర కౌన్సెలింగ్, పర్యవేక్షణ కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా వైద్య అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లాను నిర్మించగలమని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రిమ్స్ డైరెక్టర్ డా. రాథోడ్ జై సింగ్, డి-అడిక్షన్ సెంటర్‌కు చెందిన సైకాలజిస్టులు, వైద్యులు, సీఐలు కె. నాగరాజు, బి.డి. ప్రేమ్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బొగత జలపాతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

- ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ద్వారా సాంప్రదాయ వంటకాలకు ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జులై 07(జనంసాక్షి) :** వాజేడు మండలంలోని బొగత జలపాతాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తూ పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని, స్థానిక సాంప్రదాయ వంటకాలను పర్యాటకులకు అందుబాటులో ఉంచే విధంగా ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్ లో వాజేడు మండలంలోని బొగత జలపాతం అభివృద్ధి, పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ నిర్వహణ, స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బొగత జలపాతాన్ని సందర్శించే పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించేలా పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, విశ్రాంతి సౌకర్యాలు, భద్రత, దిశా నిర్దేశక బోర్డులు తదితర అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు స్థానిక సంస్కృతి, సంప్రదాయ ఆహార రుచులను పరిచయం చేసేలా ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ద్వారా జొన్న రొట్టె, బాంబూ చికెన్, నాటుకోడి, చేపల వంటకాలు, తదితర సాంప్రదాయ వంటకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధితో పాటు ఆదాయాన్ని పెంచుకోవాలని అన్నారు. పర్యాటక ప్రాంతంలో స్థానిక ప్రత్యేకతను ప్రతిబింబించే ఆహార పదార్థాలకు ప్రాధాన్యం కల్పిస్తూ, వచ్చే ప్రతి పర్యాటకుడికి నాణ్యమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని బొగత జలపాతాన్ని రాష్ట్ర స్థాయిలో ఆదర్శ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డిఎఫ్ఓ వికాస్ మీనా, టూరిజం అధికారి శివాజీ, అడిషనల్ డిఆర్డీఓ శ్రీనివాస్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ సీపీని కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, జులై 07 (జనంసాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతా రెడ్డిని మంగళవారం పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన పోలీస్ కమిషనర్‌కు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు చేపట్టనున్న చర్యలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పాలకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన శాంతిభద్రతల అంశాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ సహకారం కొనసాగాలని ఎమ్మెల్యే కోరగా, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి పేర్కొన్నారు.

# మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- హైదరాబాద్ నగరం తర్వాత వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసింది కేసీఆర్ మాత్రమే
- మీడియా సమావేశంలో అసెంబ్లీ మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్...



**హనుమకొండ ప్రతినిధి జులై 7 (జనం సాక్షి) :** హైదరాబాద్ నగరం తర్వాత వరంగల్ నగరాన్ని 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో కేసీఆర్ మాత్రమే అభివృద్ధి చేశాడని అసెంబ్లీ మాజీ చీఫ్ వి ప్ టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు మంగళవారం హనుమకొండ బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావడం జరిగిందని ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజా పాలన పేరుతోస్టేట్ నుంచి స్ట్రీట్ వరకు అవినీతి కి అడ్డు లేకుండా జరుగుతున్నదని అన్నారు అదేవిధంగాకుడాలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోంది తోడు దొంగలు రాజేందర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి అవినీతికి పాల్పడుతున్నారు అని ఆరోపించారుకుడా స్థలాలను అప్పనంగా పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారుసుమారు 70 కోట్ల అవినీతి కుడాలో జరిగింది తెలిపారుదేవుడి భూమి 5 ఎకరాల స్థలాన్ని స్టార్ హోటల్ కు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు అని అన్నారు. వెంకట్ రామ్ రెడ్డి భుజంపై తుపాకీ పెట్టి రాజేందర్ రెడ్డి కాలుస్తున్నారు అని ఎద్దేవా చేశారు. అనంతరం కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి.. మాట్లాడుతూ6,697 గజాలను వేలంలో పెట్టారు. 100 కోట్ల ఆదాయం కుడాకు రావాలి. కానీ 49 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది ఎందుకని ప్రశ్నించారు. నర్సంపేట రోడ్డులో కమర్షియల్ ఫ్లాట్ కు గజం 85 వేలు ఫిక్స్ చేశారు దీని వెనుక ఆంతర్యం ఏమిటో తెలపాలని అన్నారు. అవినీతి లేదన్న కాంగ్రెస్ నాయకులు కుడాకు 70 కోట్ల నష్టం చేశారు అని ఆలోచించారు. నీతులు చెప్పే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే కూడా భూముల వేలాన్ని రద్దుచేసి మరింత ఆదాయం చేకూర్చేలా బహిరంగ వేలం వేయాలని తెలియజేశారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు ఈ కార్యక్రమంలో రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసు దేవ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 07 (జనంసాక్షి) :** ఈనెల 6 సోమవారం రోజున రాత్రి 8 గంటల ప్రాంతంలో స్టేషన్ ఘన్పూర్ లోని చాగల్ గ్రామంలోని తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ అయిన సంపత్ రాజ్ అనునతడు ఒక ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఇంటి పై అంతస్తులో మంచం పై నిద్రిస్తున్న ఒక వృద్ధురాలు పక్కలో పడుకొని ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ మహిళ అతన్ని నెట్టివేసి గట్టిగా అరిచేసరికి ఆమె కోడలు ఇంటి ముందు ఇంటి వెనక డోర్స్ మూసి వేయడంతో పాటు అరుపు లు చేస్తూ ఆమె భర్తకి చెప్పడం దిగిందని ఆమె తెలిపారు. వాళ్ళు వచ్చేసరికి అతను ఇంటి గోడ దునికి పక్క ఇంటిలోని బాత్రూమ్‌లో దాక్కొని ఉండడం జరిగిందన్నారు. అక్కడి చుట్టుపక్కల వాళ్ళు వచ్చి చూసే సరికి అతన్ని 9 వార్డ్ కౌన్సిలర్ అని గుర్తుపట్టి చెప్పడంతో ఆ మహిళ కొడుకు పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి సదరు సంపత్ రాజును పట్టుకొని మంగళవా రం కోర్టు లో ప్రవేశ పెట్టడం జరిగిందని ఎస్సై పిట్ట రాజేష్ తెలిపారు.

# మా పుస్తెలను అమ్ముకోమ్మంటారా?


- సర్పంచ్, పాలకవర్గం మీద నిరాదారమైన ఆరోపణలు చేస్తే సహించం
- మహిళా సంఘం సభ్యురాలు ధనలక్ష్మి



**కమలాపూర్, జులై 07 (జనం సాక్షి ) :** బెల్ట్ షాపులు నిర్వహిస్తే కమలాపూర్ లోని మహిళా సంఘాలు కలిసి బెల్ట్ షాపులను ధ్వంసం చేస్తామని మహిళా సంఘం సభ్యురాలు ధనలక్ష్మి అన్నారు. గ్రామ సర్పంచ్, పాలకవర్గం మీద అసత్య ప్రచారాలు చేస్తూ తప్పుడు రాతలు రాస్తున్నారని ఆమె తప్పుబట్టారు. మంగళవారం గ్రామ పంచాయతీ లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. నూతన పాలకవర్గం ఏర్పడిన తర్వాత పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామంలో బెల్ట్ షాపులు ఎక్కువయ్యాయని వాటి కారణంగా చాలా కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా కొంత మంది మహిళలు భర్తలను కూడా కోల్పోయారని పాలకవర్గం ముందు మా ఆవేదనను వ్యక్తం చేశామని, మా బాధను విన్న పాలకవర్గం బెల్ట్ షాపులు బంద్ చేయాలని తీర్మానం చేసి బెల్ట్ షాపుల నిర్వాహకులకు నెల రోజుల ముందే సమాచారం అందించారని తెలిపారు. పాలకవర్గం ఆదేశాలను బేకారత్ చేస్తూ బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు, గ్రామ యువకులు వెళ్లి వాటిని స్వాధీనం చేసుకుని మరల ఇది పునరావృత్తం కాకుండా చూసుకోవాలని కోరారే తప్ప దౌర్జన్యం చేసింది ఎక్కడ ఉందో చూపెట్టాలని డిమాండ్ చేశారు. గ్రామంలో బెల్ట్ షాపులు అందరు బంద్ చేస్తే ఎడ్ల రవీందర్ అనే అతను ఒక్కడే ఎందుకు బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడో సమాధానం చెప్పాలన్నారు. మీ బెల్ట్ షాపుల కారణంగా ఎన్నో జీవితాలు రోడ్డున పడుతున్నాయని ఆరోపించారు. గ్రామం ప్రశాంతంగా ఉండటం మీకు ఇష్టం లేదా అని ప్రశ్నించారు. బంగారం ఎత్తుకెళ్లారు అని అంటున్న ఎడ్ల రవీందర్ బెల్ట్ షాపులో ఎవరు బంగారాన్ని తాకట్టు పెట్టి మద్యం సేవించారో చెప్పాలన్నారు. బంగారం ధర పెరగడంతో ఈ రోజుల్లో ఎవరు కూడా బంగారాన్ని ఇంట్లో పెట్టుకోవడం లేదని అలాంటిది ఎడ్ల రవీందర్ బెల్ట్ షాపులో బంగారం ఎలా పెడతారని అన్నారు. బెల్ట్ షాప్ నిర్వహించడమే తప్పు అంటే ఊరు కోసం మంచి చేస్తున్న సర్పంచ్, పాలకవర్గం మీద అసత్య ప్రచారాలు చేస్తూ కేసులు పెట్టించడం సిగ్గుచేటు అన్నారు. ఎడ్ల రవీందర్ తో తప్పుడు కేసులు పెట్టించడం వెనకాల ఎవరెవరో ఉన్నారో తొందరలోనే అన్ని బయటపడతాయని, వచ్చే ఎన్నికల్లో వారి పరిస్థితి ఎలా ఉంటుందో మహిళా లోకం చూపిస్తుందని హెచ్చరించారు. పాలకవర్గం కాదు ఇక మేమే రంగంలోకి దిగుతామని ఎక్కడ బెల్ట్ షాప్ నిర్వహిస్తే అక్కడకు వెళ్లి మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తామని ఎవరు అడ్డుకుంటారో చూస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్తలు రాసిన వారైనా రాయించిన వారైన వాళ్ళ ఇంట్లో ఉన్న మహిళల ఒంటి మీద పుస్తెల తాడు లేకుంటే ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించరాదని గ్రామ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేసిన బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారి పై అబ్కారి శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని మేము అనుకోవడంలేదని చట్టం చేతుల్లో ఉన్నవారు అలసత్వం వహిస్తే తప్పకుండా మేము చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మార్క సరిత, తుమ్మ స్వాతి, సఫియా, ఒస్కుల కీర్తన, మహిళా సంఘాల సభ్యులు సుమలత, గౌరీ దేవి, విజయ లక్ష్మీ, సృజన, రాధిక, శ్రీలత, రజిత, దీప, పుష్పలీల, ఉదయ శ్రీ, సుహాసిని, త్రివేణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలలు చేపల వేట నిషేధం

## మత్స్యశాఖ అధికారి విజయ్ కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు గోదావరి జలాశయాల్లో చేపల వేట నిషేధమని జిల్లా మత్స్యశాఖ అధికారి వై. విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ గణపురం మండలం గణప సముద్రం రిజర్వాయర్ తో పాటు జిల్లాలోని అన్ని జలాశయాల పరిధిలో ఈ నిషేధం అమల్లో ఉంటుందని ఉత్తర్వులు జారీ చేశారు. వరదల నేపథ్యంలో చేపల వనరుల సంరక్షణ, చేప పిల్లల అభివృద్ధి, మత్స్య సంపద పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు నెలల పాటు చేపల వేట, చేప పిల్లల సేకరణ, రవాణా, విక్రయాలపై పూర్తి నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తెలంగాణ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ చట్టం 1976 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్స్యకార సహకార సంఘాలు, గ్రామస్థులు ఆదేశాలు పాటించి సహకరించాలని కోరారు. వరదల తర్వాత చేపల ఉత్పత్తి పెరిగి మత్స్యకారులకు దీర్ఘకాలంలో మేలు జరుగుతుందని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
08 జూలై 2026

# అధిక లాభాలు అందించే ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి

- **అవగాహన సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 7 (జనం సాక్షి) :** అధిక దిగుబడి, మంచి మద్దతు ధరతో గణనీయమైన లాభాలను అందించే ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు జిల్లాలోని ఆదర్శ రైతులు చొరవ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. మాక్లూర్ మండలం చిన్నాపూర్ రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై మంగళవారం స్థానిక రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, సంప్రదాయ వరి పంట స్థానంలో ఆయిల్ పామ్ సాగు చేపడితే కలిగే ప్రయోజనాల గురించి అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టి దిగుబడులు పొందుతున్న ఆదర్శ రైతులు జైడి మధుసూదన్, లక్ష్మణ్, గడ్డం గంగారెడ్డి, సుధాకర్ తదితరులు తమ స్వీయ అనుభవాలను తోటి రైతులకు తెలియజేశారు. ప్రభుత్వ సబ్సిడీతో తాము ఆయిల్ పామ్ పంట సాగు చేశామని, ప్రస్తుతం మంచి దిగుబడి చేతికి వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అంతర పంట సాగు ద్వారా అదనపు ఆదాయాన్ని సైతం ఆర్జించడం జరిగిందని వివరించారు. డ్రిప్ ఏర్పాటు కోసం 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వమే డ్రిప్ పరికరాలను సమకూర్చిందని అన్నారు. తాము సహచర ఆదర్శ రైతులు కలిసి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాలకు వెళ్లి ముందుగా ఆయిల్ పామ్ సాగును అధ్యయనం చేశామని, ఏ రకంగా చూసినా ఈ పంట అధిక లాభాలు అందిస్తుందని గమనించి తాము కూడా ఆయిల్ పామ్ సాగు చేశామన్నారు. వరి, పసుపు వంటి పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగు ఎంతో శ్రేయస్కరం అని నిరూపితం అయ్యిందని రైతులు తమ స్వీయ అనుభవాన్ని తోటి రైతులతో పంచుకున్నారు. బైబ్యాక్ ఒప్పందాన్ని అనుసరిస్తూ, ప్రీ-యూనిక్ కంపెనీ వారు మద్దతు ధర చెల్లిస్తూ కలెక్షన్ సెంటర్ల ద్వారా ఆయిల్ పామ్ పంట దిగుబడిని సేకరిస్తున్నారని అన్నారు. పంట సాగులో తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, పైపెచ్చు ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగుకు శ్రమ, ఖర్చు కూడా ఎంతో తక్కువ అని తన వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మిగితా రైతులు కూడా ఇదే స్ఫూర్తితో ఆయిల్ పామ్ సాగును చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ పంట సాగుకు జిల్లాలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని, పంట సాగుకు అవసరమైన ఆయిల్ పామ్ మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ సీజన్ లో 1600 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, రైతుల ప్రయోజనార్థం కనీసం 2000 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగును ప్రోత్సహించాలని నిర్ణయించామని అన్నారు. ఈ పంట సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు సాలీనా 4200 రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఇన్ పుట్ సబ్సిడీని రైతు ఖాతాలో జమ చేస్తోందని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ యూనిట్ ను 90 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తోందని, ఆయిల్ పామ్ మొక్కలపై కూడా సబ్సిడీని అందిస్తోందని అన్నారు. ఆయిల్ పామ్ బోర్డు ఉన్నందున పంట అమ్మకం, మద్దతు ధర విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన పని లేదన్నారు. మొక్కలు అందించిన కంపెనీలే, బోర్డు ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేస్తాయని తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అంతర పంట వేసుకొని అదనపు లాభాలను పొందవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటకు ఉన్న డిమాండ్ ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రూ. లక్షన్నర నుండి రెండు లక్షల రూపాయల వరకు ఆదాయం ఆర్జించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక్కసారి ఆయిల్ పామ్ సాగు చేపడితే, కనీసం ముప్పై సంవత్సరాల పాటు ఈ పంట ద్వారా గణనీయమైన ఆదాయం పొందవచ్చని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు జిల్లా యంత్రాంగం తరఫున అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగుకు ఉపయోగపడే ఆధునిక పరికరాలను సబ్సిడీపై అందించేలా చొరవ చూపుతామని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తిని కనబరుస్తూ, అవగాహన సదస్సులో కలెక్టర్ సమక్షంలోనే డీ.డీలు చెల్లించేందుకు ముందుకు రాగా, కలెక్టర్ వారిని అభినందించారు. అదేవిధంగా ఆయిల్ పామ్ సాగు ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న బాశెట్టి గంగాధర్, రాహుల్ రాజ్, బాశెట్టి లక్ష్మణ్ తదితర రైతులను ఘనంగా సన్మానించారు. ఆయిల్ పామ్ పంట దిగుబడులతో కూడిన ఉత్పత్తులు, అధునాతన వ్యవసాయ పరికరాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను రైతులకు కలిసి సందర్శించారు. ఈ సదస్సులో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ప్రీ-యూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కిరణ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**బెజ్జంకి, జూలై 7 (జనం సాక్షి) :** మండలం లోని లక్ష్మీపూర్ గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)కార్యక్రమంపై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత--రత్నాకర్ రెడ్డి,తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి ఒకే ఓటు ఉండాలని,అందుకే ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ అందజేసిన దరఖాస్తు ఫారాలను 2002 ఓటరు జాబితా వివరాలతో పూర్తిగా నింపి,ఒక పాస్‌పోర్ట్ సైజు రంగు ఫొటో జతచేసి ఈ నెల 15వ తేదీలోపు సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు.ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు ఉండేలా చూసుకోవాలని,రెండు చోట్ల పేర్లు ఉంటే ఒకటి తొలగించబడుతుందని చెప్పారు.ఫారం సమర్పించని వారి పేర్లు జూలై 31,2026న విడుదలయ్యే ఓటరు జాబితాలో ఉండకపోవచ్చని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆసియా రఫాత్,జీపీఓ రాజశేఖర్,టైపిస్ట్ రమేష్,ఉపసర్పంచ్ గంగాధర హరీష్,ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,వార్డు సభ్యులు లింగాల అర్జున్,బోనగిరి మహేష్,బీఎల్‌వోలు,సీఏలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను సమర్ధవంతంగా అమలు చేయాలి

- **కలెక్టర్ దివాకర టీఎస్**



**ఏరుపాలెం, జులై 7 (జనంసాక్షి) :** సర్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పేర్కొన్నారు.మంగళవారం ఎర్రుపాలెం తాసిల్దార్ ఎస్.ఐ.ఆర్ పై తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రాజకీయ నాయకుల అవగాహన సమావేశం జరుగుతుండగా మండలంలో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై ఎర్రుపాలెం మండలంలో పర్యటించి అనంతరం ఆకస్మికంగా తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ఫై కార్యక్రమం పై తాసిల్దార్ సునీత ఎలిజిబెత్ నీ వివరాలు అడిగితె లుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ నాయకులంతా అధికారులకు ఈ ప్రక్రియకు సహాయ సహకారాలు అందించి ఓటరు వివరాలను బిఎల్ఓ లకు అందించాలని ఆయన అన్నారు. అనంతరం మండలంలో సాదా బైనమా పలు పెండింగ్ భూ సమస్యలపై పరిష్కరించాలని రాజకీయ నాయకులు పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తాసిల్దార్ సునీత ఎలిజిబెత్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. లు, రవికుమార్, శిరీష, సర్వేయర్,రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ, జిల్లా ఉపాధ్యక్షులు,వేమిరెడ్డి.సుధాకర్ రెడ్డి, మాజీ ఏఎంసి, చైర్మన్,చావా.రామకృష్ణ, నాయకులు, బొగ్గుల.గోవర్ధన్ రెడ్డి, తలపురెడ్డి.నాగిరెడ్డి, రాజీవ్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ పోరాటం మరువలేనిది



**నంగునూరు, జూలై 7 (జనం సాక్షి) :** మందకృష్ణ మాదిగ పోరాటం మరువలేనిదని ఎమ్మార్పీఎస్ నాయకులు దేవులపల్లి బాలరాజు అన్నారు. మంగళవారం రోజు ఏమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ మండల అధ్యక్షులు దేవులపల్లి బాలరాజు మాదిగ మండల ఇన్చార్జి ఆరేపల్లి కనకయ్య మాదిగ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి రాజయ్య మాదిగ ఎమ్మెస్సీ మండ అధికార ప్రతినిధి దేవులపల్లి శంకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధిపల్నాటి రాజు మాదిగ గ్రామ శాఖ అధ్యక్షులు పాపి గారి నరేష్ మాదిగ గార్ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల అసమానతలు తగ్గించడానికి జరిగిన పోరాటమే ఎమ్మార్పీఎస్ ఉద్యమం అన్నారు. ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాట అనంతరం వర్గీకరణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి పోరాటంతో వర్గీకరణ సాధ్యమైంది అన్నారు అమరుల ప్రాణ త్యాగం మరువలేనిది అన్నారు మాదిగలకు విద్య ఉద్యోగ రంగాలలో వర్గీకరణ ద్వారా అనేక అవకాశాలు అందుతాయి అన్నారు ఎమ్మార్పీఎస్ ఉద్యమం కేవలం వర్గీకరణ కోసమే కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించి అనేక పోరాటాలు చేసిందన్నారు 2008లో చిన్నపిల్లల గుండె జబ్బుల పై జరిగిన పోరాటమే ఆరోగ్యశ్రీ పథకానికి నాంది పలికింది అన్నారు అదేవిధంగా వికలాంగుల సమస్యలపై పోరాటం చేస్తూ ఆర్పి పించన్ పంపుతాను కారణమైందన్నారు మహిళా రిజర్వేషన్ కోసం పోరాటం ఎస్సీ ఎస్టీలలో ప్రమోషన్లలో రిజర్వేషన్ కోసం కోసం పోరాడన్నారు మరి ముఖ్యంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం మాదిగ జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు రాష్ట్రంలో అనేక సామాజిక పోరాటాలు ఎమ్మార్పీఎస్ స్టాప్ ఒక అధ్యక్షులు మందకృష్ణ మాది గారి ఆధ్వర్యంలో జరిగాయి అని అన్నారు ఇట్టి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దేవులపల్లి ఐలయ్య దేవులపల్లి రమేష్ దేవులపల్లి కోమన్న గారి బాలరాజు పెరుమాని యాదయ్య దేవులపల్లి సురేష్ దేవులపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మధిర మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర్ విస్తృత పర్యటన

- **పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన కలెక్టర్**



**మధిర, జూలై 7 (జనంసాక్షి) :** మధిర మండలంలో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు ఎరువుల పంపిణీ, విత్తనాల సరఫరాలో పారదర్శకతను పర్యవేక్షించేందుకు ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర టీ ఎస్ మంగళవారం దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్,గోదాములలో నిల్వ ఉన్న ఎరువుల స్టాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఖరీఫ్ సాగుకు అత్యంత కీలకమైన సమయంలో రైతులకు ఎటువంటి కొరత రాకూడదని ఆయన స్పష్టం చేశారు.యూరియా,ఇతర ఎరువుల లభ్యతపై అధికారులతో చర్చించిన ఆయన, నిల్వల వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని,బ్లాక్ మార్కెటింగ్‌కు ఏమాత్రం తావులేకుండా ప్రభుత్వ నిర్ణీత ధరలకే విక్రయాలు జరగాలని ఆదేశించారు.తనిఖీల్లో భాగంగా కలెక్టర్ స్థానిక రైతులతో నేరుగా మాట్లాడారు.వారికి అందుతున్న సేవలు, విత్తనాల నాణ్యత,ఎరువుల పంపిణీపై రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందజేయడమే లక్ష్యంగా సొసైటీ పనిచేయాలని.రైతులు కార్యాలయానికి వచ్చినప్పుడు వారిని ఆదరించి, సమస్యలను పరిష్కరించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి అని దిశానిర్దేశం చేశారు. ముందుగా మధిర పట్టణంలో కొనసాగుతున్న రిటైనింగ్ వాల్, మహాప్రస్థానం అభివృద్ధి పనులు, అండర్ డ్రైనేజీ నిర్మాణం, అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులను ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్ పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోనాధని కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లితలుపుల వెంకటేశ్వర్లు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మిర్యాల వెంకటరమణ గుప్తా, రంగా శ్రీనివాసరావు, తన్నీరు రామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

- **ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు**



**భద్రాచలం, జూలై 7 (జనంసాక్షి) :** భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను మంగళవారం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది హాజరు, అత్యవసర విభాగం, వార్డులు, ఔషధాల లభ్యత, పారిశుద్యం, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చికిత్స కోసం వచ్చిన రోగులు, వారి సహాయకులతో ఎమ్మెల్యే మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు.

## ఓటర్ల సందేహాల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

- **ఓటరు జాబితా పరిశీలన, ఫారమ్‌ల భర్తీపై నివృత్తి**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, జూలై 7 (జనంసాక్షి) :** జిల్లాలో ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.ఈ ప్రక్రియలో భాగంగా ప్రజలకు ఎదురయ్యే సందేహాలను తీర్చేందుకు, ఎన్యుమరేషన్ ఫారమ్ నింపే విధానంపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టరేట్ లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. 2002 ఓటరు జాబితాలో వివరాల పరిశీలనతో పాటు ఇతర సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి ఈ కేంద్రం నిరంతరం అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు , ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేయాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం సూచించింది.కలెక్టరేట్ ఆఫీస్ హెల్ప్‌డెస్క్ 6281492368, ఎలక్షన్ డిటీ బి.భరత్ 9573085943, ఐటీ సపోర్ట్ కె.రణదీప్ 9059170790 సెల్ నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.జిల్లాలోని ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ముఖ్యంగా 2002 ఓటరు జాబితాలో తమ వివరాలు ఎలా ఉన్నాయో చూసుకోవాలని, ఎన్యుమరేషన్ ఫారమ్‌లను తప్పులు లేకుండా నింపేందుకు హెల్ప్‌డెస్క్ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

## అర్హత కలిగిన ఓటర్ పేరు జాబితాలో ఉండాలి



**కొండాపూర్, జూలై 7 (జనం సాక్షి) :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంలో యువత, యువజన సంఘాల ప్రతినిధులు, బీఎల్ఏలు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొండాపూర్ తాసిల్దార్ బి.అశోక్ కోరారు.ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా తమ పరిధిలోని బీఎల్ఓ, జీపీఓ, పోలింగ్ స్టేషన్ హెల్ప్ డెస్క్ లేదా తహసీల్దార్ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. ఇంకా ఎన్యూమరేషన్ ఫారం అందని వారు సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి ఫారం పొందాలని తెలిపారు.2002 ఓటరు జాబితాలో తమ పేరు లేదా కుటుంబ సభ్యుల వివరాలను తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీఈఓ వెబ్‌సైట్ ద్వారా సులభంగా పరిశీలించవచ్చని పేర్కొన్నారు. అందిన ఎన్యూమరేషన్ ఫారాన్ని జాగ్రత్తగా పూర్తి చేసి, కలర్ ఫొటో, చిరునామా ధ్రువీకరణ పత్రం, వయస్సు ధ్రువీకరణ పత్రాలను జతచేసి బీఎల్ఓలకు అందజేసి తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు.అలాగే ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా స్వయంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని, తమతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను కూడా నమోదు చేయడంతో పాటు స్నేహితులు, ఇరుగుపొరుగు వారికి కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.తప్పులు లేని ఓటరు జాబితా తయారీలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న తహసీల్దార్, జూలై 24, 2026లోపు ఎన్యూమరేషన్ ఫారాన్ని తిరిగి సమర్పించని పక్షంలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదు కాకపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రజలందరూ అవగాహనతో పరస్పరం సహకరించి భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు.

# విద్యార్ధులను గుర్తించి ప్రత్యేక బోధన అందించాలి

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 7 (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రతి ఇంటర్మీడియట్ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ పనితీరు, విద్యా ఫలితాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి పనులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరపు ఫలితాల విశ్లేషణ, వచ్చే విద్యా సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న సివిల్ పనుల పురోగతి, ప్రైవేట్ జూనియర్ కళాశాలల అనుమతు లపై సమీక్షించగా, మెరుగుదల పరీక్షల అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కు సంబంధిత అధికారులు వివరించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించని విద్యార్థులపై సమగ్ర విశ్లేషణ చేపట్టి, కారణాలను గుర్తించాలని, ముఖ్యంగా ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉంటున్నారో గుర్తించి ఆ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో అధ్యాపకుల కొరత లేదని, అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించి వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ను తప్పనిసరిగా అమలు చేయాలని, తరచూ గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కాకపోతే మంచి ఫలితాలు ఆశించలేమని అన్నారు.నవంబర్ నాటికి వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రతి విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నాడో విశ్లేషించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. సిలబస్, పరీక్షా విధానంలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని బోధన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులపై జూనియర్ లెక్చరర్లు ప్రత్యేక దృష్టి సారించి శ్రద్ధతో ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి పనులకు రూ. 2.96 కోట్లు మంజూరయ్యాయని, అందులో రూ. 2.26 కోట్లు కళాశాలల ఖాతాలకు విడుదల కాగా ఇప్పటివరకు రూ.1.59 కోట్లు వినియోగించినట్లు తెలిపారు. పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ బుక్ రికార్డులు, వినియోగ ధృవీకరణ పత్రాలు సకాలంలో సమర్పిస్తే మిగిలిన నిధులు విడుదలవుతాయని చెప్పారు. నిర్మాణ పనులను సామర్థ్యం కలిగిన కాంట్రాక్టర్లకే అప్పగించాలని, అనవసర జాప్యాలకు అవకాశం ఇవ్వవద్దని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన కళాశాలల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని,పనులు ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనుబంధ గుర్తింపు, అవసరమైన అనుమతులు లేకుండా ఏ ప్రైవేట్ జూనియర్ కళాశాల కూడా నిర్వహించ రాదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరూ ఆటలాడేందుకు అవకాశం ఇవ్వబోమన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి, లోపాలను సరిదిద్దుకునేందుకు ఒక నెల గడువు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి కళాశాలలో శాశ్వత ప్రయోగశాలలు, అవసరమైన మౌళిక సదుపాయాలు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవిబాబు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# నాలుగో రోజూ లాభాలే

- ఎఫ్‌ఐఐ కొనుగోళ్లు రూ.243.03 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు: రూ.3,791.42 కోట్లు

**ముంబై:** బ్యాంకింగ్, చమురు రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం, ముడి చమురు ధరలు తగ్గడంతో దేశీయ సూచీలు సోమవారం లాభాలు నమోదు చేశాయి. వరుసగా నాలుగో రోజూ పెరగడంతో సెన్సెక్స్ 2 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 20 పైసలు తగ్గి 95.38 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.82 శాతం తగ్గి 71.53 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ సూచీ లాభపడగా, దక్షిణ కొరియా, జపాన్, షాంఘై సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో కదలాడాయి. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.12 లక్షల కోట్లు పెరిగి, రూ.482.31 లక్షల కోట్ల (5.05 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,940.90 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,763.91 పాయింట్లు) సానుకూలంగా నమోదైంది. ఇంట్రాడేలో 78,398.06 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 77,879.70 పాయింట్ల వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 521.16 పాయింట్లు లాభంతో 78,285.07 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 159.50 పాయింట్లు పెరిగి 24,430.35 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,458.65-24,287.10 పాయింట్ల మధ్య



కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 16 లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.59 శాతం, ఎం అండ్ ఎం 2.02 శాతం, బీఈఎల్ 1.79 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.31 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.12 శాతం చొప్పున పెరిగాయి. కోటక్ బ్యాంక్ 3.89 శాతం, టీసీఎస్ 1.68 శాతం, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.3 శాతం మేర తగ్గాయి. రంగాల వారీ సూచీలకొస్తే స్థిరాస్తి 1.82 శాతం, మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంక్స్ క్వాలిటీ టిల్ట్ 1.4 శాతం, ప్రైవేట్ బ్యాంక్ 1.5 శాతం, టాప్ 10 బ్యాంక్స్ 1.24 శాతం, భారీ యంత్ర పరికరాలు 1.19 శాతం, వాహన 1.14 శాతం చొప్పున రాణించాయి. ఐటీ, యుటిలిటీస్, పీఎస్‌యూ బ్యాంక్, ఫోకస్డ్ ఐటీ, సేవల రంగాలు డీలాపడ్డాయి. కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 5 శాతం వరకు వాటాను మంగళవారం నుంచి మొదలయ్యే ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్) ద్వారా ప్రభుత్వం విక్రయించనుంది. ఇందుకు ఇష్యూ కనీస ధరను రూ.1400గా నిర్ణయించారు. రిటెయిల్‌యేతర మదుపర్లు 7న, రిటెయిల్ మదుపర్లు 8న బిడ్‌లు వేయొచ్చు. ఆన్‌లైన్ రిటెయిల్, సబ్‌స్క్రిప్షన్ ప్లాట్‌ఫామ్ రెంటోమోజో ఐపీఓకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి సోమవారం ఆమోదం లభించింది. ప్రతిపాదిత ఐపీఓలో రూ.150 కోట్ల విలువైన తాజా షేర్లను కంపెనీ జారీ చేయనుంది. అలాగే ఆఫర్ ఫర్ సేల్‌లో 2.84 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత వాటాదార్లు విక్రయించబోతున్నారు. లార్సన్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ (ఎల్‌పీఐఎల్) రూ.742 కోట్ల ఐపీఓ ఈ నెల 9న ప్రారంభమై 13న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.203-214. యాంకర్ మదుపర్లకు ఈ నెల 8న షేర్లు కేటాయించనుంది. తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.542 కోట్లు, ఓఎఫ్‌ఎస్ ద్వారా రూ.200 కోట్లు కంపెనీ సమీకరించనుంది. ఓఎఫ్‌ఎస్‌లో దీపక్ గోయల్, రాఖీ గోయల్, దేవేశ్ గోయల్ వరుసగా రూ.112.5 కోట్లు, రూ.25 కోట్లు, రూ.62.5 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. టెక్స్‌టైల్ తయారీ సంస్థ ఆస్థా స్పిన్‌టెక్స్ షేర్లు సోమవారం స్టాక్ మార్కెట్‌లో నమోదై మదుపర్లను నిరాశపరిచాయి. ఇష్యూ ధర రూ.136తో పోలిస్తే బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈల్లో 4.41% నష్టంతో రూ.130 వద్ద నమోదయ్యాయి. చివరకు 0.33 శాతం లాభంతో బీఎస్‌ఈలో 136.45 వద్ద ముగిశాయి.

## ఒక్క నెల.. 25 లక్షల వాహన విక్రయాలు

**జూన్ వాహనాల రిటెయిల్ విక్రయాల్లో 21.83 శాతం వృద్ధి: ఫాడా**

**దిల్లీ:** భారత్‌లో జూన్‌లో మొత్తం వాహనాల రిటెయిల్ విక్రయాలు 21.83 శాతం పెరిగి 25,57,234 వాహనాలుగా నమోదయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో 20,98,996 వాహనాలను కంపెనీలు విక్రయించాయని వాహన డీలర్ల సంఘాల సమాఖ్య (ఫాడా) తెలిపింది. కార్లు, వ్యాన్‌లు లాంటి ప్యాసింజర్ వాహనాల (పీవీలు) రిటెయిల్ విక్రయాలు 2025 జూన్‌లోని 3,19,412 వాహనాల నుంచి 28.63 శాతం పెరిగి 4,10,853 వాహనాలకు చేరాయి. ద్విచక్ర వాహనాల రిటెయిల్ అమ్మకాలు 21.22 శాతం పెరిగి 18,28,458 వాహనాలుగా నమోదయ్యాయి. గతేడాది జూన్‌లో ఈ సంఖ్య 15,08,378 వాహనాలుగా ఉంది. త్రిచక్ర వాహనాల అమ్మకాలు 1,04,035 వాహనాల నుంచి 16.2 శాతం పెరిగి 1,20,889 వాహనాలకు చేరాయి. వాణిజ్య వాహనాల అమ్మకాలు కూడా 16.88 శాతం పెరిగి 90,972 వాహనాలకు చేరాయి. 2025 జూన్‌లో ఈ వాహనాల అమ్మకాలు 77,836 వాహనాలుగా నమోదయ్యాయి. భారత్‌లో వాహనాల రిటెయిల్ విక్రయాల్లో జూన్ నెలపరంగా ఇప్పటివరకు ఇవే అత్యధికం. త్రిచక్ర, ద్విచక్ర, వాణిజ్య వాహనాలు, ప్యాసింజర్ వాహనాల విభాగాలన్నీ అత్యధిక జూన్ నెల అమ్మకాల గణాంకాలను నమోదు చేశాయని ఫాడా అధ్యక్షుడు సి ఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. జులై నెలలో 51.24 శాతం డీలర్లు అమ్మకాల్లో వృద్ధిని అంచనా వేస్తుండగా.. 41.79 శాతం డీలర్లు స్తబ్దుగా ఉండొచ్చని, 6.97 శాతం డీలర్లు అమ్మకాలు తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు.

## ఫ్రాన్స్ అధ్యక్షుడు ఉన్న హోటల్ వద్ద భారీ పేలుడు

**డమాస్కస్:** సిరియా రాజధాని డమాస్కస్‌లో వరుస పేలుళ్లు తీవ్ర కలకలం రేపాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆ దేశ పర్యటనలో ఉండగా.. ఆయన బస చేసిన హోటల్ వద్దే ఈ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. అయితే, ఈ ఘటనలో ఆయన క్షేమంగా బయటపడినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాతో సమావేశమయ్యేందుకు అధ్యక్ష భవనంలోకి మెక్రాన్ వెళ్లిన వెంటనే సమీపంలోని ఫోర్ సీజన్స్ హోటల్ వద్ద పేలుళ్లు సంభవించడం గమనార్హం. సుదీర్ఘ కాలంగా అంతర్యుద్ధంతో నలిగిపోయిన సిరియా.. ఇటీవల అక్కడ పాలకులు మారిన తర్వాత పునర్నిర్మాణంపై దృష్టి సారించింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు పయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే గతంలో పలు దేశాలు విధించిన అనేక ఆంక్షలను ఎత్తివేయడానికి పాశ్చాత్య దేశాలను ఒప్పించడంలో కీలక పాత్ర వహించిన మెక్రాన్.. అల్-షరా అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఆ దేశంలో కీలక పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతినిధుల బృందంతో కలిసి డమాస్కస్‌లోని ఫోర్ సీజన్స్ హోటల్‌లోనే బస చేశారు. మెక్రాన్ పర్యటన కొనసాగుతున్న సమయంలోనే.. హోటల్‌కు సమీపంలో రెండు పేలుళ్లు సంభవించాయి. చెత్తడబ్బాలో ఒకటి, పార్కింగ్ చేసిన కారులో మరో పేలుడు జరిగినట్లు సిరియా అధికారిక మీడియా తెలిపింది.

## 'ఇప్పుడు మా వ్యాపారం బాగోలేదు'

### 3200 మందికి ఎక్స్‌బాక్స్ లేఆఫ్‌లు

**న్యూఢిల్లీ:** దిగ్గజ కంపెనీల్లో ఈ ఏడాది కూడా కొనసాగుతోన్న లేఆఫ్‌లు ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా మైక్రోసాఫ్ట్‌కు చెందిన గేమింగ్ విభాగం 'ఎక్స్‌బాక్స్' 3200 మందికి ఉద్వాసన పలకనున్నట్లు ప్రకటించింది. సోమవారం ఒక్కరోజే వీరిలో 1600 మందిని తొలగించిన ఈ విభాగం.. 2026-27 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మిగతా లేఆఫ్‌లు పూర్తవుతాయని వెల్లడించింది. ఈ సందర్భంగా 'ఎక్స్‌బాక్స్ (సీఎనీలీ)' సీఈఓ ఆశా శర్మ.. ఉద్యోగులకు ఉద్వేగభరిత మెయిల్ చేశారు. ప్రస్తుతం తమ వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదని, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఈ క్లిష్టమైన నిర్ణయం (ఒజీఎనీటటబ) తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. "ఎక్స్‌బాక్స్ చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను మొదలుపెట్టాం. ఎన్నో సమీక్షల అనంతరం ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మా విభాగంలో ఉద్యోగుల సంఖ్యను 3200 మేర తగ్గించాలని నిర్ణయించుకున్నాం. ఇది చాలా బాధకరమైన విషయమని నాకు తెలుసు. కానీ, ప్రస్తుతం మేం ఎదుర్కొంటోన్న సవాళ్ల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. ఇప్పుడు మా వ్యాపారం బాగోలేదు. పోటీ సంస్థలతో పోలిస్తే 3-10రెట్లు తక్కువ మార్జిన్లు చూస్తున్నాం. ఇక, ప్రస్తుతం ఈ ఇండస్ట్రీ కూడా తీవ్రమైన హార్డ్‌వేర్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అందువల్ల ఎక్స్‌బాక్స్‌ను రీసెట్ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇందులో భాగంగానే మా విభాగాన్ని కూడా విభజిస్తున్నాం. నాలుగు స్టూడియోలు కొత్త యాజమాన్యం చేతుల్లోకి వెళ్తాయి. అయితే, ఈ ఉద్యోగుల కోతల నిర్ణయం టాలెంట్‌పై ఎలాంటి ప్రభావం చూపించబోదు" అని ఆశా శర్మ ఉద్యోగులకు ఇచ్చిన సందేశంలో వెల్లడించారు. తాజా నిర్ణయంతో ఎక్స్‌బాక్స్‌లో వచ్చే ఏడాది నాటికి ఉద్యోగుల సంఖ్య 20శాతం మేర తగ్గనుంది. ఇదిలా ఉండగా.. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో 4800 మందిని తొలగిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎక్స్‌బాక్స్ లేఆఫ్‌లు ఇందులో భాగమేనని సదరు విభాగ ప్రతినిధులు వెల్లడించారు. కేవలం వ్యయ నియంత్రణ చర్యగా కాకుండా.. మైక్రోసాఫ్ట్ పనిచేసే విధానంలో ఒక విస్తృత మార్పులో భాగంగానే ఈ ఉద్యోగ తొలగింపులను చేపడుతున్నట్లు ఆ సంస్థ చీఫ్ పీపుల్ ఆఫీసర్ అమీ కోల్‌మన్ తెలిపారు.




### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,34,500 | ₹ 1,46,730 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,60,000

# సెకండాఫ్‌లో ఐపీఓ అదుర్స్

- జులై- డిసెంబరులో రూ.4.7 లక్షల కోట్ల ఇష్యూలు
- కళ్లన్నీ ఎన్‌ఎస్‌ఈ, జియోపైనే




**న్యూఢిల్లీ:** దేశీయంగా స్టాక్‌మార్కెట్లు కాస్త కుదుట పడుతుండ టంతో, మళ్లీ తొలి పబ్లిక్ ఆఫర్(ఐపీఓ)ల సందడి కనిపిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో, దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టపోతున్నందున.. ప్రాథమిక మార్కెట్లోకి అడుగుపెట్టడానికి ఈ ఏడాది ఆరంభం నుంచి జంకిన కంపెనీలకు, ప్రస్తుత పరిస్థితులు ఆశావహంగా కనిపిస్తున్నాయి. అందువల్లే నిధుల సమీకరణ కోసం పబ్లిక్‌ఇష్యూకు వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది ద్వితీయార్ధం (జులై-డిసెంబరు)లో ఏకంగా 238 కంపెనీలు ఇష్యూకు రానున్నాయి. ఇవన్నీ కలిసి రూ.4.72 లక్షల కోట్ల వరకు సమీకరించనున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత అధిక మొత్తంలో ఐపీఓల ద్వారా నిధుల సమీకరణ ప్రతిపాదనలు కనిపిస్తోంది ఇపుడే. ఈ ఏడాది ప్రథమార్ధంలో ఐపీఓల సినిమా మోస్తరుగానే ఆడింది. అంతర్జాతీయ, దేశీయ అనిశ్చితులు ఎదురైనా, ఐపీఓలైతే కనిపించాయి. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ-50 జనవరి-జూన్ మధ్య 8.66%, బీఎస్‌ఈ సెన్సెక్స్ 10.25% కుంగినా కూడా 27 కంపెనీల వరకు ప్రాథమిక మార్కెట్లోకి వచ్చాయి. ఇవన్నీ కలిసి రూ.22,555 కోట్లు సమీకరించాయి. ఇందులో అత్యధికంగా క్లీన్ మాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ రూ.3,000 కోట్లకు పైగా సమీకరించగా, ఫ్రాక్టల్ అనలిటిక్స్, షాడోఫాక్స్ టెక్నాలజీస్, సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్, భారత్ కోకింగ్ కోల్ వంటివి రూ.1,000-2,800 కోట్ల వరకు నిధులు సమీకరించాయి. దేశీయ స్టాక్ మార్కెట్లో విదేశీ మదుపర్లు నికర విక్రేతలుగా ఉన్నా కూడా, దేశీయ మదుపర్లు తమ విశ్వాసాన్ని ప్రదర్శించడం వల్లే ఐపీఓలు ఫస్టాఫ్‌లోనూ ఫర్వాలేదనిపించాయి. ముఖ్యంగా మే, జూన్ నెలల్లో క్రమానుగత పెట్టుబడి పథకా (సిప్)ల్లోకి రూ.30,000 కోట్లకు పైగా నిధులు తరలివచ్చాయి. 2025 ఇదే సమయంలో పోలిస్తే ఇవి 16% ఎక్కువ. దీంతో కొత్త లిస్టింగ్‌లకు కంపెనీలు ధైర్యం చేసి ముందుకు వచ్చాయి. సూచీలు ఎలా చలిస్తున్నాయన్న దానితో సంబంధం లేకుండా, దేశీయ మదుపర్లు ఉత్సాహంగా ఉన్నారో లేదో గమనించుకుంటూ ఐపీఓలు రావడం విశేషం. 2026 ద్వితీయార్ధంలో ఐపీఓల సందడి మామూలుగా ఉండదు. రూ.4.72 లక్షల కోట్ల సమీకరించేందుకు 238 కంపెనీలు ప్రతిపాదనలు ఇచ్చాయి. ఇందులో 174 కంపెనీలు ఇప్పటికే సెబీ నుంచి అనుమతులు పొందాయి. ఇవన్నీ కలిసి రూ.2.77 లక్షల కోట్లు సమీకరించనున్నాయి. మరో 64 కంపెనీలు అనుమతుల కోసం వేచిచూస్తున్నాయి. రూ.1.95 లక్షల కోట్లు సమీకరించాలన్నది వీటి ప్రతిపాదన. సెకండరీ మార్కెట్లో సెంటిమెంటు మెరుగవుతుండడంతో, ఐపీఓల కార్యకలాపాలు పుంజుకున్నాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. విదేశీ మదుపర్లు(ఎఫ్‌ఐఐలు) కూడా తిరిగి పెట్టుబడులు పెడుతుండడం, ఆకర్షణీయ విలువలు, ప్రథమార్ధంలో పలు సంస్థలు విజయవంతంగా లిస్టింగ్ కావడం వంటివి మదుపర్ల విశ్వాసాన్ని పెంచుతున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓతో పాటు సెప్టెంబరులో వస్తుందని అంచనాలున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) ఇష్యూపై అధిక ఆసక్తి కనిపిస్తోంది.

## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు

పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. తాడిచర్ల -2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా' అని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాము లయ్యారని తెలిపారు.



## కైగా అణు విద్యుత్ ప్లాంట్‌లో మేఘా రికార్డు

- అతిపెద్ద కాంక్రీట్ పనులు పూర్తి

**హైదరాబాద్:** మౌలిక వసతుల సంస్థ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) అణు విద్యుత్ రంగంలో సరికొత్త మైలురాయిని అధిగమించింది. కర్ణాటకలోని కైగా అణు విద్యుత్ కేంద్రంలో చేపట్టిన యూనిట్ 5, 6 ప్రాజెక్టు పనుల్లో భాగంగా అత్యంత భారీ కాంక్రీట్ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. భారతీయ అణు విద్యుత్ నిగమ్ లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) చరిత్రలోనే ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్ విభాగంలో ఇంత పెద్ద ఎత్తున నిరంతరాయంగా కాంక్రీట్ పనులు చేపట్టడం ఇదే మొదటిసారని ఎంఈఐఎల్ వెల్లడించింది. అణు విద్యుత్ రంగంలో సంస్థ చేపట్టిన తొలి ప్రాజెక్టు ఇది. అత్యంత కఠినమైన ప్రమాణాలతో కూడిన అణు విద్యుత్ రంగ మౌలిక వసతుల నిర్మాణంలో తొలి ప్రయత్నంలోనే ఇంత భారీ కాంక్రీట్ పనులను నిరంతరాయంగా పూర్తి చేయడం కంపెనీ ఇంజినీరింగ్ సామర్థ్యం, ప్రణాళిక, పనితీరుకు నిదర్శనమని ఎంఈఐఎల్ పేర్కొంది.


## ఆగస్టు 1 నుంచి ఓపెన్ మార్కెట్ బైబ్యాక్

**ముంబై:** స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ఓపెన్ మార్కెట్ బైబ్యాక్ ప్రక్రియను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పునరుద్ధరించింది. సవరించిన మార్పులతో ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఇకపై ఆఫర్ ప్రారంభమైన రోజు నుంచి 66 పనిదినాల్లోపే కంపెనీ బైబ్యాక్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎలాంటి బైబ్యాక్ విండో లేకుండానే రెగ్యులర్ ట్రేడింగ్‌లో షేర్లను తిరిగి కొనుగోలు చేయొచ్చు. క్యాపిటల్ మార్కెట్ల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు సెబీ ఈ చర్యలను చేపట్టినట్లు తెలుస్తోంది. 2025లో ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లను సెబీ గతంలో నిలిపివేసింది. ప్రస్తుతం బైబ్యాక్ ప్రక్రియలో కంపెనీ నిర్దేశిత ధర వద్ద, తమ వాటాదార్ల నుంచి షేర్లను తిరిగి కొనుగోలు చేస్తుంటుంది. కానీ ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లో స్టాక్ ఎక్స్ఛేంజీలో ఆ రోజు ఉన్న ధర వద్ద షేర్లను కంపెనీ తిరిగి కొనుగోలు చేస్తుంది. గతంలో ఈ గడువు 6 నెలలుగా ఉండగా.. ఇప్పుడు 66 పని దినాల్లోపే ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లను పూర్తి చేయడం తప్పనిసరి చేసింది. ఆఫర్ కాలంలోని మొదటి అర్ధభాగంలోనే బైబ్యాక్‌కు కేటాయించిన నిధుల్లో కనీసం 40 శాతం నిధులను కంపెనీ ఉపయోగించాల్సి ఉంటుంది. గతంలో కంపెనీలపై పడే పన్ను భారాన్ని ఇకపై వాటాదార్లపైకి మార్చారు. దీని వల్ల ఓపెన్ మార్కెట్‌లో షేర్లు అమ్మినా లేదా బైబ్యాక్‌లో టెండర్ చేసినా పన్ను ఒకేలా ఉంటుంది. ఈ సమాచారాన్ని ఈమెయిల్/ఎస్సెమ్మెస్ ద్వారా మదుపర్లకు తెలియజేయాలి. బైబ్యాక్ ప్రతిపాదనల కోసం కచ్చితంగా మర్చంట్ బ్యాంకర్‌ను నియమించాలనే నిబంధననూ సెబీ తొలగించింది. దీనివల్ల కంపెనీలకు అదనపు ఖర్చులు తగ్గనున్నాయి.

## చిన్నారుల కోసం 'ట్రంప్ అకౌంట్స్'

**వాల్‌స్ట్రీట్ ప్రారంభ గంట మోగించిన ట్రంప్**

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోని ఓవల్ ఆఫీసు నుంచి న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌వైఎస్‌ఈ), నాస్‌డాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సోమవారం నాటి ట్రేడింగ్ ప్రారంభ గంటను మోగించారు. స్టాక్ మార్కెట్ వృద్ధికి తన ఆర్థిక విధానాలే కారణమని చూపించే ప్రయత్నం చేశారు. నవంబరు మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో అమెరికన్లు 401(కే) పెట్టుబడులపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే పిల్లల కోసం స్టాక్ ఇండెక్స్ పెట్టుబడులను ప్రోత్సహించే 'ట్రంప్ అకౌంట్స్' పథకాన్నీ ప్రారంభించారు. ద్రవ్యోల్బణం పెరగడం ప్రజాదరణపై ప్రభావం చూపుతున్నప్పటికీ, భవిష్యత్ తరాలకు పెట్టుబడి సంస్కృతిని పెంపొందించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ట్రంప్ పేర్కొన్నారు.



## ఇండోనేసియా చేతికి మన 'బ్రహ్మోస్త్రం'..

సమర్థతను చూసి వీటి కొనుగోలుకు జకార్తా ఆసక్తి చూపించింది. కీలక ఖనిజాల సరఫరా గొలుసును మరింత బలోపేతం చేసేలా.. ఇండోనేసియాలోని స్టీల్, నికెల్, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ తయారీలో భారత్ పెట్టుబడులు పెట్టనుంది. ఇండోనేసియాలోని సబాంగ్ పోర్ట్‌ను సంయుక్తంగా నిర్మించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. మలక్కా జలసంధికి సమీపంలో ఉండే ఈ పోర్ట్.. భారత్‌కు వ్యూహాత్మకంగా కీలకమైనది. ఇండోనేసియా అవసరాల కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తయారీకి భారత్ సాంకేతిక సాయం అందించేందుకు అంగీకరించింది.

**మోదీకి అత్యున్నత పురస్కారం..**

ఇదిలా ఉండగా.. తమ దేశానికి విచ్చేసిన ప్రధాని మోదీని ఇండోనేసియా ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించింది. 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా' పురస్కారంతో గౌరవించింది.. ఆ దేశాధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో.. ఈ మెడల్‌ను మోదీకి అందజేశారు.

## అంతరిక్ష వ్యర్థాల కోసం 'మిషన్ ఎంబ్రేస్'

### సిద్ధం చేసిన కాస్మోసర్వ్ స్పేస్ మిషన్ ఎంబ్రేస్

**హైదరాబాద్:** అంతరిక్ష వ్యర్థాలను తొలగిం చేందుకు హైదరాబాద్ అంకురం కాస్మోసర్వ్ స్పేస్ సరికొత్త సాంకేతికతను సిద్ధం చేసింది. 'మిషన్ ఎంబ్రేస్' పేరుతో నింగిలో రోబోటిక్ పద్ధతిలో ఉపగ్రహాలను పట్టుకునే (సాఫ్ట్ రోబోటిక్ క్యాప్చర్) ప్రయోగాన్ని నిర్వహించనుంది. స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన విక్రమ్-1 రాకెట్ తొలి కక్ష్య ప్రయోగం 'మిషన్ ఆగమన్' ద్వారా జులై 12 - ఆగస్టు 4 మధ్య ఈ పేలోడ్ నింగికి చేరనుంది. భూకక్ష్యలో పేరుకుపోతున్న వేలాది నిరుపయోగ ఉపగ్రహాలు, వ్యర్థాల వల్ల భవిష్యత్తు ప్రయోగాలకు ముప్పు పొంచి ఉంది. దీనికి పరిష్కారంగా కాస్మోసర్వ్ రెండు వ్యోమనౌకల వ్యవస్థను రూపొందిస్తోంది. ఇది ప్రస్తుత మార్కెట్ ధరకంటే పదోవంతు తక్కువ ఖర్చుతోనే వ్యర్థాలను సురక్షితంగా తొలగిస్తుంది. నియంత్రణ కోల్పోయి, అస్తవ్యస్తంగా తిరిగే ఉపగ్రహాలను సున్నితంగా పట్టుకునేలా ఈ సాఫ్ట్ రోబోటిక్ సాంకేతికతను రూపొందించారు. కేవలం నాలుగు నెలల స్వల్ప వ్యవధిలోనే ఈ ప్రయోగాత్మక పరికరాన్ని సిద్ధం చేసినట్లు సంస్థ సీఈఓ చిరంజీవి ఫణీంద్ర తెలిపారు. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలతో కూడిన స్వతంత్ర కమిటీ పర్యవేక్షణలో అన్ని పరీక్షలనూ పూర్తి చేసినట్లు వెల్లడించారు. 'భారత తొలి ప్రైవేట్ ఆర్బిట్ ఉపగ్రహ ప్రయోగంలో భాగంగా మా మిషన్ ఎంబ్రేస్ ప్రయాణించనుంది. స్కైరూట్ భాగస్వామ్యంతో చేపడుతున్న ఈ ప్రయోగం, దేశీయ ప్రైవేట్ అంతరిక్ష సంస్థలు పరస్పర సహకారంతో సరికొత్త ఆవిష్కరణలు చేయగలవని నిరూపిస్తోంది. అంతరిక్ష కక్ష్యల స్థిరత్వానికి, అంతరిక్ష వ్యర్థాల తొలగింపు విషయంలో ఇది అత్యంత కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది' అని విశ్వాసం వ్యక్తం చేశారు.



జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
8 జూలై 2026



# జీతం చేతికొచ్చేలోపే... జేబు ఖాళీ

## రోజురోజుకీ పెరుగుతున్న ఖర్చులు.. తగ్గని ఆర్థిక ఒత్తిడి

- పొదుపు మాటే మరచిపోయిన కుటుంబాలు
- ఈఎంఐలు, రుణాలతో సతమతం
- అత్యవసరానికి లోన్లు.. వడ్డీలతో అప్పుల ఊబిలో మధ్యతరగతి

**కరీంనగర్ టౌన్, జూలై 7, (జనం సాక్షి) :** రోజు రోజుకు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నకానీ, మధ్యతరగతి కుటుంబాల ఆదాయం పెరగడం లేదు. నెలవారీ ఖర్చులతో కరీంనగర్ జిల్లాలో మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

మధ్యతరగతి కుటుంబాలలో చాలీచాలని జీతంతో ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక వ్యాపార వాణిజ్య సంస్థలు పొట్టకూటి కోసం పనిచేస్తుంటారు అక్కడ వారి యజమాన్యం ఇచ్చే జీతం సరిపోక నానాయాత్ర పడుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. నెల జీతం చేతికి వచ్చిన వారం రోజుల్లో ఇంటి అద్దె, పిల్లల చదువు, వైద్యం రవాణా వంటి అవసరాలకే ఉన్న డబ్బు ఉష్ కాకి అవుతుంది. పొదుపు అనే మాట చాలా కుటుంబాలకు అందని ద్రాక్షగా మారూతుంది. కుటుంబంలో ఎవరైన అనారోగ్యం పాలైతే ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వారు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

**నెలవారీ ఖర్చులే భారంగా...**

ఒక వ్యక్తికి నెలకు సుమారు రూ 22 వేల ఆదాయం ఉన్న కుటుంబంలో ఖర్చులు ఇలా ఉన్నాయి. ఇంటి అద్దె రూ 5 వేలు, కిరాణా సామాను రూ3 వేలు, పిల్లల స్కూల్ ఫీజు రూ3 వేలు, వైద్య ఖర్చులు రూ3 వేలు, బైక్ ఈఎంఐ రూ2 వేలు, కరెంట్ బిల్లు రూ1500, ప్రయాణ ఖర్చులు రూ3 వేలు, గ్యాస్ సిలిండర్ రూ1,100, పాలు రూ వేయి, మొబైల్ రీఛార్జ్‌లు రూ వేయి, మొత్తం కనీస నెలవారీ ఖర్చు : సుమారు రూ 23,600 ఖర్చవుతున్నాయి. అతని నెల ఆదాయం కంటే ఖర్చులే ఎక్కువగా ఉండటంతో పొదుపు చేసే అవకాశం లేకుండా పోతోంది. దీనికి తోడు పండుగలు, పిల్లల పుస్తకాలు, దుస్తులు,ఇంటి మరమ్మతులు, వృద్ధుల వైద్య ఖర్చులు వంటి అదనపు అవసరాలు వస్తే కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత కష్టాల్లో పడుతోంది.

**అత్యవసర పరిస్థితుల్లో అప్పులే శరణ్యం**

అతని ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువ ఉన్న క్రమంలో ఆ కుటుంబ యజమాని డబ్బులు పొదుపు చేయలేని పరిస్థితి ఏర్పడుతున్న క్రమంలో అనివార్య కారణాలతో అనారోగ్యం, ప్రమాదం లేదా ఇతర అత్యవసర అవసరాల కోసం చాలామంది క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, లోన్ యాప్‌ల ద్వారా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పు తీర్చాల్సిన సమయం వస్తున్న క్రమంలో మరో చోట అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ యజమానికి అప్పుతోపాటు వడ్డీలు పెను భారం కావడంతో అప్పుల ఉబిలో చిక్కుకుంటున్నారు. ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులు ఆలస్యమైతే రికవరీ ఏజెంట్ల నుంచి తరచూ ఫోన్ కాల్స్, బంధువులకు సమాచారం ఇస్తామంటూ హెచ్చరికలు, ఇంటి వద్దకు వచ్చి పరువు తీసేలా ప్రవర్తించడం వంటి ఘటనలు బాధితుల్లో తీవ్ర మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్‌లోని జ్యోతి నగర్‌కు చెందిన సురేష్ గత 15 ఏళ్లుగా పంచర్ షాప్ నిర్వహిస్తున్నాడు. అయితే ఇప్పటికీ చాలీచాలని పనులే వస్తుండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశాడు. షాపు అద్దెతో పాటు పెరుగుతున్న ఖర్చుల కారణంగా జీవనం సాగించడం కష్టంగా మారిందని తెలిపాడు. ప్రస్తుతం చిన్న వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పరిస్థితి నెలకొంది.



### అధిక ధరలను నియంత్రించాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**



నిత్యవసర వస్తువుల ధరల నుండి మొదలుకొని ప్రతిదీ సామాన్యుడు కొనలేని పరిస్థితి దాపురించింది. పెట్రోల్, గ్యాస్, ఇంటి కిరాయిలు, నిత్యవసర వస్తువుల బారాలు రెట్టింపు అయ్యాయి. దరల పెరుగుదలకు తగ్గట్టుగా వేతనాల పెరుగుదల లేదు. జీవన ప్రమాణాలు పెరగలేదు. ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ప్రకారం 14 రకాల వస్తువులను తెల్ల రేషన్ కార్డుపై అందించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ధరలను నియంత్రించాలి.



# గన్‌మెన్‌లు వద్దు... ప్రజలే నా భద్రత

## ప్రజల ప్రేమాభిమానాలే శ్రీరామరక్ష

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి గన్‌మెన్‌లను వెనక్కి
- 'ప్రజల విశ్వాసమే అతి పెద్ద రక్షణ'
- సోషల్ మీడియాలో ప్రశంసల వెల్లువ



**ఉప్పల్, జూలై 7 (జనం సాక్షి):** ప్రజలే తనకు అసలైన బలం, ప్రజల విశ్వాసమే అతి పెద్ద భద్రత అని చాటుతూ ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌లను మరోసారి వెనక్కి పంపించారు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ప్రజల ప్రేమాభిమానాలే తనకు శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమవడంతో పాటు సోషల్ మీడియాలో ప్రశంసల వెల్లువెత్తుతోంది. ప్రజాప్రతినిధిగా ప్రజల మధ్యే ఉండటం, వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడమే తన ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భద్రతా వలయాల కంటే ప్రజలతో మమేకమై సాధారణ వ్యక్తిలా వారి మధ్య తిరుగుతూ సేవ చేయడానికే తాను ప్రాధాన్యత ఇస్తానని వ్యాఖ్యానించారు. ప్రజల నమ్మకం ఉన్న చోట ఎలాంటి భయం ఉండదని, ప్రజల ఆశీస్సులే తనకు రక్షణ కవచమని ఆయన అభిప్రాయపడ్డారు.

"ప్రజల విశ్వాసం కంటే గొప్ప రక్షణ మరొకటి లేదు. ప్రజలే నా బలం... ప్రజలే నా భద్రత" అనే భావనతో ప్రభుత్వం కల్పించిన అదనపు భద్రతను మర్యాదపూర్వకంగా తిరస్కరించడం ద్వారా ప్రజలతో తన అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా పేరు తెచ్చుకున్న బండారి లక్ష్మారెడ్డి, నియోజకవర్గంలో ఎలాంటి ఆర్భాటాలు లేకుండా నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలు తెలుసుకొని అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం కోసం కృషి చేయడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ నిర్ణయం ఆయన నిరాడంబరతకు, ప్రజలపై ఉన్న అపార విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని పార్టీ నాయకులు, కార్యకర్తలు కొనియాడుతున్నారు. సోషల్ మీడియాలో ఎమ్మెల్యే నిర్ణయంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. "గ్రేట్ ఎమ్మెల్యే", "ప్రజల మనిషి", "ప్రజల కోసం జీవించే నాయకుడు", "ఇలాంటి నాయకులే రాజకీయాలకు ఆదర్శం" అంటూ నెటిజన్లు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తున్నారు. ప్రజలే తనకు అసలైన రక్షకులనే విశ్వాసంతో గన్‌మెన్‌లను వెనక్కి పంపిన ఈ నిర్ణయం ప్రజాసేవ పట్ల ఆయన నిబద్ధతను మరోసారి నిరూపించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# మహిళలు అన్ని అంశాలపై విజ్ఞానవంతులుగా ఎదగాలి

హక్కుల కోసం పోరాడాలి : ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి

**ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 3 రోజుల రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం**



**హైదరాబాద్, జూలై 7 (జనం సాక్షి):** మహిళా నాయకత్వం మరింత బలోపేతం కావాలంటే అన్ని అంశాలపై అవగాహన, సిద్ధాంతపరమైన అధ్యయనం అవసరమని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి అన్నారు. ఈ మేరకు మంగళవారం బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన మూడు రోజుల రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జూలై 7, 8, 9 తేదీల్లో జరిగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గెటి సరళ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి,రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గెటి సరళ మాట్లాడారు. మహిళలకు సంబంధించిన సమస్యలు, 33 శాతం మహిళా రిజర్వేషన్లు సహా వివిధ అంశాలపై స్పష్టమైన అవగాహనతో పనిచేయాలని సూచించారు. జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఐద్వా తీసుకున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మహిళలను చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల శిక్షణ తరగతులకు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రధాన బోధకురాలిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర కోశాధికారి ఎం. భారతి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కె.ఎన్. ఆశాలత, బుగ్గెటి సరళ, పి. ప్రభావతి, కె. నాగలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి పద్మ, ఎన్. రత్నమాల, పి. శశికళ, ఎం. వినోద, బి. అనూరాధ, వై. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 29 జిల్లాల నుంచి ఐద్వా కార్యకర్తలు ఈ శిక్షణా శిబిరానికి హాజరయ్యారు.

### జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, జూలై 7 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాప్రా మండలం, డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ కాలనీలోని సర్వే నంబర్లు 461 నుంచి 469 వరకు ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్లాట్ యజమానుల సమస్యను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరి, కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 1979లో హుడా ఆమోదం పొందిన డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ లేఅవుట్‌లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో నిలిచిపోవడంతో వందలాది మంది ప్లాట్ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

# భూ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**

**ధారూర్, జూలై 7(జనంసాక్షి) :** భూసమస్యల పరిష్కారానికి భూ సర్వే ప్రక్రియ ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేసి,భూభారతి--భూ సర్వేపై నిర్వహించిన అవగాహన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలతో పాటు భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు.భూ సర్వే పూర్తయితే భూతగాదాలు గణనీయంగా తగ్గుతాయని, గ్రామాల్లోని వ్యవసాయ భూములు,గ్రామకంఠం, ఇంటి స్థలాలకు సరిహద్దులు ఖరారు చేయనున్నట్లు తెలిపారు.రైతులు పండించిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవసరమైన గోదాముల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.రైతుబంధుతో పాటు వ్యవసాయ యంత్రాలు,ఎరువులకు సబ్సిడీ అందిస్తున్నట్లు కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రూ.90 కోట్లు మంజూరు చేయగా,ఇప్పటికే రూ.60 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు.అలాగే సర్పన్‌పల్లి ప్రాజెక్టుకు రూ.30 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు.వికారాబాద్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి పంచాయతీరాజ్ రోడ్ల కోసం రూ.300 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్ల కోసం రూ.450 కోట్లు మంజూరు చేసినట్లు శాసనసభాపతి తెలిపారు.అనంతరం మోమిన్ కుర్దు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి,లబ్ధిదారులైన దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటాచారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మధుసూదన్,తహసీల్దార్ సాజిదా బేగం, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు అంజలయ్య, నీరటి లక్ష్మి పాల్గొన్నారు.



# వెంకటయ్య పేరుతో బాలయ్య

- చనిపోయిన బాలయ్య పేరుతో నకిలీ ఆధార్..
- నకిలీ ఆధార్ కార్డు సృష్టించి డిజిటల్ సిగ్నేచర్ మోసం
- భూదాన్ పట్టా భూమిని కాజేసేందుకు వెంకటయ్య ప్రయత్నం
- తహశీల్దార్ పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు
- నకిలీ ఆధార్ కార్డును తొలగించాం



తెలంగాణ ప్రభుత్వం
నమూనా XIV
(నియమము 26 చూడండి)
పట్టాదారు పాసు పుస్తకం
భూమి యాజమాన్య హక్కు పత్రం
జిల్లా : రంగా రెడ్డి
మండలం : కేశంపేట
పాస్ బుక్ నెంబర్ : T05120190998
డివిజన్ : షాద్ నగర్
గ్రామం : తొమ్మిదిరేకుల
బార్ కోడ్:
కోడ్:
SPECIMEN COPY

**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (జనంసాక్షి):** కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామ శివారులోని భూదాన్ పట్టా భూమిని కాజేయాలనే ఉద్దేశ్యంతో చనిపోయిన బాలయ్య పేరుతో నకిలీ ఆధార్ కార్డు సృష్టించి మోసానికి పాల్పడిన ఘటన సంచలనం సృష్టించింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన చిన్న వెంకటయ్య అనే వ్యక్తి ఈ మోసానికి పాల్పడినట్లు తేలింది.

సర్వే నంబర్ 34/రూ.లో ఉన్న ఒక ఎకరం భూమిని అక్రమంగా కాజేసేందుకు చనిపోయిన బాలయ్య పేరుతో నకిలీ ఆధార్ కార్డు తయారు చేసి డిజిటల్ సిగ్నేచర్ (డీఎస్) ద్వారా మీసేవ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలిసిన కేశంపేట మండల తహశీల్దార్ టి.రాజేందర్ రెడ్డి లిఖితపూర్వకంగా కేశంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ ఆధార్ కార్డును తొలగించేశామని తహశీల్దార్ టి.రాజేందర్ రెడ్డి తెలిపారు. చనిపోయిన బాలయ్య పేరు మీదనే భూమి వర్జినల్ పట్టాదారుడిగా ఉందని, ఇప్పటి వరకు ఎక్కడ ఎలాంటి క్రయవిక్రయాలు జరగలేదని స్పష్టం చేశారు. ఈ మోసం భూమి సంబంధిత పత్రాలను తప్పుదోవ పట్టించేందుకు చేసిన ప్రయత్నమని అధికారులు అంటున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. భూముల సంబంధిత మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు మరింత జాగ్రత్తగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు ఈ కేసులో మరిన్ని విషయాలను వెల్లడించే అవకాశం ఉంది.

# దేవునికి నైవేద్యం లేదు భూమికి వేలం లేదు

- దేవుని భూములను వెంటనే వేలం వేయాలి : ఎత్తం కృష్ణయ్య
- సంవత్సరాలనుండి ఒకే కుటుంబం సాగు చేస్తున్న పట్టించుకోని అధికారులు
- ఎండోమెంట్ అధికారికి వినతి పత్రం ఇచ్చిన గ్రామస్తులు

**వీపనగండ్ల జులై 8 (జనం సాక్షి) :**

వీపనగండ్ల మండలంలో శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం 30ఎకరాల భూమి ఉన్న స్వామివారికి ధూప దీప నైవేద్యం నోచుకోవడం లేదు అని భూమిని ఒకే కుటుంబానికి చెందినవారు దాదాపు చాలా సంవత్సరాల నుండి సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న గుడికి ఒక రూపాయి కూడా ఇవ్వడం లేదు అని జిల్లా ఎండోమెంట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎత్తం కృష్ణయ్య మాట్లాడుతూ ఒకే కుటుంబం చాలా సంవత్సరాల నుండి దేవుని మాన్యం సాగు చేయడం వలన గుడికి ఆదాయం లేకపోవడంతో స్వామివారు గుడి తలుపులు మూతపడే పరిస్థితి ఏర్పడింది అన్నారు. శ్రీచెన్నకేశవ స్వామి కి ధూప దీప నైవేద్యం లేని పరిస్థితి ఏర్పడింది అని అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని ఉన్నట్లు దేవునికి భూములు ఉన్న ఆదాయం లేకపోవడంతో దేవుడికి దీపం పెట్టే దిక్కు లేదని అన్నారు. గత కొంతకాలంగా కొందరు ఉన్నత వర్గానికి చెందినవారు దేవుని భూమికి వేలం వెయ్యకుండా రాజకీయ పలుకుబడితో అడ్డుకుంటున్నారు అని విమర్శించారు.

అక్రమంగా సాగు చేసుకుంటున్న వ్యక్తులు మాకు ఎండోమెంట్ అధికారుల నుంచి మాకు బలం ఉంది మమ్మల్ని గ్రామస్తులు ఏమి చేయలేరు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అన్నారు. గ్రామ ప్రజలు అందరూ ఒక్కటై ఉద్యమించక ముందే జిల్లా ఎండోమెంట్ అధికారులు భూమికి వేలంపాట వేయాలని సలహా ఇచ్చారు. ప్రస్తుతం దేవుని మాన్యాన్ని సాగు చేస్తున్న వ్యక్తులు అర్హులు కారని 2008 సంవత్సరంలో కోర్టు తీర్పు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కోర్టు తీర్పు ప్రకారం బహిరంగ వేలం పాట వేయడం జరిగింది అన్నారు.మళ్లీ ఇప్పుడు ఎండోమెంట్ అధికారులు బహిరంగ వేలంపాట వేయకుండా గ్రామ ప్రజలు ఎస్సీ బీసీ మైనార్టీ వాళ్ళు ఐదు లక్షలు ఇస్తామంటే దేవుని మన్యం భూమి వేలం వేయకుండా ఉన్నత వర్గానికి చెందిన వారికే మీరే చేసుకోండి అని కమిషనర్ చెప్పడం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు.గ్రామ ప్రజలు గతంలో ఎండోమెంట్ అధికారులకు కార్యాలయం ముందు ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందించారు. భూములకు వేలంపాట నిర్వహించకపోతే లేనియెడల కలెక్టర్ కార్యాలయం ముందు హైదరాబాదులోనీ కమిషనర్ రైట్ ప్రజాభవన్ లో ధర్నా చేయడం జరుగుతుంది అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎత్తం కృష్ణయ్య, ఆంజనేయులు, ముత్యాలు, చిన్ని కృష్ణ.గడ్డల రాముడు, దయ్యపు రాజు, ఎత్తం విష్ణు, నక్క నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# జూలై 26లోపు పీఆర్సీ కమిషన్ నియమించాలి

- లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం
- ఎస్‌జీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



**ముషీరాబాద్, జూలై 7 (జనం సాక్షి):**

జూలై 26 లోపు ప్రభుత్వం పీఆర్సీ కమిషన్‌ను నియమించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఎస్‌జీపీఏ హైదరాబాద్ యూనిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, కన్వీనర్ సీహెచ్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ లోని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యూనిట్ అవసరమని తెలిపారు. పెన్షనర్లకు ప్రస్తుతం లభిస్తున్న హక్కులు, సౌకర్యాలు దశాబ్దాలుగా సంఘాలు సాగించిన ఉద్యమాలు, చర్చలు, న్యాయపోరాటాల ఫలితమేనని పేర్కొన్నారు. పెన్షనర్లందరూ సంఘంలో సభ్యత్వం తీసుకుని సంఘ బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నూతన కమిటీ సభ్యులు ఎం. అంజి ప్రసాద్ రావు, కె. వసంతరావు, శ్రీనివాసరావు, బాపూజీ, కిషోర్, ఏ.వి. అనిల్‌కుమార్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ స్మార్ట్ సిటీకి రూ.70 కోట్లు

- నూతన అభివృద్ధి అధ్యాయం
- ప్రజల చిరకాల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు
- వరదలు, ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తీరనున్నాయి
- బండి సంజయ్‌కు మేయర్ కృతజ్ఞతలు
- సుడా నిధులతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



కరీంనగర్, జులై 7 (జనంసాక్షి): కరీంనగర్ నగరాన్ని ఆధునిక, సుందర, సుస్థిర నగరంగా తీర్చిదిద్దేందుకు స్మార్ట్ సిటీ ప్రత్యేక నిధుల కింద రూ.70 కోట్లతో పలు ప్రతిష్ఠాత్మక అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ నిధుల మంజూరుకు కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు నగర ప్రజల తరఫున, నగరపాలక సంస్థ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతాయని వ్యక్తం చేశారు.

నగరంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న వరదలు, ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ కొరత, విద్యుత్ వ్యయం, రహదారులు, ప్రజా మౌలిక వసతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఈ ప్రాజెక్టులు రూపొందించామని మేయర్ తెలిపారు. ఇప్పటికే అన్ని పనులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టులు సిద్ధమవుతున్నాయని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులను వేగంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

చేపట్టనున్న ప్రధాన పనులు: రామ్‌నగర్, ఆర్టీసీ వర్క్‌షాప్, మంచిర్యాల చౌరస్తా వరద నివారణకు ఆధునిక హైడ్రాలిక్ డ్రైనేజీ వ్యవస్థ (రూ.21.50 కోట్లు), టవర్ సర్కిల్‌లో మల్టీ లెవెల్ హైడ్రాలిక్ పార్కింగ్ నిర్మాణం (రూ.25 కోట్లు), మున్సిపల్ భవనాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు (రూ.2 కోట్లు), సదాశివపల్లి జంక్షన్ ఆధునీకరణ (రూ.3 కోట్లు), ఎకో-ఫ్రెండ్లీ స్పాంజ్ పార్క్ అభివృద్ధి (రూ.3 కోట్లు), వల్లంపాహడ్ మోడల్ వైకుంఠధామం (రూ.2.50 కోట్లు), అల్కాపురి కాలనీలో సీసీ రోడ్లు (రూ.1 కోటి), యానిమల్ బర్త్ కంట్రోల్, జంతు సంక్షేమ కేంద్రం (రూ.2 కోట్లు), కేఆర్ కాలనీ నుంచి వల్లంపాహడ్ బ్రిడ్జి వరకు సెంట్రల్ లైటింగ్ (రూ.2 కోట్లు), సర్వేలు, డిజైన్లు, డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ సేవలు (రూ.1.50 కోట్లు) వంటి పనులు చేపట్టనున్నారు.

ప్రజల అవసరాలే ప్రాధాన్యత అని, నాణ్యతలో రాజీలేకుండా, పూర్తి పారదర్శకతతో, నిర్ణీత గడువులో ఈ పనులను పూర్తి చేసి కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు తీసుకొచ్చి పనులు వేగవంతం చేస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా 25వ డివిజన్ బుట్టిరాజారాం కాలనీలో సుడా నిధులు రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లు శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ గంట శ్రీనివాస్ ప్రతిపాదనల మేరకు ఈ పనులు చేపట్టామని సుడా చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంట కల్యాణి, దండి రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అరకిలో గంజాయి స్వాధీనం

## యువకుడు అరెస్ట్.. యన్ డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు



**కరీంనగర్ రూరల్, జూలై 7, (జనం సాక్షి) :** కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో అర కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని ఓ యువకుడిని అరెస్ట్ చేశారు. నిందితుడిపై చీఖూా చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం, మంగళ వారం ఉదయం తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ సమీపం లో కరీంనగర్ రూరల్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి పోలీసులను గమనించి అనుమానా స్పదంగా అక్కడి నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్త మైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద ఉన్న కవరులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు.విచారణలో నిందితుడు తన పేరు బట్టి శివ (23) అని, సరస్వతి నగర్, తీగలగుట్టపల్లి నివాసి అని తెలిపాడు. జమోటా పని చేస్తూ జీవనం సాగిస్తున్న తాను కొంతకాలంగా గంజాయి, మద్యం సేవనానికి అలవాటు పడ్డానని, అధిక డబ్బు సంపాదిం చాలనే ఉద్దేశంతో మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి సుమారు అర కిలో గంజాయిని కొనుగోలు చేసి కరీంనగర్‌కు తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నాడు.ఆ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఒక్కో ప్యాకెట్‌ను రూ.500 చొప్పున విక్రయి స్తూ సుమారు రూ.10 వేల వరకు సంపాదించినట్లు తెలిపాడు. మిగిలిన గంజాయిని చొప్పదండి, నగునూరు ప్రాంతాల్లో లారీ డ్రైవర్లు, ఇతరులకు విక్రయించడంతో పాటు తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో కూడా విక్రయించేందుకు వచ్చిన సమయంలో పోలీసులకు చిక్కినట్లు అంగీకరించాడు.అనంతరం ఇద్దరు పంచుల సమక్షంలో నిందితుడి వద్ద లభ్యమైన గంజాయిని స్వాధీ నం చేసుకుని చట్టపరమైన పంచనామా నిర్వహించారు. అనంతరం నిందితుడిపై యన్ డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవించడం, విక్రయించడం లేదా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకురావడం వంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రేమ ఉంటే బొగ్గు బ్లాక్‌లను ఇప్పించండి

## కేంద్రమంత్రికి టీబీజీకేఎస్ అధ్యక్షులు రాజిరెడ్డి డిమాండ్



**గోదావరిఖని, జనంసాక్షి:** సింగరేణి సంస్థ పట్ల ప్రేమ, కార్మికుల ఎడల గౌరవం ఉంటే వేలంపాటలో పాల్గొనకుండా కొత్త బొగ్గు బ్లాకులను కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి ఇప్పించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి నిర్వహించిన సమావేశం వల్ల జరిగిన ప్రయోజనం శూన్యమని అన్నారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను కాపాడడానికేనని ఆయన ఆరోపించారు. సింగరేణిలో జరిగిన బొగ్గు కుంభకోణం పైన, డీజిల్, పేలుడు పదార్థాల కొనుగోలు, ఓవర్ బర్డన్ తొలగింపు టెండర్లలో అవినీతి, సోలార్ ప్లాంట్ ఏర్పాటులో జరిగిన అక్రమాలపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బొగ్గు నిల్వల పైన సింగరేణి యాజమాన్యం విజిలెన్స్ విచారణ జరపాలని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. దొంగకే తాళం చేతులు ఇవ్వడం, సింగరేణి విచారణ జరపడం రెండు ఒకటేనని అన్నారు. కోల్ ఇండియాలో కార్మికులకు ఇస్తున్న విధంగా 12,500 రూపాయల విలువైన బట్టలు సింగరేణిలో ఇప్పిస్తున్నారా అని ప్రశ్నించారు. సింగరేణి సమీక్షా సమావేశం సందర్భంగా బిజెపి, బిఎంఎస్ నాయకులతో వినతి పత్రాలు తీసుకొని చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. గోలేటి, మాదారం, కేకే ఓసి మందమర్రి,, జెకె 5 విస్తరణ ఇల్లందు మణుగూరు ఓపెన్ కాస్ట్ గనుల అనుమతులను ఇప్పించి మీ నిజాయితీ నిరూపించుకోవాలని కేంద్ర మంత్రిని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన 58 వేలకోట్ల రూపాయల బకాయిలను తక్షణమే ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు సైట్ విజిట్ సర్టిఫికెట్ ఉండాలని ఏర్పాటుచేసిన నిబంధన వలన సంస్థకు జరుగుతున్న నష్టం పై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ నివేదిక ఏమైంది అని ఆయన ప్రశ్నించారు. బిజెపి నేతలతో కలిసి నడుస్తున్న బిఎంఎస్, ఇతర కార్మిక సంఘాలను రాజకీయ జోక్యం అంటూ విమర్శించడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ ఉపాధ్యక్షులు నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జాహిద్ పాషా, నాయకులు పోలాడి శ్రీనివాస రావు, ఐ. సత్యం, ఏ.గోపి, అక్తార్ పాషా, రోడ్ల సంపత్, శంకర్, వి గౌడ్, రాజ్ కుమార్ చారి, గుమ్మడి సుందర్ పాల్గొన్నారు.



# రామగుండంలో ప్రతి నిరుపేదకు పక్కా ఇల్లు

**- ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన రెండు రోజుల్లో పూర్తి చేయాలి**

**- గుడిసె రహిత నగరమే లక్ష్యంగా అధికారులకు దిశానిర్దేశం : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం నియోజకవర్గంలో పేద ప్రజలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయడమే లక్ష్యమని, ఇందుకోసం రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో లిస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతోలి కలిసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ గృహ వసతి కల్పించే దిశగా చేపడుతున్న చర్యలపై చర్చించారు.

ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఉన్న ఎల్-1 (ఎల్1), ఎల్-2 దరఖాస్తులను గెజిటెడ్ అధికారులు రాబోయే రెండు రోజుల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మొదటి, రెండవ దశల్లో ఇందిరమ్మ కమిటీల నుంచి అందిన జాబితాను చాలా జాగ్రత్తగా, సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.ప్రభుత్వ ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రస్తుతానికి గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. నగరాన్ని గుడిసెలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని, ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి, ఎల్-2 జాబితాలో ఉన్న అర్హులను ఎల్-1కు పంపడం ద్వారా అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఆర్డీవో గంగయ్య, ఈడి. యం.కవిత, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో రక్షణ, ఉత్పత్తి పరికరాల

# కొరతను తక్షణమే నివారించాలి

## ఏఐటియుసి డిమాండ్



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి డిమాండ్ చేసింది. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే సంస్థ బకాయిలు వసూలు కాక, కార్మికుల రక్షణ పరికరాల కొరత తీవ్రమైందని ఆరోపించింది. సంవత్సరం కాలంగా ఉత్పత్తి మరియు రక్షణకు సంబంధించిన పరికరాలు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, మంగళవారం ఆర్జీ వన్ ఏరియాలోని గనులు, ఓసిపి 5, వివిధ డిపార్ట్మెంట్స్ అధికారులకు ఏఐటియుసి , ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు పాల్గొని మాట్లాడుతూ, డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు, చెమ్మసులు, డాగ్ నైల్స్, గిరిమిట్లు, టెక్నీషియన్ల టూల్స్, ట్యూబ్ లైట్లు వంటి ఉత్పత్తి సామగ్రి, బూట్లు, సాక్స్, గ్లౌజులు, హెల్మెట్లు, క్యాప్ లాంప్లు, జి.ఐ క్యానిస్టర్లు, బెల్ట్ క్యానిస్టర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, షాట్ ఫైరర్ కేబుల్ వంటి అత్యవసర భద్రతా పరికరాలు అందుబాటులో లేవని తెలిపారు. విడిభాగాలు, పని ముట్లు లేకపోవడం వల్ల ఉత్పత్తి లక్ష్యాలు సాధించడం కష్టమవుతోందని, పాతబడిన యంత్రాలతో పనిచేయడం వల్ల ఆపరేటర్లు నడుము నొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ, సేఫ్టీ ట్రైపార్టైట్ సమావేశాల్లో పలుమార్లు ప్రస్తావించినా ఫలితం లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధిని పట్టించుకోకుండా సంస్థను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు.సమస్యలు పరిష్కారం కాకపోతే కార్మికులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. యాజమాన్యం తక్షణమే స్పందించి ఉత్పత్తి మరియు భద్రతా పరికరాలు సమకూర్చి, కొత్త యంత్రాలు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, సిద్దమల్ల రాజు, ఎం. చక్రపాణి, దొంత సాయన్న, చెప్యాల భాస్కర్, పిట్ కార్యదర్శులు మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి, బండి మల్లేష్, గొడిశెల నరేశ్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అందమైన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలి

## నగర మేయర్ మహంకాళి స్వామి



**గోదావరిఖని, జనంసాక్షి :**
అందమైన నగరంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయ్ నగర్ పవర్ హౌజ్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ కంకణాల మౌనిక తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా తీర్చే క్రమంలో గత ఐదు నెలలుగా డ్రైనేజ్‌లలో పూడిక తీత కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతున్నదని అన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యం లో ఒక ప్రక్క కాలువలలో పూడిక పూడిక తీత కార్యక్రమం చేపడుతుంటే మరో ప్రక్క అదే కాలువల్లో చెత్త వేస్తుండడంతో యధావిధిగా తయారవుతు న్నదని అన్నారు. చెత్త వేయవద్దని ఇన్నాళ్ళూ అవగాహన కల్పించామని ఇక జరిమానాలు విధించక తప్పదని అన్నారు. కేవలం రూ 50/- చెల్లిస్తే నెల రోజుల పాటు ఇంటి ముందుకే వచ్చి చెత్త తీసుకెళ్ళే అవకాశం ఉండగా రోడ్లపై, నాలాల్లో వేయడం సరికాదని అన్నారు. స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో పాలు పంచుకోవాలని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎవరూ పట్టించుకోక పోవడంతో బొందల గడ్డ గా మారిన నగరాన్ని నవ నిర్మాణం చేస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్న ఎంఎల్ఎ రాజ్ ఠాకూర్‌కు సహకరించా లని అన్నారు. గంగా నగర ఫ్లై ఓవర్ ప్రక్కన సర్వీస్ రోడ్డు వెంబడి వెలసిన అక్రమ కట్టడాలతో రహదారి ఇరుకుగా మారి అనేక ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాటిని తొలగించడం జరిగిందని అన్నారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు కూడా తొలగించడం జరిగిందని అన్నారు. రోడ్డు మీద ఉన్న విద్యుత్ స్తంభాలు కూడా వెనక్కి తరలించవల్సిందిగా ఎన్‌పిడిసిఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. పదేళ్లుగా పట్టించుకోని నాలాలో యంత్రాల సహాయంతో పూడిక తొలగించి శుభ్రం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిఇఇ శ్రీకాంత్, ఎఇ తేజస్విని, టిపిఎస్ నవీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం, జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, సానిటరీ జవాన్ సోమేష్, వాటర్ సప్లయ్ సూపర్వైజర్ శశి కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# రెవెన్యూ అధికారులు సమయ పాలన పాటించాలి

- భూభారతి, సాదాబైనామా దరఖాస్తులు పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి);** రెవెన్యూ అధికారులు,సిబ్బంది సమయ పాలన పాటించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. మొత్తం సిబ్బంది ఎందరు ఉన్నారు అని ఆరా తీశారు. కార్యాలయంలో పరిశీలించారు. భూ భారతి,సాదాబైనామా దరఖాస్తులపై ఆరా తీశారు.పలు దరఖాస్తులు పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది విధులకు సమయానికి రావాలని సూచించారు.నిత్యం ప్రజలకు అందు బాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. భూ భారతి, సాదాబైనామా కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. కార్యాలయంలోని అన్ని ఫైళ్లను జాగ్రతగా భద్రపరచాలని, ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.ఇట్టి పరిశీలనలో ఇంచార్జి తహసీల్దార్ మురళి సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కరీంనగర్‌లో జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌కు శ్రీకారం

- శాస్త్రీయ దర్యాప్తు, ఆధునిక సాంకేతికతపై పోటీలు
- విజేతలకు లక్షల రూపాయలు, అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు
- నైపుణ్యాలు మెరుగుపరచుకునే అవకాశంగా భావించాలి



**కరీంనగర్ బ్యూరో, జూలై 7:** తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 3వ జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్-2026 జూలై 7, 8 తేదీల్లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, జోన్-3 పరిధిలోని కరీంనగర్, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి మొత్తం 91 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. యూనిట్ వారీగా కరీంనగర్ నుంచి 24 మంది, సిద్ధిపేట నుంచి 19 మంది, రాజన్న సిరిసిల్ల నుంచి 21 మంది, కామారెడ్డి నుంచి 13 మంది, మెదక్ నుంచి 14 మంది హాజరవుతున్నారని వివరించారు. ఈ డ్యూటీ మీట్ పోలీసు సిబ్బంది లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సమర్థవంతమైన సేవల అందింపులో మరింత నైపుణ్యం సాధించడానికి వేదికగా నిలుస్తుందని సీపీ గౌష్ ఆలం అన్నారు. శాస్త్రీయ దర్యాప్తు (సైంటిఫిక్ ఎయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్), యాంటీ సబోటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ పోటీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ అంశాల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని మల్టీ జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. పోటీల్లో విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాల ప్రకారం బంగారు పతక విజేతలకు రూ.3 లక్షలు, మూడు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, వెండి పతక విజేతలకు రూ.2 లక్షలు, రెండు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, కాంస్య పతక విజేతలకు రూ.1 లక్ష, ఒక అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్ అందజేయనున్నట్లు సీపీ ప్రకటించారు. అలాగే జట్టు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. ఈ డ్యూటీ మీట్‌ను కేవలం పోటీగా కాకుండా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకునే అవకాశంగా భావించి, క్రమశిక్షణ, అంకితభావం, సేవా తత్వంతో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, సమన్వయం మరింత బలోపేతమై ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వెంకటస్వామి మరియు ఇతర జిల్లాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్న వయసులోనే ఆగిన గుండె

## రోడ్డు ప్రమాదంలో ఏడేళ్ల బాలుడు మృతి.. మరణిస్తూ ఆరుగురికి పునర్జన్మ

**గంభీరావుపేట జూలై 07(జనం సాక్షి);** తల్లిదండ్రులకు తీరని లోటు మిగిల్చిన ఘటన చోటుచేసుకుంది వివరాల్లోకెళ్తే రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన బొంబాయి పాపారావు కూతురు సౌమ్య అల్లుడు రఘు, ఉద్యోగరీత్యా తమిళనాడు రాష్ట్రంలోని తిరునవెల్లి జిల్లా రాధాపురంలో ఉంటున్నారు, వీరి రెండో కుమారుడు అశ్విన్ (7) గత నెల రోడ్డుపై సైకిల్ పై వెళుతుండగా అతి వేగంగా వచ్చిన అంబులెన్స్ ను ఒకసారి ఢీకొట్టడంతో, ఆ బాలుడి తలకు తీవ్ర గాయాలై బ్రెయిన్ డెడ్ అయింది, ఎంత ప్రయత్నించినా బాలుడు బ్రతకడని తెలవడంతో అశ్విన్ తల్లిదండ్రులు తాత పాపారావు, బాలుడి అవయవాలు దానం చేయడానికి నిర్ణయం చేసుకున్నారు, రెండు కిడ్నీలు, కాలేయం, గుండె, రెండు కంటి అవయవాలను ఇతరులకు మార్పిడి చేశారు, ఇంత బాధలోనైనా మిగతా వారికి అవయవ దానం చేయడం మిగతా వారికి పునర్జన్మ ప్రసాదించాడు లింగన్నపేటలో నేడు అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.

# సోలార్ విద్యుత్ ప్లాంట్ కోసం స్థల పరిశీలన

**మల్లాపూర్,జూలై07(జనంసాక్షి):** మండలం లోని గుండంపల్లి గ్రామంలో సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు తలపెట్టిన సోలార్ పవర్ ప్లాంట్ కు మంగళవారం నాడు అధికారులు స్థల పరిశీలన చేశారు. జిల్లా సహకార అధికారి సిహెచ్. మనోజ్ కుమార్, మెట్పల్లి రెవిన్యూ డివిజన్ అధికారి నర్సింహ రావు, రెడ్కో జిల్లా మేనేజర్ దురిశెట్టి మనోహర్ లు ఇందులో పాల్గొన్నారు. ప్రధానమంత్రి కుసుమ్ ప్రాజెక్ట్ లో భాగంగా సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా అధికారులు స్థల పరిశీలన చేశారు. సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ఈ స్థలం అనువైనది అధికారులు అభిప్రాయ పడ్డారు. సహకార శాఖ ఆధ్వర్యం లో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ కేంద్రానికి అవసరమైన భూమి కేటాయింపు కు తాము సిద్ధంగా ఉన్నామని రెవిన్యూ డివిజనల్ అధికారి తెలిపారు.

## రాజన్న ఆలయంలో ఔట్‌సోర్సింగ్

# ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

- భర్తీ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని బీఆర్ఎస్ డిమాండ్
- ఖాళీలను ప్రకటించి బహిరంగ నోటిఫికేషన్ ఇవ్వాలని సూచన
- స్థానిక నిరుద్యోగులకు అన్యాయం జరగొద్దు : చల్మెడ లక్ష్మీనరసింహారావు
- భర్తీ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని విజ్ఞప్తి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 7 (జనంసాక్షి) :**



వేములవాడ రాజన్న ఆలయంలో భర్తీ చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో ముందుగా రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజన్న ఆలయంలో పలు విభాగాల్లో ఖాళీలు ఉన్న నేపథ్యంలో గతంలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఆ ప్రక్రియను పక్కనపెట్టి కొందరు మంత్రుల సిఫారసులతో పోస్టులు భర్తీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తుండడం ఆందోళనకరమని పేర్కొన్నారు. జిల్లాలో వేలాది మంది అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నప్పటికీ, వారిని విస్మరించి ఇతర ప్రాంతాల వారికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించడం సమంజసం కాదన్నారు. ఔట్‌సోర్సింగ్ పోస్టులు మాత్రమే కాకుండా అన్ని రకాల నియామకాల్లోనూ పారదర్శకత పాటించాలని కోరారు. ఆలయంలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను అధికారికంగా ప్రకటించి, పత్రికల ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. బహిరంగ నియామకాల ద్వారానే అర్హులకు సమాన అవకాశాలు లభిస్తాయని, రహస్యంగా నియామకాలు చేపట్టడం వల్ల స్థానిక నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారని అన్నారు. ఇప్పటికే మంత్రుల సిఫారసులతో భర్తీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఔట్‌సోర్సింగ్ పోస్టులపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక నిరుద్యోగులకు అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొంటూ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జిల్లా యువతకు నిజంగా న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే నియామకాలపై సమగ్ర విచారణకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే నిరుద్యోగ యువత ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. స్థానిక నిరుద్యోగ యువత పక్షాన బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. రాజన్న ఆలయంలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో అధికారికంగా ప్రకటించి, వాటి భర్తీలో స్థానికులకు ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఓటరు జాబితా సవరణలో పారదర్శకతకు ప్రాధాన్యం

- ప్రత్యేక సర్వే, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- డ్రై డే నిర్వహణతో దోమల నివారణపై ప్రజలకు అవగాహన
- ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, పరిశుభ్రతపై తనిఖీ
- వనమహోత్సవంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు



**కామారెడ్డి ప్రతినిధి జులై 7 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలో పలు అభివృద్ధి, పరిపాలనా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, ఓటరు జాబితా సవరణతో పాటు డ్రై డే నిర్వహణ, ప్రభుత్వ పాఠశాల తనిఖీ, వనమహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్, అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి వారి వివరాలను నిబంధనల మేరకు నమోదు చేయాలని సూచించారు. ఫారమ్‌ల సేకరణలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఏ ఒక్క అర్హుడూ జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి అవసరమైన దరఖాస్తులు సేకరించి నిర్ణీత గడువులోగా సంబంధిత కార్యాలయాలకు అందజేయాలని ఆదేశించారు. సేకరించిన ఫారమ్‌లను వేగంగా డిజిటలైజేషన్ చేసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డేటా ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని సూచించారు. డేటా ఎంట్రీలో పొరపాట్లు జరగకుండా ప్రతి దరఖాస్తును రెండుసార్లు పరిశీలించాలని, ప్రక్రియ పూర్తయిన అనంతరం తుది ఓటరు జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం అత్యంత కీలకమని, బీఎల్‌ఓలు, సూపర్వైజర్లు, తహశీల్దార్లు సమన్వయంతో పనిచేసి సమయపాలన పాటించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, స్వయం సహాయక సంఘాల ద్వారా ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి కాలానుగుణ వ్యాధులను నివారించవచ్చని పేర్కొంటూ ప్రతి కుటుంబం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం పట్టణంలోని 35వ వార్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యార్థులు, ప్రజలకు పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ ఎన్.వై. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ టి. పర్వతాలు, 35వ వార్డు కౌన్సిలర్ బోజన్నగారి వినోద, తహశీల్దార్ హిమబిందు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హిమాన్షు ముక్కుకు గాయం

- ఆస్పత్రికి వచ్చిన కెటిఆర్, కెసిఆర్



హైదరాబాద్, జూలై7 (జనంసాక్షి) : తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మనవడు, కేటీఆర్ తనయుడు హిమాన్షుకు స్వల్ప గాయమైంది. నిన్న ఆటలాడుతుండగా అతడి ముక్కుకు గాయమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వెంటనే ఆస్పత్రికి చేరుకోగా.. సిద్దిపేటలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి బయల్దేరి కేసీఆర్ కూడా ఆస్పత్రికి వెళ్లారు. మనవడిని పరామర్శించి.. అతడి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు తాను కోలుకుంటున్నట్లు హిమాన్షు ఎక్స్ వేదికగా వెల్లడించారు. చిన్నపాటి గాయమవ్వడంతో గత రాత్రి ఆస్పత్రిలో చేరానని తెలిపారు. పూర్తిగా కోలుకునేందుకు కొంత విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు హిమాన్షు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదిగా స్పందించారు. సోమవారం సాయంత్రం హిమాన్షుకు చిన్నపాటి గాయమైందని, ప్రస్తుతం చికిత్స కొనసాగుతున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల్లోనే పూర్తిగా కోలుకుంటాడని అన్నారు. హిమాన్షు ఆరోగ్యంపై ఆరా తీసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

- సీఈవోకు ఫిర్యాదు చేసిన బీజేపీ నేతలు



హైదరాబాద్, జూలై7 (జనంసాక్షి) : సర్ పక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా సర్ ఖీ విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు. తెలుగు ఫారాలతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాదే కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఇంగ్లీషు ఫారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా లోపాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# తుంగభద్రకు కొత్త నీరు రాక

- ఎగువన వర్షాలతో మొదలైన ప్రవాహం



కర్నూలు, జూలై7 (జనంసాక్షి) : ఆలస్యమైనా తుంగభద్రకు నీటి రాకడ మొదలైంది. అడుగంటిన తుంగభద్ర జలాశయంలోకి కొత్తనీరు చేరుతోంది. డ్యాం పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా సోమవారం 1550 క్యూసెక్కుల వరద మొదలై.. సాయంత్రానికి 2,159 క్యూసెక్కులకు పెరిగింది. రెండు రోజుల కిందటివరకూ చుక్కనీరు రాకపోవడంతో డ్యాం వెలవెలబోయింది. రైతాంగం, అధికార యంత్రాంగంలో నిస్తేజం అలుముకుంది. ఈ తరుణంలో నైరుతి రుతుపవనాలు కరుణించాయి. కర్ణాటకలోని మలెనాడు, తుంగభద్ర ఎగువ పరివాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తుంగ, భద్ర నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. తుంగ జలాశయం నిండటంతో పదిగేట్లను ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని సోమవారం దిగువకు విడుదల చేశారు. అక్కడి నుంచి తుంగభద్ర జలాశయానికి వరద నీరు చేరేందుకు సుమారు 310 కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. మరో రెండురోజుల్లో ఆ నీటి చేరికతో వరద పెరగనుంది. భద్ర జలాశయం కూడా నిండితే, వరద మరింత పెరుగుతుంది. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 1587.92 అడుగుల వద్ద 9.379 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో 77.343 టీఎంసీల నీరు ఉన్నింది. తుంగభద్ర డ్యాంకు వరద ఆలస్యం కావడం ఇదే మొదటిసారి కాదు. 2002-03, 2003-04, 2004-05, 2016-17, 2023-24 నీటి సంవత్సరాల్లోనూ వరద ఆలస్యమైంది. కొన్నిసార్లు జూలై రెండోవారంలోనూ వదర మొదలైంది. జూలై, ఆగస్టు నెలల్లోనూ వర్షాభావ పరిస్థితుల కారణంగా చెప్పుకోదగ్గ వరద రాలేదు. డెడ్ స్టోరేజీకి పడిపోయిన సందర్భాలూ ఉన్నాయి.

# సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కే. విద్యాసాగర్ బాధ్యతల స్వీకరణ

- చార్జ్ అప్పగించిన దివ్య దేవరాజన్



హైదరాబాద్ (జనంసాక్షి) : సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సమక్షంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కే.విద్యాసాగర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన దివ్య దేవరాజన్ పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ గా బదిలీ కావడంతో కొత్తగా పోస్టింగ్ అయిన విద్యాసాగర్‌కు ఛార్జ్ అప్పగించారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ జీ.చిన్నారెడ్డి వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. దివ్య దేవరాజన్ అందించిన సేవలను చిన్నారెడ్డి కొనియాడారు. నూతన స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ ఆధ్వర్యంలో సీఎం ప్రజావాణి కార్యక్రమం మరింత సజావుగా సాగుతుందని చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీఎం ప్రజావాణిలో 320 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 236వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 320 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 150, రెవెన్యూ శాఖకు సంబంధించి 46, హోం శాఖకు 21, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 101 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సందర్శించారు. సీఎం ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై సమన్వయ మండలి చైర్మన్ వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్ రావు, సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి, ప్రతినిధి పద్మారాణి కర్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

- రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు
- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



రంగారెడ్డి, జూలై7 (జనంసాక్షి) : రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజక వర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు
- గుట్టురట్టు చేసిన మియాపూర్ పోలీసులు
- మహారాష్ట్ర సరిహద్దులో శవాన్ని పూడ్చిపెట్టినట్లు గుర్తింపు





హైదరాబాద్, జూలై 7 (జనంసాక్షి) : ప్రియుడితో కలసి భర్తను హత్య చేసిన భార్య, ఏమీ తెలియదన్నట్లుగా మిస్సింగ్ కేసు పెట్టింది. భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. నగరంలోని మియాపూర్‌లో ఈ దారుణం జరిగింది. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి భార్య అత్యంత కిరాతంగా హత్య చేసింది. ఆ తరువాత భర్త కనిపించడం లేదంటూ గతేడాది నవంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన మియాపూర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా అసలు నిజాలు బయటకు వచ్చాయి. ఏడు నెలల తర్వాత ఈ కేసులో భార్యే హంతకురాలిగా పోలీసులు తేల్చారు. భర్తను భార్యే హత్య చేసి ఆపై కనిపించడం లేదంటూ నాటకం ఆడినట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా భార్య కాల్ రికార్డ్స్‌ను, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. భర్తను చంపి మృతదేహాన్ని మహారాష్ట్ర బోర్డర్ వరకు తరలించి పూడ్చిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు పెంటేష్(45)గా గుర్తించారు. తన ప్రేమ వ్యవహారానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో వెంకటేష్‌ను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో భార్య అంగీకరించింది. ప్రస్తుతం నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె ప్రియుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రియుడి కోసం కట్టుకున్న భర్తను భార్య హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత తగదు

- ప్రైవేటు పాఠశాలలను నియంత్రించాలి
- ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి
- ముఖ్యమంత్రికి విద్యావేత్తలు, మేధావులు, పౌర సమాజం బహిరంగ బహిరంగ లేఖ



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల బెంగళూరులో ద హిందూ హడల్ కాంక్లేవులో ప్రకటించడానికి తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ విద్యావేత్తలు మేధావులు ప్రముఖ కవులు ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు తక్షణమే ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వంద మందికి పైగా వివిధ రంగాలకు చెందిన మేధావులు ముఖ్యమంత్రికి ఒక బహిరంగ లేఖను రాశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పత్రికా విలేఖరుల సమావేశాన్ని నిర్వహించి బహిరంగ లేఖను విడుదల చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతంలో విస్తరించి ఉన్న 23 వేల బడుల మూసివేతను ఉపసంహరించుకోవాలని, విశ్రుంఖలంగా పెరిగిపోతున్న విద్యా ప్రైవేటీకరణ కార్పొరేటీకరణను నియంత్రించాలని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రవేశపెట్టాలని మరియు అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, సరిపడా టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ప్రముఖ పాత్రికేయుడు సంపాదకులు కే రామచంద్ర మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని రాష్ట్రంలో విద్యార్థులు లేరని 23 వేల పాఠశాలల మూసివేసే ఆలోచన తగదని, బడులను కుదిస్తే ప్రజలు విద్యకు దూరం చేసినట్లు అవుతుందని తెలిపారు. నాక్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలో ఉందని అలాగే రాజకీయాలలో విద్య లేదని కానీ విద్యలో రాజకీయాలు ఎక్కువైపోయాయని ఆ కారణంగానే సామాజిక అవసరాలు గుర్తించకుండా పాఠశాలల మూసివేత ప్రకటన చేశారని దుయ్యబట్టారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదనే నెపంతో పాఠశాలల మూసివేత నిర్ణయాలు గైకొనడం సరికాదని వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలేంటో శాస్త్రీయంగా అధ్యయనం చేశారా అని ప్రశ్నించారు. ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి నరసింహారెడ్డి ప్రసంగిస్తూ విద్యకు 15% నిధులు కేటాయిస్తామని గత ప్రభుత్వ మూసివేసిన 6000 పాఠశాలలను తెరిపిస్తామని తమ మేనిఫెస్టో ద్వారా హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక బడ్జెట్ కేవలం 8.2% మాత్రమే కేటాయించి మరియు ఏకంగా 23 వేల పాఠశాలలను మూసివేస్తామని ప్రకటించడం ప్రజలను ప్రజలను వహించడమే కాగలదన్నారు. కేంద్ర సమాచార కమిషన్ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ 23 వేల పాఠశాలల మూసివేత ద్వారా ఉత్పన్నమయ్యే పరిణామాల పట్ల భయంగొల్పుతున్నదని సాక్షాత్తు ముఖ్యమంత్రి విద్యామంత్రిగా ఉంటూ ఇలాంటి తిరోగమన నిర్ణయాలు తీసుకోవడం పట్ల తన ఆక్షేపణ ప్రకటించారు. హైకోర్టు సీనియర్ అడ్వకేట్ చిక్కుడు ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వము లాగానే నేటి ప్రభుత్వం కూడా ప్రజాస్వామికంగా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నదని రాజ్యాంగ పరిధిలో ప్రజా పాలన అందిస్తామని ప్రకటించి ఏకపక్షంగా 23 వేల పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించడాన్ని తప్పు పట్టారు ఆర్టిఈ చట్టం ప్రకారం గ్రామానికి పాఠశాల ఉండాలని డిమాండ్ చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ కవి రచయిత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ పాఠశాల మూసివేత ప్రకటన సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు. పాఠశాలల పరిరక్షణ మరియు బలోపేతం కోసం ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జి హరగోపాల్ ప్రసంగిస్తూ పాఠశాల మూసివేత ప్రకటన పౌర సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని బడికి గ్రామ ప్రజలకు ఉండే మానవీయ అనుబంధాన్ని తుంచి వేయడం తగదని తక్షణమే ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కే చక్రధర్ రావు మాట్లాడుతూ దేశంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందినదని అలాగే ఎక్కువ బడ్జెట్ కలిగి ఉందని అయినప్పటికీ విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయిస్తున్నారని కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యను విధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలను అదుపు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని జీవో ఎంఎస్ నెంబర్ వన్, విద్యా హక్కు 1982 నిబంధనల ప్రకారం నియంత్రించలేకపోతున్నదని విమర్శించారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ వనమాల, ఫిలిం ప్రొడ్యూసర్ సయ్యద్ రఫీక్, శంకర్ డిబిఎఫ్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం రాఘవాచారి, విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై.అశోక్ కుమార్, రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి ఎం రఘు శంకర్ రెడ్డి, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు పి మహేష్, పిడిఎస్యు విజృంభణ అధ్యక్షులు ఏ విజయ్ టి పి టి ఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, ఎం. ప్రకాష్ రావు, బి. ముత్యాలు, విజయ్ కుమార్, నర్సయ్య తదితరులు హాజరయ్యారు.

# రిటైర్డ్ టీచర్ ఆత్మహత్య

- 33 పేజీల సూసైడ్ నోట్ స్వాధీనం



జనగామ, జూలై7 (జనం సాక్షి) : జిల్లాలో రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. జనగామ పట్టణంలోని పూర్ణిమ కాలనీకి చెందిన పగిడిపల్లి మల్లయ్య అనే రిటైర్డ్ టీచర్ ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. చనిపోయే ముందు తన చావుకు కారణమైన వారి పేర్లతో మల్లయ్య సూసైడ్ నోట్ రాశారు. మొత్తం 33 పేజీల సూసైడ్ నోట్‌ను రాసి చనిపోయారు. రిటైర్డ్ టీచర్ రాసిన నోట్‌లో బావమర్దులు గుంటి రత్నాకర్, మనోహర్ పేర్లు ఉన్నాయి. వీరిద్దరి వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మల్లయ్య లెటర్‌లో రాశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు మల్లయ్య రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసుల విచారణ కొనసాగనుంది. మల్లయ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మృతి

- సంతాపం తెలిపిన కెసిఆర్



హైదరాబాద్, జూలై 7 (జనంసాక్షి) : తొలిదశ తెలంగాణ ఉద్యమ కారుడు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో నిరాడంబరత, నీతి నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన ప్రజల మనిషి నర్సింహా రెడ్డి అని, వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. భూదానోద్యమంలో తను వందలాది ఎకరాలను పేదలకు పంచిన నర్సింహా రెడ్డి, 1969లో తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో పాల్గొని, మూసీ పరిరక్షణ, తెలంగాణకు గోదావరి నదీ జలాల కోసం కృషి చేశారని తెలిపారు. శోక తప్తులైన కొమ్మిడి నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

విజయనగరం, జూలై7 (జనంసాక్షి) : భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను వేగంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తుది మెరుగుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీఎంఆర్‌తో కలిసి బ్రహ్మాండమైన ఎయిర్‌పోర్టును నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇక్కడికి వచ్చారని.. అనుకున్న సమయానికంటే ముందుగానే నిర్మాణం చేపట్టాలని ఆదేశించారని అన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370